
'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు.
పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు
ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 136

మంగళవారం 31-1-2023




మన హాకీ.. మళ్లీ మొదటికి
భారత హాకీ జట్టు చీఫ్ కోచ్ పదవికి గ్రాహమ్ రాజీనామా - 12లో



కోలుకున్న మార్కెట్లు..
స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు.. సెన్సెక్స్ 170 పాయింట్ల లాభం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మోదీ-బీబీసీ పిల్స్‌పై విచారణ
బీబీసీ డాక్యుమెంటరీ మీద కేంద్రం ఆంక్షలు విధించడంపై దాఖలైన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 6న విచారించనుంది.
వివరాలు 6లో ▸



పాక్‌లో ఆత్మాహుతి దాడి
పెషావర్‌లో మసీదుకు వచ్చిన వారిని లక్ష్యంగా చేసుకుని తాలిబన్లు జరిపిన ఆత్మాహుతి దాడిలో 61 మంది ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸



బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు
చావనైనా చస్తాను కానీ, బీజేపీతో మళ్లీ జట్టుకట్టేది లేదని జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ తెగేసి చెప్పారు.
వివరాలు 6లో ▸



మెక్సికో నైట్‌క్లబ్‌లో కాల్పులు
మెక్సికోలోని ఓ నైట్‌క్లబ్‌లో సాయుధ దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో 8 మంది ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

గవర్నర్ వ్యవస్థతో రాజకీయం వద్దు



రాజ్యాంగంలోని అత్యంత కీలకమైన గవర్నర్ వ్యవస్థతో రాజకీయాలు చేయడం సరి కాదని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గవర్నర్ వ్యవస్థకు ప్రభుత్వాలు గౌరవం ఇవ్వాలని హితవు పలికారు.
వివరాలు 14 ▸

ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకుంటామని, పరిశ్రమను పరిరక్షించుకుంటామని ప్రజలు, కార్మికులు గర్జించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను వెంటనే విరమించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.
వివరాలు 14 ▸

'హార్ట్'ఫుల్‌గా సర్జరీలు



విజయవాడ జీజీహెచ్‌లో పూర్తిస్థాయి గుండె వైద్యం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే కార్డియాలజీ సేవలు అందిస్తుండగా.. ఫిబ్రవరి మొదటి వారం నుంచి కార్డియోథొరాసిక్ సర్జరీలూ చేయనున్నారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, పరికరాలు, నిపుణులైన సిబ్బందిని అందుబాటులోకి తెచ్చారు.
వివరాలు 10 ▸

గవర్నర్ ప్రసంగంతోనే తెలంగాణ బడ్జెట్!



తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై చిక్కుముడి వీడింది. బడ్జెట్‌ను ఆ రాష్ట్ర గవర్నర్ తమిళి సై ఆమోదించనున్నారు. అలాగే గవర్నర్ ప్రసంగంతోనే సమావేశాలను ప్రారంభించేందుకు ఆ ప్రభుత్వం అంగీకరించింది. హైకోర్టు సూచనల మేరకు ఇరువర్గాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి.
వివరాలు 10 ▸



పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

దేశానికే ఆదర్శంగా ఏపీ

వినుకొండ సభలో సీఎం జగన్

- జీడీపీలో మన గ్రోత్ రేట్ 11.43%
- దేశంలోనే మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది
- ప్రతి రంగంలో ముందుకు దూసుకెళ్తున్నందునే ఇది సాధ్యమైంది
- రాష్ట్రం శ్రీలంక అయిపోతోందంటూ గిట్టనివాళ్ల దుష్ప్రచారం
- గజదొంగల పాలన కావాలా?.. అవినీతికి చోటు లేని పాలన కావాలా?
- తోడేళ్ల గుంపుతో పోరాటం చేస్తున్నాం
- మీ బిడ్డకు పొత్తుల్లేవు.. వాళ్ల మీదా వీళ్లమీదా ఆధారపడడు.. ఒక్కడే సింహంలా నడుస్తాడు
- వరుసగా మూడో ఏడాది జగనన్న చేదోడు అమలు
- 3,30,145 మంది ఖాతాలకు రూ.330.15 కోట్లు జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

2లో



ఈరోజు మన రాష్ట్రం దేశంలోనే అత్యధిక జీడీపీ 11.43 శాతంతో మొదటి స్థానంలో ఉంది. గ్రోత్ రేటులో దేశానికే ఆదర్శంగా పరుగులు తీస్తోంది. జగన్ మాదిరిగా పరిపాలన చేస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందంటూ మీ బిడ్డ అంటే గిట్టని కొందరు అబద్ధాలు చెబుతున్న నేపథ్యంలో ఒక్కసారి ఆలోచన చేయండి. వాళ్ల హయాంలో ఎన్నడూ జరగని విధంగా మీ బిడ్డ హయాంలో రాష్ట్రం పరుగెడుతోందంటే కారణం?.. ప్రతి రంగాన్ని చేయి పట్టుకుని నడిపించగలిగితే పరుగులు పెడతాయి. మంచి గ్రోత్ రేట్ నమోదు అవుతుంది. ప్రతి కుటుంబం బాగుపడుతుంది.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

రేపు బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి సీతారామన్ 6లో

తొలి విడత ఫిబ్రవరి 14 వరకు.. రెండో విడత మార్చి 12 నుంచి ఏప్రిల్ 6 వరకు

ఢిల్లీ చేరుకున్న సీఎం జగన్

- అంతకుముందు.. విమానంలో సాంకేతిక లోపం
- గన్నవరంలోనే అత్యవసరంగా ల్యాండ్ చేసిన పైలట్లు
- మళ్లీ రాత్రి 9.28కి ఢిల్లీకి వేరే విమానంలో బయలుదేరిన ముఖ్యమంత్రి
- నేడు ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సన్నాహక సమావేశానికి హాజరు

2లో

మార్చిలోగా 4 వేల ఫిష్ అవుట్‌లెట్లు

ఆక్వా సాధికారత కమిటీ భేటీలో అధికారులకు మంత్రుల ఆదేశం

- ఆక్వా రంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం జగన్
- ఆక్వా ఉత్పత్తుల స్థానిక వినియోగం పెంచేందుకు ప్రోత్సాహం
- ఇతర రాష్ట్రాల్లోనూ ఆక్వా హబ్‌ల ద్వారా విక్రయాలు.. అన్ని ప్రముఖ నగరాల్లో ఆక్వా ఫుడ్ ఫెస్టివల్స్
- అర్హత ఉన్న ప్రతి ఆక్వా రైతుకు విద్యుత్ సబ్సిడీ



సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీదిరి అప్పలరాజు

సాక్షి, అమరావతి: మార్చి నెలాఖరులోగా రాష్ట్రంలో 4 వేల ఫిష్ అవుట్‌లెట్ల ఏర్పాటు పూర్తి చేయాలని ఆక్వా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, డాక్టర్ సీదిరి అప్పలరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో జరిగిన ఆక్వా సాధికారత కమిటీ సమావేశంలో ఆక్వా రంగం అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు ఆక్వా రైతులకు అండగా నిలవడం, సీడ్, ఫీడ్ రేట్లను శాస్త్రీయంగా నిర్ణయించడం, ధరల స్థిరీకరణ

మిగతా 10వ పేజీలో ▶

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు లోకేశ్

3లో

- బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు చంద్రబాబు సీఎం కాదు
- వారి గురించి మాట్లాడే నైతిక అర్హత టీడీపీకి లేదు
- బీసీల సంక్షేమంపై చర్చకు సిద్ధమా?
- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కౌంటర్



మాంసం పంట పండుతుంది

- త్వరలో ప్రపంచ మార్కెట్‌లోకి 'సెల్ కల్చర్డ్ చికెన్'
- కోడి స్టెమ్ సెల్స్ నుంచి చికెన్ ఉత్పత్తికి రంగం సిద్ధం
- ఇకపై పంటల మాదిరిగానే మాంసం కూడా పండిస్తారు
- తొలి పంటకు 14 రోజులు.. ఆపై 18 నుంచి 24 గంటలకు రెట్టింపు.. కొవ్వు తక్కువ.. పోషకాలు ఎక్కువ
- ఈ ఏడాది నుంచే అమెరికన్ రెస్టారెంట్లలో అందుబాటులోకి
- భవిష్యత్‌లో పశు మాంసం, పీత, బాతు మాంసం కూడా ఇదే తరహాలో..

14లో

హింసను ప్రేరేపిస్తున్నారు

మోదీ, అమిత్ షాలపై కాంగ్రెస్ నేత రాహుల్ ధ్వజం

- ఆ నొప్పి వారికర్థం కాదంటూ చురకలు.. కశ్మీర్లో పాదయాత్ర చేయాలంటూ సవాలు
- ఘనంగా ముగిసిన భారత్ జోడో యాత్ర.. శ్రీనగర్‌లో వణికించే చలిలో ముగింపు సభ
- నా కోసం కాదు, దేశం కోసమే పాదయాత్ర.. మంచులో తడుస్తూనే మాట్లాడిన రాహుల్
- హాజరై సంఘీభావం ప్రకటించిన 9 విపక్షాలు



దేశంలో స్వేచ్ఛాయుత, లౌకిక విలువలపై ప్రధాని మోదీతో పాటు బీజేపీ, ఆరెస్సెస్ నిత్యం దాడి చేస్తున్నాయి. నిరంతరం హింసను ప్రేరేపిస్తున్నాయి. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు ఇక లేరని తెలుసుకున్నప్పుడు విలవిల్లాడిపోయా. ఆ బాధను కశ్మీరీలు అర్థం చేసుకోగలరు. ఉగ్రదాడులకు బలైన ఆర్మీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది కుటుంబాలు అర్థం చేసుకోగలవు. అంతేగానీ హింసను ప్రేరేపించే ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వంటి వాళ్లకు ఎన్నటికీ అర్థం కాదు. బీజేపీ అగ్ర నేతలకు అంతులేని భయం. అందుకే జమ్మూకశ్మీర్‌లో పాదయాత్ర చేయలేరు.
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

6లో

ఇదండీ సంగతి



యువతకు తలా ఒక ల్యాప్‌టాప్ ఇస్తే తమ భవిష్యత్‌ను వాళ్లే 'బంగారం' చేసుకుంటారట సార్!!

ఆశల పట్టాలపై రైల్వే ప్రాజెక్టులు

రైల్వే బడ్జెట్ 2023-24

ఈసారైనా రాష్ట్రానికి సముచిత స్థానం దక్కేనా..?

- కేంద్రానికి కీలక ప్రతిపాదనలు పంపిన రాష్ట్రం
- 4 దీర్ఘకాలిక పెండింగ్ ప్రాజెక్టులను కేంద్ర నిధులతోనే చేపట్టాలి.. కొత్తగా రెండులైన్లకు పచ్చజెండా ఊపాలి
- విశాఖపట్నం రైల్వేజోన్‌ను పట్టాలెక్కించాలి
- కర్నూలు–వైజాగ్ ప్రత్యేక ఫ్రైట్ కారిడార్‌ను, 28 ఆర్వోబీలను ఓకే చేయాలి

సాక్షి, అమరావతి: కేంద్రప్రభుత్వ బడ్జెట్ రైలు ఈసారైనా రాష్ట్రంలో ఆగుతుందా.. దీర్ఘకాలిక రైల్వే ప్రాజెక్టులను గమ్యస్థానానికి చేరుస్తుందా.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2023–24కు గాను కేంద్ర బడ్జెట్‌ను లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర బడ్జెట్‌లో అంతర్భాగంగానే రైల్వే బడ్జెట్‌ను కూడా ఆమె సమర్పిస్తారు. దీంతో ఈసారైనా రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యం లభిస్తుందా లేదా అన్న ఆసక్తి నెలకొంది. రైల్వే ప్రాజెక్టుల్లో ఆంధ్రప్రదేశ్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈమేరకు కేంద్ర రైల్వేశాఖకు స్పష్టమైన ప్రతిపాదనలు పంపింది. దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న నాలుగు ప్రధాన ప్రాజెక్టులతోపాటు ప్రత్యేక ఫ్రైట్ కారిడార్, ఆర్వోబీల నిర్మాణాన్ని ఆమోదించాలని కోరింది. ప్రధానంగా భూసేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది కాబట్టి నిర్మాణ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని స్పష్టం చేసింది. మరోవైపు రాష్ట్ర పునర్విభజన చట్టం హామీలను గుర్తుచేస్తూ విశాఖపట్నం రైల్వేజోన్ ఆచరణలోకి వచ్చేలా చూడాలని కోరింది. ఆ చట్టం ప్రకారం కొత్తగా రెండులైన్లకు పచ్చజెండా ఊపాలని ప్రతిపాదించింది.

ఈ నాలుగు.. ఇంకెన్నేళ్లు?

రాష్ట్రంలో 4 ప్రధాన ప్రాజెక్టులు దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తావించింది. అహేతుక రాష్ట్ర విభజనతో ఏపీ తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో

మిగతా 3వ పేజీలో ▶



సీమ, ఉత్తరాంధ్ర మధ్య ప్రత్యేక ఫ్రైట్ కారిడార్

రాయలసీమను ఉత్తరాంధ్రతో అనుసంధానిస్తూ ప్రత్యేక ఫ్రైట్ కారిడార్‌ను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కర్నూలు నుంచి విశాఖపట్నం వరకు ఈ ప్రత్యేక కారిడార్‌తో వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల కార్గో రవాణా ఊపందుకుంటుందని తెలిపింది. తద్వారా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లతో రాయలసీమకు నేరుగా రైల్వే కనెక్టివిటీ పెరుగుతుందన్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం.

క్లుప్తంగా...

ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి జగన్


ఎయిర్‌పోర్ట్‌కు తిరిగి చేరుకున్న విమానం

సాక్షి, అమరావతి/గన్నవరం: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీలో మంగళవారం జరగనున్న ఏపీ గ్లోబల్‌ ఇన్వెస్టర్‌ సదస్సు సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్‌ జవహర్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, స్పెషల్‌ సీఎస్‌ పూనం మాలకొండయ్యతో పాటు పలువురు అధికారుల బృందం సోమవారం సాయంత్రం బయల్దేరింది. అయితే, సా.5.03 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి టేకాఫ్‌ అయ్యిన కొద్దిసేపటికే విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఏసీ వాల్వ్‌లో లీకేజి కారణంగా ప్రెజరైజేషన్‌ సమస్య తలెత్తినట్లు పైలట్‌ గుర్తించారని సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో పైలట్లు ఎయిర్‌ ట్రాఫిక్‌ కంట్రోల్‌కు సమాచారమిచ్చారు. ఏటీసీ సూచన మేరకు విమానాన్ని వెనక్కి తీసుకొచ్చి 5.26 గంటలకు గన్నవరంలో అత్యవసరంగా ల్యాండ్‌ చేశారు. అక్కడి నుంచి 6.06 గంటలకు సీఎం తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకున్నారు. మళ్లీ ఆయన రాత్రి 9.28 గంటలకు వేరే ప్రత్యేక విమానంలో గన్నవరంలో బయల్దేరి 11.30కు ఢిల్లీ చేరుకున్నారు.

బాపూజీ జీవితం ఆదర్శనీయం

- గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌


మహాత్ముడికి నివాళి అర్పిస్తున్న గవర్నర్‌

సాక్షి, అమరావతి: అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్మా గాంధీ యావత్‌ ప్రపంచానికి ఆదర్శప్రాయులని గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌ పేర్కొన్నారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో సోమవారం బాపూజీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీజీ జీవితాన్ని దేశ ప్రజలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జాతి సమగ్రత, ఐక్యతను నిలబెట్టేందుకు గాంధీజీ అనుసరించిన శాంతియుత మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు.

మహాత్ముడికి సీఎం జగన్‌ నివాళి

సాక్షి,అమరావతి: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రజల కోసం బాపూజీ అడుగుజాడల్లో నడుస్తానని, మన దేశం పట్ల ఆయన దార్శనికతను సాకారం చేసుకుందాం.. అని సీఎం పిలుపునిచ్చారు. 'ఈ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కూడా మన జాతిపిత మహాత్మా గాంధీజీకి నివాళులర్పిస్తున్నాను.. ఆంధ్రప్రదేశ్‌ ప్రజల కోసం, మన దేశం పట్ల ఆయన దార్శనికతను సాకారం చేసేందుకు ఆయన అడుగుజాడల్లో నడుస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. నాకు, నా రాష్ట్రానికి, మనకు ఎప్పటికీ ఆయన ప్రియమైన గాంధీతాత' అంటూ ట్వీట్‌ చేశారు.

8న మంత్రివర్గ భేటీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ అధ్యక్షతన ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి బ్లాకు కేబినెట్‌ సమావేశ మందిరంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్‌ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

- నేడు దక్షిణ కోస్తా, రాయలసీమలకు వర్షసూచన


సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం మరింత బలపడి సోమవారం వాయుగుండంగా మారింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా గంటకు 13 కిలోమీటర్ల వేగంతో పయనిస్తోంది. ఈ వాయుగుండం సోమవారం రాత్రికి శ్రీలంకలోని ట్రింకోమలికి తూర్పు ఆగ్నేయంగా 530, భారత్‌లోని కరైకల్‌కు తూర్పు ఆగ్నేయంగా 750 కిలోమీటర్ల దూరంలోను కేంద్రీకృతమై ఉంది. ఇది మంగళవారం సాయంత్రం వరకు పశ్చిమ వాయవ్య దిశగా కదులుతుందని, అనంతరం మలుపు తిరిగి క్రమంగా దక్షిణ నైరుతి వైపు పయనిస్తుందని, బుధవారం మధ్యాహ్నానికి శ్రీలంక వద్ద తీరాన్ని దాటుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో వివరించింది. దీని ప్రభావంతో మంగళవారం దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం నుంచి రెండురోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది.

మార్చేస్తోంది.. మరమేధ!

మానవ మేధకు మరో రూపం.. 'ఆర్టిఫిషియల్‌ జనరల్‌ ఇంటెలిజెన్స్‌'



- 'ఏఐ'ని మించిన టెక్నాలజీగా వర్ణన
- ఎలాంటి సమస్యకైనా ఇట్టే పరిష్కారం
- వైద్యంతోపాటు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- 2045 నాటికి సాధ్యమంటున్న టెక్‌ నిపుణులు
- ఏజీఐతో మానవులు పోటీపడలేరని హెచ్చరించిన స్టీఫెన్‌ హాకింగ్‌..మానవ జాతిని అంతం చేస్తుందన్న విఖ్యాత శాస్త్రవేత్త



(నానాజీ అంకంరెడ్డి, సాక్షి ప్రతినిధి)

హాలీవుడ్‌ నటుడు విల్‌స్మిత్‌ 2004లో నటించిన చిత్రం 'ఐ–రోబోట్‌' గుర్తుంది కదా! అందులో రోబోలు మానవ సైకాలజీ ఆధారంగా పనిచేస్తాయి. అమెరికాలో 2035 నాటికి ఇలాంటి పరిస్థితి ఉండొచ్చని నిర్మించిన ఊహాజనిత చిత్రమది. పరిస్థితి అంతలా కాకున్నా.. 2045 నాటికి మానవ మేధస్సుతో సమానంగా పోటీపడే సాంకేతిక పరిజ్ఞానం సాధ్యమేనంటున్నారు.. టెక్‌ నిపుణులు. ప్రస్తుత 'ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ) టెక్నాలజీ'ని దాటి మనిషిలా ఆలోచించి, నిర్ణయాలు తీసుకుని సమస్యలు పరిష్కరించే 'ఆర్టిఫిషియల్‌ జనరల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏజీఐ)' టెక్నాలజీ వస్తుందంటున్నారు. హాంకాంగ్‌కు చెందిన హన్సన్‌



రోబోటిక్స్‌ కంపెనీ 2016లో ఏఐ టెక్నాలజీతో నిర్మించిన 'సోఫియా' హ్యూమనాయిడ్‌ రోబో ప్రోగ్రామింగ్‌కు అనుగుణంగా పనిచేస్తోంది. అలాగే యూకేకు చెందిన ఇంజినీర్డ్‌ ఆర్ట్స్‌ సంస్థ 2021 డిసెంబర్‌లో అడ్వాన్స్‌డ్‌ ఏఐ టెక్నాలజీతో నిర్మించిన 'అమెకా' హ్యూమనాయిడ్‌ రోబో మానవ ముఖ కవళికలను అర్థం చేసుకోవడంతో పాటు ఎన్నో హావభావాలను పలికిస్తోంది. ఇకపై వచ్చే టెక్నాలజీ మనిషితో పోటీపడుతుందని.. అది ఆర్టిఫిషియల్‌ జనరల్‌ ఇంటెలిజెన్స్‌ టెక్నాలజీ అని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సాంకేతికతతో అన్ని రంగాల్లోనూ విప్లవాత్మక మార్పులు వేగంగా వస్తాయని చెబుతున్నారు. ఈ రోబోలు మానవ మేధస్సును మించిపోతే ముప్పు కూడా ఉండొచ్చని మరికొందరు హెచ్చరిస్తున్నారు.

'ఏఐ'ని మించిన టెక్నాలజీ..

సిద్ధాంతపరంగా మనిషి ఏ పనిచేసినా మేధస్సును ఉపయోగించి సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. మనిషికంటే మెరుగ్గా, చురుగ్గా పనిచేస్తేనే టెక్నాలజీకి విలువ పెరుగుతుంది. ప్రస్తుతం ఉన్న 'ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ)' టెక్నాలజీ మనిషి చేసే కొన్ని నిర్దిష్ట పనులు మాత్రమే చేయగలుగుతుంది. అంటే.. కంప్యూటర్‌ సాఫ్ట్‌వేర్‌లో సమస్య ఎదురైతే హెచ్చరిస్తుంది గాని సమస్యను పరిష్కరించలేదు. వాహనాల్లో వినియోగిస్తున్న ఏఐ టెక్నాలజీ ప్రమాదాలను గుర్తించి హెచ్చరిస్తుంది గాని ఆపలేదు. ఇప్పటికే ఉన్న అనేక ఏఐ సిస్టమ్స్‌ సెల్ఫ్‌ డెవలప్‌మెంట్‌ కోసం, నిర్దిష్ట సమస్యలు పరిష్కరించడానికి మెషిన్‌ లెర్నింగ్‌, డీప్‌ లెర్నింగ్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ లెర్నింగ్‌, నేచురల్‌ లాంగ్వేజ్‌ ప్రాసెసింగ్‌ వంటి సాంకేతిక నైపుణ్యాలు అవసరమవుతాయి. అయితే, ఇవేమీ మానవ మెదడు సామర్థ్యాన్ని చేరుకోలేకపోయాయి. అయితే ఏజీఐ టెక్నాలజీ మాత్రం మానవ సామర్థ్యాలతో సమానంగా లేదా అంతకు మించిన కృత్రిమ మేధస్సుకు ఉదాహరణగా పేర్కొంటున్నారు. ప్రస్తుతం అడ్వాన్స్‌డ్‌ ఏఐ టెక్నాలజీపై పరిశోధన చేస్తున్న నిపుణులు భవిష్యత్‌లో పూర్తి స్థాయి ఏజీఐ టెక్నాలజీ సాధ్యమేనంటున్నారు.

యంత్రానికి ఇంగితజ్ఞానం ఉంటే.. అది ఏజీఐ..

టెక్నాలజీ ఎంత పెరిగినా మనిషికున్న ఇంగిత జ్ఞానం (కామన్‌సెన్స్‌) యంత్రాలకు, సాఫ్ట్‌వేర్‌కు ఉండదు. ఒకవేళ యంత్రాలకే ఇంగితజ్ఞానం ఉంటే.. అది ఆర్టిఫిషియల్‌ జనరల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏజీఐ) అవుతుందని దీన్ని సమర్థించే వారు చెబుతున్నారు. కంప్యూటర్‌ సైన్స్‌లో ఏజీఐ అనేది సమగ్రమైన, పూర్తి కంప్యూటింగ్‌ సామర్థ్యాలు గల తెలివైన వ్యవస్థగా అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం ఏ పనిచేయాలన్నా టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్‌ తప్పనిసరిగా మారింది. అయితే, వాటిలో సాంకేతిక సమస్య ఎదురైతే నిపుణులైన వారే సరిచేయాలి. ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నది ఇదే. అయితే, టెక్నాలజీలో ఏ సమస్య ఎదురైనా ఏజీఐ గుర్తించి పరిష్కరిస్తుందని టెక్‌ నిపుణులు చెబుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆధునిక కాలంలో మనిషి చేయగల ఏ పనినైనా ఏజీఐ వ్యవస్థ చేస్తుందంటున్నారు. ప్రస్తుతానికి నూరు శాతం పనిచేసే ఏజీఐ వ్యవస్థ లేకపోయినప్పటికీ.. అత్యంత బలమైన ఈ కృత్రిమ మేధస్సును టెక్‌ దిగ్గజ సంస్థ ఐబీఎం తయారు చేసిన వాట్సన్‌ సూపర్‌ కంప్యూటర్‌లోనూ, సెల్ఫ్‌ డ్రైవింగ్‌ కార్లలోను కొంతమేర వినియోగిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ టెక్నాలజీ ఎలాంటి డేటానైనా అద్భుతమైన వేగంతో యాక్సెస్‌ చేయడంతోపాటు ప్రాసెస్‌ చేస్తుందంటున్నారు. అవసరాన్ని బట్టి నిర్ణయాలు తీసుకోవడంలో మానవ మెదడు కంటే వందల రెట్లు వేగంగా స్పందిస్తుందని పేర్కొంటున్నారు. ఏజీఐ వ్యవస్థ ఇంగిత జ్ఞానం, నిశిత ఆలోచన, బ్యాక్‌గ్రౌండ్‌ నాలెడ్జ్‌, ట్రాన్స్‌ఫర్‌ లెర్నింగ్‌ వంటి సామర్థ్యాలను కలిగి ఉంటుందని వివరిస్తున్నారు. అందువల్ల మనిషిలాగే సృజనాత్మకంగా ఆలోచిస్తుందని చెబుతున్నారు.

ఏజీఐతో ఏ పనైనా సుసాధ్యమే..

ప్రస్తుతం ఏజీఐ టెక్నాలజీని కొన్ని విభాగాలలో కొంతమేర వినియోగిస్తున్నట్టు టెక్‌ నిపుణులు చెబుతున్నారు. ఐబీఎం వాట్సన్‌ సూపర్‌ కంప్యూటర్లు సగటు కంప్యూటర్‌ చేయలేని గణనలను చేయగలవని అంటున్నారు. వీటిని పూర్తిస్థాయి ఏజీఐ టెక్నాలజీతో అనుసంధానం చేస్తే విశ్వం ఆవిర్భావానికి సంబంధించిన బిగ్‌ బ్యాంగ్‌ సిద్ధాంతాన్ని తెలుసుకోవచ్చని పేర్కొంటున్నారు. రోగి డేటా ఆధారంగా ఔషధాలను కూడా సిఫారసు చేయవచ్చంటున్నారు. సెల్ఫ్‌ డ్రైవింగ్‌ కార్లలో వినియోగిస్తే.. రోడ్డుపై ఇతర వాహనాలు, వ్యక్తులు, వస్తువులను గుర్తించడంతో పాటు డ్రైవింగ్‌ నిబంధనలకు కట్టుబడి ప్రయాణం చేయవచ్చని చెబుతున్నారు. ప్రమాదాలను ముందుగానే నూరు శాతం గుర్తించి గమనాన్ని మార్చుకునే అవకాశం కూడా ఉంటుందని వివరిస్తున్నారు. ఏఐ అటార్నీగా పిలిచే 'రోస్‌ ఇంటెలిజెన్స్‌' (న్యాయ నిపుణుల వ్యవస్థ)లోని ఒక బిలియన్‌ టెక్ట్స్‌ డాక్యుమెంట్ల డేటాను విశ్లేషించి.. సంక్లిష్టమైన ప్రశ్నలకు మూడు సెకన్ల కంటే తక్కువ వ్యవధిలో సమాధానం చెప్పగలదని ప్రయోగాలు నిరూపించాయంటున్నారు. అయితే, ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్‌ హాకింగ్‌ 2014లో ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ 'ఏజీఐ సాధ్యమే.. పూర్తి కృత్రిమ మేధస్సు అభివృద్ధి చెందితే అది మానవ జాతిని అంతం చేస్తుంది. ఇది తనంత తానుగా నిర్ణయాలు తీసుకుంటుంది.. మానవులు దానితో పోటీ పడలేరు'' అని హెచ్చరించారు. అయినప్పటికీ, కొంతమంది ఏఐ నిపుణులు ఏజీఐ టెక్నాలజీ అవసరమని భావిస్తున్నారు. దీనిపై పనిచేస్తున్న అమెరికాకు చెందిన కంప్యూటర్‌ సైన్స్‌ శాస్త్రవేత్త రే కుర్జ్‌వీల్‌ 2029కి కంప్యూటర్లు మానవ మేధస్సు స్థాయిని సాధిస్తాయని స్పష్టం చేస్తున్నారు. 2045 నాటికి ఏజీఐ టెక్నాలజీ, మానవ మేధస్సు సమానంగా పనిచేస్తాయని తెలిపారు.

దేశానికే ఆదర్శంగా ఏపీ

వినుకొండ సభలో సీఎం వైఎస్‌ జగన్‌


జగనన్న చేదోడు లబ్ధిదారులతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి



లబ్ధిదారులకు జగనన్న చేదోడు చెక్కును అందిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌ 11.43 శాతం జీడీపీ గ్రోత్‌రేట్‌ నమోదు చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, వృద్ధి రేటు విషయంలో ఆదర్శంగా ఉందని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రతి రంగంలోనూ ముందుకు దూసుకువెళ్తుండటంతోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. వరుసగా మూడో ఏడాది జగనన్న చేదోడు పథకం ద్వారా 3,30,145 మంది లబ్ధిదారులకు రూ.330.15 కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జగన్‌ సోమవారం పల్నాడు జిల్లా వినుకొండలో బటన్‌ నొక్కి ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆ వివరాలివీ..

వెన్నెముక వర్గాలు..

వెనుకబడిన కులాలు, వర్గాలను వెన్నెముక కులాలుగా మారుస్తామన్న మాటను నిలబెట్టుకుంటూ మూడున్నరేళ్లుగా నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద కుటుంబానికి మేలు చేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా సొంత షాపులున్న రజక సోదరులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేలా జగనన్న చేదోడు పథకాన్ని తెచ్చాం. జగనన్న చేదోడు ద్వారా ఈరోజు ప్రయోజనం పొందుతున్న వారిలో నాయీ బ్రాహ్మణులు 47,533, రజకులు 1,14,661, దర్జీలు 1,67,951 మంది కలిపి మొత్తం 3.30 లక్షల కుటుంబాల్లో సంక్రాంతి వేడుకలు జరుగుతున్నాయి. ఇవాళ ఇస్తున్న డబ్బులతో కలిపి ఇప్పటివరకు మూడున్నరేళ్లలో రూ.927 కోట్లకుపైగా పారదర్శకంగా అకౌంట్లలో జమ చేశాం. 43 నెలల వ్యవధిలో వివిధ పథకాల ద్వారా నేరుగా రూ.1,92,938 కోట్లను అక్కచెల్లెమ్మలకు అందచేశాం. ఇక గోరుముద్ద, ఇళ్ల స్థలాలు, విద్యాకానుక లాంటి నాన్‌ డీబీటీ పథకాలను కూడా పరిగణలోకి తీసుకుంటే దాదాపు రూ.3 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మలకు ఇవ్వగలిగాం.

వారంతా.. నావాళ్లు

మీ జగన్‌ మొట్టమొదట చెప్పేమాట.. నా బీసీలు, నా ఎస్సీలు, ఎస్టీలు, నా మైనార్టీలు నావాళ్లు అని. ప్రతి రోజూ ప్రభుత్వం వీళ్ల మంచి కోసమే ఉంది. రైతన్నలు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చదువుకుంటున్న పిల్లలు.. ఇలా ఎవరిని తీసుకున్నా, ఏ ప్రాంతాన్ని తీసుకున్నా, ఏ గ్రామాన్ని తీసుకున్నా ప్రతి గడపకూ ఏ ప్రభుత్వమూ చేయని విధంగా మీ బిడ్డ ప్రభుత్వం మేలు చేస్తోంది.

నమ్మకం ఉంది కాబట్టే..

రాష్ట్రంలో 62 శాతం జనాభా ఆధారపడ్డ వ్యవసాయ రంగాన్ని తీసుకుంటే 50 శాతం మంది రైతులకు కేవలం 1.25 ఎకరాలు మాత్రమే ఉంది. ఒక హెక్టార్‌ లోపున్న రైతులు 70 శాతం మంది ఉన్నారు. దాదాపు కోటిమందికి పైగా ఉన్న వీరంతా క్రమం తప్పకుండా ఏటా జగనన్న దగ్గర నుంచి పెట్టుబడి సాయం కింద వైఎస్సార్‌ రైతు భరోసా వస్తుందన్న నమ్మకం ఉంది కాబట్టే ముందుకు అడుగులు వేయగలుగుతున్నారు. ప్రతి గ్రామంలో ఆర్బీ

పాలనలో ఇదీ తేడా

గతంలో కూడా పాలకులను చూశాం. ముఖ్యమంత్రి స్థానంలో ఒక ముసలాయన్ను చూశాం. ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్‌. గతం కన్నా మీ బిడ్డ చేస్తున్న అప్పులు కూడా తక్కువే. అయితే గతంలో ఎందుకు బటన్లు లేవు? రూ.1.92 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి ఎందుకు రాలేదు? ఆలోచన చేయండి.. గతంలో ఇవన్నీ ఎందుకు జరగలేదు ? మీ బిడ్డ పాలనలో మాత్రమే ఎందుకు జరుగుతున్నాయో ఆలోచన చేయండి? మీ బిడ్డ పరిపాలనలో బటన్లు మాత్రమే ఉన్నాయి. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. మీ బిడ్డ బటన్‌ నొక్కుతున్నాడు. నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు వస్తున్నాయి.

కేలను తీసుకొచ్చి ప్రతి పంటనూ, ప్రతి ఎకరాన్ని ఈ–క్రాపింగ్‌ చేసి రైతన్నలను చేయి పట్టుకుని నడిపిస్తున్నాం. వరదలు లాంటి ఏ కష్టం వచ్చినా ఆ సీజన్‌ ముగియక ముందే ఇన్‌పుట్‌ సబ్సిడీ వస్తోంది. ఉచితంగా బీమా చేయించి ప్రతి రైతన్నకు మంచి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

గత ప్రభుత్వం మోసాలు

గత సర్కారు కోటిమందికి పైగా పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలను రుణమాఫీ పేరుతో మోసగించడంతో బకాయిలు కట్టలేక డిఫాల్టర్లుగా మారి 'డి' గ్రేడ్‌కు పడిపోయాయి. ఆ కోటి మంది అక్కచెల్లెమ్మలకు తోడుగా ఉంటూ మీ అన్న ప్రభుత్వం వైఎస్సార్‌ ఆసరా, సున్నావడ్డీ అందిస్తూ అడుగులు ముందుకు వేసింది. గతంలో 18 శాతం ఎన్‌పీఏ, అవుట్‌ స్టాండింగ్‌గా ఉన్న గ్రూపులు ఇవాళ 0.5 శాతం లోపే ఉన్నాయంటే ఏ స్థాయిలో నిలదొక్కుకున్నాయో ఆలోచన చేయండి. గతంలో సి, డి గ్రేడ్‌లో ఉన్న సంఘాలన్నీ ఇవాళ ఏ, బీ గ్రేడ్‌లోకి వచ్చాయి.

స్వయం ఉపాధికి చేయూత..

రాష్ట్రంలో ఎవరిపైనా ఆధారపడకుండా తమ కష్టంతో బతుకున్న కుటుంబాలు దాదాపు 55 లక్షల పైచిలుకు ఉన్నాయి. వీరికి ఉద్యోగాలు ఉండవు. కిరాణా షాపులు, రోడ్డు పక్కన వ్యాపారాలు, తోపుడు బండ్ల మీద దోశలు వేస్తూ, కూరగాయలు విక్రయిస్తూ కనిపించే వీరంతా స్వయం శక్తితో బతుకు పోరాటంలో అడుగులు ముందుకు వేస్తున్నారు. ఇలాంటి 27 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు చేయూతనిచ్చి ప్రభుత్వం నడిపిస్తోంది కాబట్టే రాష్ట్రం ఇవాళ పరుగులు పెడుతోంది. అమూల్‌, ఐటీసీ, రిలయన్స్‌, పీ అండ్‌ జీ, హిందుస్తాన్‌ లీవర్‌ లాంటి సంస్థలతో ఒప్పందాల ద్వారా అక్కచెల్లెమ్మలు వ్యాపారాల్లో రాణించేలా అడుగులు ముందుకు వేయించాం. బ్యాంకుల ద్వారా తోడ్పాటు అందించగలిగాం కాబట్టే ఇవాళ రాష్ట్రం పరుగెడుతోంది.

గజదొంగల ముఠా...

గత ప్రభుత్వం.. ఆ ముసలాయన ప్రభుత్వాన్ని గుర్తు చేసుకోండి. ఆ ప్రభుత్వంలో ఒక గజదొంగల ముఠా ఉండేది. దానికి దుష్టచతుష్టయం అని పేరు. ఆ ముఠాలో ఒక ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, చంద్రబాబు, వీరికి తోడు ఒక దత్తపుత్రుడు. ఇదీ గజదొంగల ముఠా. వీళ్ల స్కీం అప్పట్లో ఒకటే.. డీపీటీ! దోచుకో, పంచుకో, తినుకో అదే వీళ్ల స్కీం. గజదొంగల ముఠా రాష్ట్రాన్ని దోచేసింది. వీటిపై ఈనాడు, ఆంధ్రజ్యోతి రాయవు. టీవీ 5 మాట్లాడదు. ప్రశ్నిస్తానన్న దత్తపుత్రుడు ప్రశ్నించడు. ఇలాంటి వారి పరిపాలన కావాలా? లేక లంచాలు, వివక్ష లేకుండా నేరుగా బటన్‌ నొక్కే మీ బిడ్డ పరిపాలన కావాలా? ఒక్కసారి ఆలోచన చేయండి. నాకు ముసలాయన మాదిరిగా ఈనాడు తోడుగా ఉండకపోవచ్చు. ఆంధ్రజ్యోతి అండగా ఉండకపోవచ్చు. టీవీ 5 తోడుగా ఉండకపోవచ్చు. దత్తపుత్రుడు నాకోసం మైక్‌ పట్టుకోకపోవచ్చు. నేను వీళ్లను నమ్ముకోలేదు.

వినుకొండకు వరాలు..

'ఈ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలంలో 20 గ్రామాలకు తాగునీటి కోసం సీపీడబ్ల్యూఎస్‌ పథకం ద్వారా రూ.12 కోట్లు మంజూరు చేయాలని, 50 పడకల సీహెచ్‌సీని రూ.15 కోట్లతో వంద పడకలుగా మార్చాలని వినుకొండ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు కోరారు. వాటిని మంజూరు చేస్తున్నాం వెంటనే పనులు ప్రారంభిస్తాం. వినుకొండలో రూ.10 కోట్లతో ముస్లిం మైనార్టీ కాలేజీ మంజూరు చేస్తున్నాం' అని సీఎం జగన్‌ ప్రకటించారు. కార్యక్రమంలో మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, విడదల రజిని, అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్‌, లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, పోతుల సునీత, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, నంబూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాస్ట్‌ వార్‌ కాదు.. క్లాస్‌ వార్‌

నేను నా ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు, మైనార్టీలు, నిరుపేద, పేద వర్గాలనే నమ్ముకున్నా. ఈరోజు రాష్ట్రంలో జరిగేది క్యాస్ట్‌ వార్‌ కాదు (కులాల మధ్య యుద్ధం కాదు).. క్లాస్‌ వార్‌. పేదవాడు ఒకవైపున, పెత్తందార్లు మరోవైపున ఈ యుద్ధం జరుగుతోంది. మాటపై నిలబడే మీబిడ్డ ఒకవైపు ఉంటే.. వెన్నుపోట్లు, మోసాలు మరోవైపున యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధంలో మీ బిడ్డ నమ్మకం అంతా కేవలం దేవుడి దయ, మీ అందరి చల్లని దీవెనలపైనే.

సింహంలా మీ బిడ్డ ఒక్కడే..

మీ బిడ్డకు పొత్తుల్లేవు.. వాళ్లమీదా వీళ్లమీదా ఆధారపడడు. మీ బిడ్డ ఒక్కడే సింహంలా నడుస్తాడు. తోడేళ్లంతా గుంపుగా ఒక్కటవుతున్నా మీ బిడ్డకు భయం లేదు. మిమ్మల్ని, ఆ దేవుడ్ని నమ్ముకున్నాడు కాబట్టి భయం లేదు. మీ అందరి చల్లని దీవెనలు ఎల్లప్పుడూ మీ బిడ్డపై ఉండాలని, ఇంకా మంచి చేసే పరిస్థితులు రావాలని, మన స్కూళ్లు బాగుపడాలని, మన పిల్లలు ఇంగ్లిష్‌ మీడియంలో గొప్ప చదువులు చదవాలని, ఆసుపత్రుల రూపురేఖలు మారాలని, వైద్యం కోసం ఏ పేదవాడు అప్పుల పాలయ్యే పరిస్థితి రాకూడదని ఆ దేవుడ్ని కోరుతున్నా.


ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌రాక కోసం ఎదురుచూస్తున్న జనం

ఆదుకున్నాం కాబట్టే పరుగులు..

రోడ్డు పక్కన తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే 15 లక్షల మందిని జగనన్న తోడు ద్వారా రూ.10 వేలు వడ్డీలేని బ్యాంకు రుణాలను అందించి ఆదుకున్నాం కాబట్టే రాష్ట్రం ఇవాళ వేగంగా పరుగెడుతోంది. మత్స్యకార భరోసా ద్వారా 1.20 లక్షల కుటుంబాలకు అండగా నిలబడ్డాం. నేతన్న నేస్తం ద్వారా దాదాపు 82 వేల కుటుంబాలకు తోడుగా నిలిచాం. వాహనమిత్ర ద్వారా సొంతంగా ఆటోలు, టాక్సీలు నడుపుకునే 2.75 లక్షల కుటుంబాలను భుజం తట్టి నిలబెట్టాం. కాపునేస్తం ద్వారా 3.56 లక్షల కుటుంబాలు, చేదోడు ద్వారా 3.30 లక్షల మంది రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీ కుటుంబాలకు తోడుగా నిలబడ్డాం. ఈబీసీ నేస్తం ద్వారా మరో 4 లక్షల కుటుంబాలకు అండగా నిలబడ్డాం. ప్రభుత్వ తోడ్పాటుతో కోవిడ్‌లాంటి మహమ్మారిని సైతం ఎదిరించి నిలదొక్కుకోగలిగారు కాబట్టే ఈరోజు రాష్ట్రం 11.43 శాతం వృద్ధి రేటుతో అడుగులు ముందుకు వేస్తోంది.

30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు..

ఏకంగా 30 లక్షల మందికిపైగా అక్కచెల్లెమ్మలకు దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా వారి పేరుతోనే ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్‌ చేయించి 20 లక్షల ఇళ్లను వేగంగా నిర్మిస్తున్నాం. సిమెంట్‌, స్టీల్‌ వినియోగం, కార్మికులకు పెద్ద ఎత్తున ఉపాధితో ఆర్థిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్రం 11.43 శాతం గ్రోత్‌ రేట్‌తో వేగంగా దూసుకెళ్తుంటే గిట్టని వాళ్లు రాష్ట్రం శ్రీలంక అయిపోతుందంటూ దుష్ప్రచారం చేస్తున్నారు.

గర్భంలో ఉన్న శిశువుకూ సంక్షేమ పథకాలు



జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత నా కుటుంబం 11 లక్షల ఆర్థిక సాయాన్ని పొందింది. మొదటి విడత జగనన్న చేదోడు సాయంతో మిషన్‌, మెటీరియల్‌ కొనుక్కున్నా. రెండో విడత డబ్బులతో జిగ్‌జాగ్‌ మిషన్‌ కొనుక్కుని ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకున్నా. నా కుమారుడికి అమ్మ ఒడి వస్తోంది. నేను గర్భవతిని కావడంతో పౌష్టికాహారం అందచేస్తున్నారు. గర్భంలో ఉన్న శిశువుకు కూడా మీ పథకాలను అందిస్తున్నారు. ఇంటి స్థలం కూడా వచ్చింది. మా అత్తయ్యకు చేయూత పథకం డబ్బులు రావడంతో కిరాణా షాప్‌ ఏర్పాటు చేసుకున్నారు. ఈ నెల నుంచి మా మామయ్యకు రూ.2,750 పింఛన్‌ వస్తోంది. మామయ్యకు గుండెనొప్పి రావడంతో గుంటూరులోని కార్పొరేట్‌ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2.50 లక్షలకు పైగా విలువైన వైద్యాన్ని ఉచితంగా అందించారు. అంతేకాకుండా కోలుకునేవరకు రెండు నెలల పాటు రూ.ఐదు వేల చొప్పున మొత్తం రూ.పది వేలు ఆయన ఖాతాలో జమ చేశారు. మీకు రుణపడి ఉంటాం.

– సాయికుమారి, వినుకొండ

నలుగురికి జీవనోపాధి కల్పిస్తున్నా..



పన్నెండు ఏళ్లుగా కులవృత్తి (నాయీ బ్రాహ్మణ) చేసుకుంటున్నా. జగనన్న చేదోడు ద్వారా సాయం అందడంతో షాప్‌ డెవలప్‌ చేసుకున్నా. మరో నలుగురికి జీవనోపాధి కల్పిస్తున్నా. మా అమ్మకు పింఛన్‌ వస్తోంది. మేం కన్న బిడ్డలమే అయినా మా తల్లిదండ్రులను మీరే బాగా చూసుకుంటున్నారు. పెద్ద కుమారుడిలా, సొంత అన్నలా నిలిచారు. చేయూత పథకం ద్వారా కూడా లబ్ధి పొందాం.

– సైదులు, కొచ్చర్ల, ఈపూరు మండలం

నాయకుడంటే నమ్మకం..

గతంలో ప్రభుత్వం ఏదైనా లోన్‌ ఇస్తే లబ్ధిదారుడి కాంట్రిబ్యూషన్‌ పేరుతోరూ.3 వేలు కట్టాల్సి వచ్చేది. ఇప్పుడు నేరుగా ఖాతాల్లో జమ అవుతోంది. నాయీ బ్రాహ్మణులు వివక్షకు గురి కాకుండా ప్రత్యేక చట్టం తెచ్చారు. నాయకుడంటే గతంలో మోసం.. ఇప్పుడు నాయకుడంటే నమ్మకం. జగనన్న ఇచ్చిన భరోసా ఇదీ!

– చెల్లుబోయిన శ్రీనివాసగోపాలకృష్ణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

ఈ-సిమ్‌తో ఎంతో మేలు



అత్యాధునిక సెల్‌ఫోన్లతో వినియోగంలోకి వస్తున్న 'ఈ-సిమ్'
దీని ద్వారా సైబర్ మోసాలకూ అడ్డుకట్ట
బయోమెట్రిక్, ఫేస్ ఐడీలతో రక్షణ
పలు స్మార్ట్ ఫోన్లలో ఉపయోగించేందుకు అవకాశం
భారత్‌లోనూ 'ఈ-సిమ్' సేవలందిస్తున్న పలు టెలికాం సంస్థలు

సాక్షి, అమరావతి: సెల్‌ఫోన్లలో ఉపయోగించే సిమ్(సబ్‌స్క్రైబర్ ఐడెంటిటీ మాడ్యూల్) కార్డు మాయమైపోతోంది. పెద్ద సైజు నుంచి క్రమంగా నానో సైజుకు వచ్చేసిన సిమ్ కార్డు.. ఇప్పుడు కంటికి కనిపించకుండా డిజిటల్ రూపంలోకి మారిపోయింది. అందుబాటులోకి వస్తోన్న అత్యాధునిక సెల్ ఫోన్లు, వాచ్‌లతో పాటే 'ఈ-సిమ్'లూ విస్తృతంగా వినియోగంలోకి వచ్చేస్తున్నాయి. కొన్నేళ్ల కిందటే ఇది మార్కెట్‌లోకి వచ్చినా.. అంతగా ప్రాచుర్యం పొందలేదు. కానీ ప్రస్తుతం సైబర్ మోసాలు భారీగా పెరుగుతుండటంతో అత్యధిక మంది 'ఈ-సిమ్'పై ఆసక్తి చూపిస్తున్నారు. పైగా మొబైల్ స్టోర్‌కు వెళ్లకుండానే ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా యాక్టివేట్ చేసుకునే అవకాశం ఉండడం ఇందులో ప్రత్యేకత.



సులభంగా యాక్టివేషన్.. డీ-యాక్టివేషన్


వీటిని సులభంగా యాక్టివేట్ చేయడంతో పాటు డీ-యాక్టివేట్ కూడా చేయవచ్చు. మల్టిపుల్ ఫోన్ నంబర్లు, ప్లాన్లను ఒకే డివైజ్‌లో వినియోగించుకోవచ్చు. అంటే సింగిల్ సిమ్ మాత్రమే సపోర్టు చేసే లేటెస్ట్ ఫోన్లలో అదనంగా ఈ-సిమ్ కూడా వినియోగించుకోవచ్చన్నమాట. వీటిని పోగొట్టుకోవడం, పాడవడం లేదా దొంగిలించడం వంటివి సాధ్యం కాదు. వివిధ నెట్‌వర్క్‌లకు, ప్లాన్లకు సులువుగా మారవచ్చు. పైగా నెట్‌వర్క్ ప్రొవైడర్ స్టోర్‌కు వెళ్లే అవసరం కూడా ఉండదు. అన్నీ రిమోట్ విధానంలోనే ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారానే యాక్టివేట్ చేయవచ్చు. అయితే, మనం వాడుతున్న స్మార్ట్‌ఫోన్ ఈ-సిమ్‌ను సపోర్ట్ చేస్తుందా.. టెలికాం ఆపరేటర్ ఈ తరహా సదుపాయాలు అందిస్తున్నారా లేదా అని తెలుసుకోవాలి. మనదేశంలో ఐఫోన్, శామ్‌సంగ్, హానర్, గూగుల్ ఫ్లిక్స్, సోనీ, షావోమీ, నోకియా, మొటొరోలా తదితర కంపెనీలకు చెందిన కొన్ని స్మార్ట్‌ఫోన్‌లకు మాత్రమే ఈ-సిమ్‌ను సపోర్టు చేస్తున్నాయి.

సిమ్ కార్డులతో పెరిగిన మోసాలు

కొన్నేళ్లుగా ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. టెలికాం సంస్థలు, బ్యాంకులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా.. ఎప్పటికప్పుడు కొత్త తరహా మోసాలు పుట్టుకొస్తున్నాయి. వాటిలో చాలా కేసులు సిమ్ స్వాప్ మోసాలకు సంబంధించినవే. ఇందులో నేరగాళ్లు మొదట ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ ఐడీల వంటివి సేకరిస్తారు. వివిధ ఆకర్షణీయ ఈ-మెయిల్స్, మెసేజ్‌లు పంపించి, ఫోన్ కాల్స్ చేసి అవతలి వ్యక్తుల వ్యక్తిగత వివరాలు సేకరిస్తారు. ఆ తర్వాత.. ఫోన్ పోగొట్టుకున్నామని, లేదా పాత సిమ్ పాడైపోయిందని చెప్పి నెట్‌వర్క్ ప్రొవైడర్ నుంచి డూప్లికేట్ సిమ్ తీసుకుంటారు. టెలికాం ఆపరేటర్ కంపెనీకి సమర్పించిన వివరాలు సరైనవే అయితే.. మోసగాడు సులువుగా బాధితుడి నంబర్‌తో కొత్త సిమ్ తీసుకుంటాడు. సిమ్ యాక్టివేట్ అయిన తర్వాత పూర్తి కంట్రోల్ హ్యాకర్ చేతికి వెళ్లిపోతుంది. ఇక సులువుగా మన బ్యాంక్ అకౌంట్‌లోని డబ్బుతో పాటు ఫోన్‌లోని రహస్య సమాచారమంతా లాగేస్తాడు.

ఈ-సిమ్‌తో అడ్డుకట్ట..

ఈ-సిమ్ అనేది ప్రస్తుతం మనం ఫోన్లలో వినియోగిస్తున్న ఫిజికల్ సిమ్‌కు డిజిటల్ రూపం. దీన్ని యాక్టివేట్ చేయాలంటే వ్యక్తిగత వివరాలతో పాటు పర్సనల్ ఐడెంటిఫియబుల్ ఇన్ఫర్మేషన్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. ఈ-సిమ్ అకౌంట్‌ను సెక్యూర్‌గా ఉంచుకోవడానికి ఫేస్ ఐడీ లేదా బయోమెట్రిక్ విధానంలో పాస్‌వర్డ్ పెట్టుకోవచ్చు. ఒకరు ఈ-సిమ్ వాడుతున్నప్పుడు మరొకరు సిమ్ పోయిందని లేదా పాడైపోయిందని నెట్‌వర్క్ ప్రొవైడర్‌కు ఫిర్యాదు చేయడానికి కుదరదు. అదే నంబర్‌తో మరో సిమ్‌ను తీసుకునే అవకాశం కూడా ఉండదు. ఎవరైనా అలా చేస్తే.. వారు సైబర్ నేరగాళ్లుగా గుర్తించి పట్టుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం అమెరికాలో వినియోగిస్తున్న ఐఫోన్-14 మోడల్స్‌కు సిమ్ స్లాట్స్ లేవు. ఇవి ఈ-సిమ్‌ను మాత్రమే సపోర్ట్ చేస్తాయి.



ప్రపంచంలో మొట్టమొదట ఈ-సిమ్‌ను 2016లో శామ్‌సంగ్ గేర్ ఎస్2 3జీ స్మార్ట్‌వాచ్ కోసం అందుబాటులోకి తెచ్చారు. అనంతరం 2017లో యాపిల్ స్మార్ట్ వాచ్‌లో కూడా దీన్ని ప్రవేశపెట్టారు. అతి తక్కువ కాలంలోనే పలు స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థలు తమ ఫోన్లలో ఈ-సిమ్ సపోర్టును ఏర్పాటు చేయగా.. పలు టెలికాం సంస్థలు ఈ-సిమ్ సేవలను అందుబాటులోకి తెచ్చాయి. మన దేశంలో భారతి ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వోడాఫోన్-ఐడియా ఈ-సిమ్ సేవలను అందిస్తున్నాయి.

బాధితులకు సీఎం జగన్ అండ

- తలసేమియా బాధితుడికి రూ.27 లక్షల సాయం
- ఇల్లు కోల్పోయిన బాధితులకు తక్షణ సాయం

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా వినుకొండ పర్యటనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. 'జగనన్న చేదోడు' పథకం మూడో విడత నగదు జమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సోమవారం పట్టణానికి వచ్చిన సీఎం జగన్.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి సభాస్థలికి బస్‌లో వెళుతున్న సమయంలో రోడ్డుపై నిలిచి దండం పెడుతూ బాధితులు కనిపించారు. వెంటనే బస్సు దిగిన ఆయన.. వారి వద్దకు వెళ్లి వారి సమస్యలు విన్నారు.

చిన్నారి వైద్యానికి చర్యలు

ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం పరిటాలవారిపాలేనికి చెందిన జి.నాగమణి, నారాయణ స్వామి దంపతుల కుమారుడు ఎనిమిదేళ్ల చరణ్‌తేజ తలసేమియాతో బాధపడుతున్నాడు. తన కుమారుడి మెరుగైన వైద్యం కోసం రూ.27లక్షలు ఖర్చవుతాయని, అంత స్థోమత తమకు లేదని, తమ బిడ్డను కాపాడాలని సీఎం జగన్‌కు విన్నవించారు. వెంటనే స్పందించిన సీఎం ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల సాయం అందేలా చూడటంతో పాటు, రూ.లక్ష తక్షణ సాయాన్ని ప్రకటించారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మరో రూ.16 లక్షలు మంజూరయ్యేలా చూడాలని కలెక్టర్ శివశంకర్‌ను సీఎం ఆదేశించారు. సీఎం పర్యటన ముగియగానే వినుకొండ మునిసిపల్ కార్యాలయంలో కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తక్షణ సాయం కింద రూ.లక్ష చెక్కును చిన్నారి తేజ తల్లిదండ్రులకు అందజేశారు. తమిళనాడులోని రేలా హాస్పిటల్లో చిన్నారికి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డకు జగనన్న పునర్జన్మ ప్రసాదించారని భావోద్వేగానికి లోనయ్యారు. ఇప్పటికే తేజకు రూ.10 వేలు పింఛన్ వస్తోందని సీఎంకు వారు ధన్యవాదాలు తెలిపారు.


తలసేమియాతో బాధపడుతున్న చిన్నారి తేజను ఊరడిస్తున్న సీఎం జగన్


తేజకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

వినుకొండ రూరల్ మండలం ఉప్పరపాలేనికి చెందిన ఎద్దు మస్తానమ్మ, వెంకటేశ్వర్లు దంపతుల ఇల్లు రెండేళ్ల కిందట అగ్నిప్రమాదంలో కాలిపోయింది. సీఎం పర్యటన సమయంలో వారు సమస్యను విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన సీఎం జగన్.. సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను ఆదేశించారు. ఇల్లు మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని చెప్పారు. సీఎం పర్యటన ముగియగానే జిల్లా కలెక్టర్ బాధిత కుటుంబానికి రూ.50 వేల తక్షణ సాయం అందజేశారు. అలాగే ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ కుటుంబం సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపింది.


అగ్నిప్రమాద బాధితురాలు మస్తానమ్మ సమస్య తెలుసుకుంటున్న సీఎం జగన్


మస్తానమ్మకు చెక్కు అందించిన కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు లోకేశ్: చెల్లుబోయిన



సాక్షి, అమరావతి: బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన దేవుడు చంద్రబాబు అంటూ నారా లోకేశ్ పాదయాత్ర చేస్తూ అబద్ధాలు వల్లె వేస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. 1986లో మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో బీసీలకు ఎన్టీఆర్ 20 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, ఆ తరువాత 1994లో కోట్ల విజయభాస్కరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు, కేంద్రం చేసిన 73వ రాజ్యాంగ సవరణలకు అనుగుణంగా ఆ రిజర్వేషన్లు 33.33 శాతానికి పెరిగాయని మంత్రి గుర్తుచేశారు. ఆ తర్వాత ఎన్టీఆర్ వాటిని 34 శాతం చేశారని చెప్పారు. అప్పుడు నీ దేవుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కానే కాదన్నారు. తన తండ్రిలాగా లోకేశ్ కూడా చరిత్ర మరిచిపోయి ఉంటారని.. నోటికి ఏది వస్తే అది అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఈ విషయంలో లోకేశ్ తండ్రిని మించిన తనయుడని ఎద్దేవా చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మంత్రి చెల్లుబోయిన మీడియాతో మాట్లాడుతూ.. బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హత టీడీపీకి లేదన్నారు. ఎప్పుడైనా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు బాబు సెంటు భూమి ఇచ్చాడా? అని ఆయన ప్రశ్నించారు. 16 వేల మంది బీసీలకు పదవులు తగ్గిపోయాయంటూ లోకేశ్ నోటికొచ్చింది మాట్లాడుతున్నాడని.. మీ హయాంలో బీసీలకు ఏం చేసింది, సీఎం జగన్ హయాంలో బీసీలకు ఏం చేసింది.. అన్న అంశంపై చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ చేశారు.

ఐటీ ఉద్యోగాలు రాకపోవడానికి బాబే కారణం

బీసీల స్థితిగతులు మారడానికి నాడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పునాది వేస్తే, నేడు సీఎం జగన్ బీసీలను వెన్నెముక కులాలుగా మారుస్తున్నారన్నారు. ఐటీ రంగంలో ఉన్నవారంతా తనకు రాయల్టీ ఇవ్వాలని బాబు అంటున్నారని.. నిజానికి ఆ రంగానికి బాబు చేసిందేమీలేదన్నారు.

ఆశల పట్టాలపై రైల్వే ప్రాజెక్టులు

▶ మొదటి పేజీ తరువాయి

భూసేకరణ వ్యయాన్ని భరిస్తామని, ఆ నాలుగు ప్రాజెక్టులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేపట్టాలని ప్రతిపాదించింది. ఆ ప్రాజెక్టులు..

- కడప-బెంగళూరు రైల్వేలైన్‌ను రూ.3,038 కోట్ల అంచనా వ్యయంతో 268 కిలోమీటర్ల మేర నిర్మించాలని 2008-09 బడ్జెట్‌లో ఆమోదించారు. నాలుగుదశల ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు మొదటిదశ కింద కడప-పెండ్లిమర్రి లైన్‌లో కేవలం రూ.350 కోట్ల పనులు చేశారు. 1,531 ఎకరాల భూమిని సేకరించి ఇస్తామని, ప్రాజెక్టు వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.
- నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు 20ఏళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వెనుకబడిన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీని అందించడంతోపాటు ఆ ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి దోహదపడేందుకు ఈ ప్రాజెక్టును 2009లో ఆమోదించారు. రూ.2,400 కోట్లతో ఆమోదించిన ఈ ప్రాజెక్టు వ్యయం సవరించిన అంచనాల మేరకు రూ.4,500 కోట్లకు చేరుకుంది. ఇప్పటికి రూ.1,300 కోట్ల మేర పనులు చేశారు. భూసేకరణ ప్రక్రియను తాము త్వరగా పూర్తిచేస్తామని, మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని కేంద్రమే భరించి త్వరలో పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.
- రాయదుర్గం-తుముకూరు ప్రాజెక్టును రూ.3,404 కోట్లతో ఆమోదించారు. ఇప్పటివరకు రూ.520 కోట్ల పనులే చేశారు. మిగిలిన నిధులను కూడా కేంద్రమే కేటాయించి ప్రాజెక్టును పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.
- కీలకమైన కొవ్వూరు-నరసాపురం లైన్ వ్యయాన్ని కేంద్రమే భరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. మొత్తం రూ.2,125 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.300 కోట్ల పనులు మాత్రమే కేంద్ర రెల్వేశాఖ పూర్తిచేసింది. మిగిలిన పనులనూ త్వరగా పూర్తిచేయాలని, భూసేకరణను దాదాపు పూర్తిచేశామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

కొత్త రైళ్లు కావాలి

రాష్ట్రానికి కొత్త రైళ్లు కేటాయించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. విశాఖపట్నం-బెంగళూరు, తిరుపతి-వారణాసి సూపర్‌ఫాస్ట్ రైళ్లు ప్రవేశపెట్టాలని కోరింది. విశాఖ నుంచి విజయవాడ మీదుగాఢిల్లీకి రాజధాని ఎక్స్‌ప్రెస్ వేయాల్సి ఉంది.

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను పట్టాలు ఎక్కించాలి

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఈ ఏడాది అయినా ఆచరణ రూపం దాలుస్తుందా అని రాష్ట్ర ప్రజలు ఆశగా చూస్తున్నారు. విభజన చట్టం ప్రకారం విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. డీపీఆర్‌ను కూడా రూపొందించింది. 900 ఎకరాల రైల్వే భూములను గుర్తించింది. అందులో 150 ఎకరాల్లో ప్రధాన కార్యాలయం నిర్మించాలని నిర్ణయించారు. రైల్వే జోన్ ప్రధాన కార్యాలయంలో 170 మంది గెజిటెడ్ అధికారులు, 1,200 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను కేటాయించాలని నిర్ణయించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒత్తిడితో జోనల్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూ.170 కోట్లు కేటాయించింది. అన్నీ ఉన్నా జోన్ ఇంకా ఆపరేషన్‌లోకి రాలేదు. వాల్తేర్ డివిజన్‌ను కొనసాగిస్తూ విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్‌ను పట్టాలెక్కించాలి. ఈ బడ్జెట్‌లో అయినా రైల్వే జోన్ ఆపరేషన్‌లోకి వచ్చేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

రెండు కొత్త లైన్లకు ప్రతిపాదన

రాష్ట్రపునర్విభజన చట్టం ప్రకారం రెండు రైల్వేలైన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కొవ్వూరు-భద్రాచలం కొత్త రైల్వేలైన్‌కు రూ.709 కోట్ల అంచనా వ్యయంతో ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించారు. ఆ రైల్వేలైన్‌కు ఆమోదం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కొండపల్లి-కొత్తగూడెం మధ్య కొత్త రైల్వేలైన్ వేయాలని ప్రతిపాదించింది. అందుకోసం సర్వే నిర్వహించి డీపీఆర్ రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని కోరింది.

28 ఆర్వోబీలు నిర్మించాలి

రాష్ట్రంలో లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలను నివారించేందుకు రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ)ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. అందుకోసం 54 ఆర్వోబీల నిర్మాణాన్ని గతంలోనే ప్రతిపాదించింది. వాటిలో 26 ఆర్వోబీలను రైల్వేశాఖ ఇప్పటికే ఆమోదించింది. మిగిలిన 28 ఆర్వోబీలను ఆమోదించి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

డోన్‌లో లోకోషెడ్ ఏర్పాటుచేయాలి

కర్నూలు జిల్లా డోన్ కేంద్రంగా రైల్వే కోచ్‌ల సెకండరీ మెయింటనెన్స్ లోకోషెడ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అందుకోసం 100 ఎకరాలు కేటాయిస్తామని తెలిపింది. తద్వారా రాయలసీమ ప్రాంతంలో రైల్వే వ్యవస్థను అభివృద్ధి చేయవచ్చన్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం.

క్లుప్తంగా...

బాల నేరస్తులను సున్నితంగా విచారించాలి

జాతీయ బాలల హక్కుల కమిషన్‌కు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సూచనలు

సాక్షి, అమరావతి: బాల నేరస్తులను సున్నితంగా విచారణ చేయాలని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సూచిస్తున్నారు. నిర్భయ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత తీవ్రమైన నేరాలు చేసిన 16 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు బాలలను సైతం పెద్దలుగానే పరిగణించాలని, వారిని ప్రత్యేక కోర్టుల్లో విచారించాలనే ప్రతిపాదన ఉంది. దీనిపై దేశవ్యాప్తంగా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జువైనల్ జస్టిస్ (సంరక్షణ, రక్షణ) చట్టం -2015 సెక్షన్ 15 మార్గదర్శకాల మేరకు బాల నేరస్తులను ఏ విధంగా పరిగణించాలనే దానిపై కసరత్తు జరుగుతోంది. రాజ్యాంగం ప్రకారం జువైనల్ జస్టిస్ యాక్ట్‌లో ప్రతిపాదించిన మార్గదర్శకాల ప్రకారం నేరారోపణ ఎదుర్కొంటున్న పిల్లల పూర్వాపరాలను విచారణ అధికారి (పోలీస్) ప్రాథమికంగా తెలుసుకోవాలి. అన్ని కోణాల్లోనూ పరిశీలించి ఆయా కేసులను జువైనల్ జస్టిస్ బోర్డు (జేజేబీ) నుంచి కోర్టుకు మార్చే విషయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా అనేక విషయాల్లో ఉన్న డోలాయమాన పరిస్థితిని అధిగమించేలా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) అభిప్రాయ సేకరణ చేపట్టింది. దేశంలోని 53 మంది బాలల హక్కుల పరిరక్షణ సంస్థల ప్రతినిధులు ఈ నెల 20 నాటికి తమ సూచనలు అందించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హెల్ప్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి, బాలల హక్కుల పరిరక్షణ ప్రతినిధి ఎన్వీఎస్ రామ్మోహన్ తన ప్రతిపాదనలను ఎన్‌సీపీసీఆర్‌కు సూచించారు. దేశ వ్యాప్తంగా వచ్చిన అనేక సూచనలు, సలహాలను, బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం జువైనల్ జస్టిస్ యాక్ట్ సవరణకు ముసాయిదాను రూపొందించనుంది.

గ్యాస్ సిలిండర్‌పై అదనపు డెలివరీ చార్జీలు చెల్లించొద్దు

పౌరసరఫరాల శాఖ ప్రకటన

సాక్షి, అమరావతి: గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన రవాణా చార్జీలు కంటే అదనంగా డెలివరీ చెల్లించాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అధీకృత డీలర్ నుంచి ఐదు కిలో మీటర్లలోపు వినియోగదారులకు ఉచితంగానూ, 5 నుంచి 15 కిలో మీటర్లలోపు రూ.20 చొప్పున, 15 కిలో మీటర్లపైన ఉంటే రూ.30లు మాత్రమే రవాణా చార్జీలు కింద చెల్లించాలని పేర్కొంది. డెలివరీ ఏజెంట్లు వినియోగదారుల నుంచి అదనపు రుసుము డిమాండ్ చేస్తే పౌరసరఫరాల శాఖ ఇంటిగ్రేటెడ్ టోల్ ఫ్రీ నంబర్ 1967, ఆయిల్ కంపెనీ టోల్ ఫ్రీ నంబర్ 1800 2333555కు ఫిర్యాదు చేయాలని సూచించింది. ఫిర్యాదులపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపింది.

సీఐడీ విచారణకు చింతకాయల విజయ్

ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 వరకూ విచారణ

నగరంపాలెం(గుంటూరు): గుంటూరులోని ప్రాంతీయ సీఐడీ కార్యాలయానికి టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడి తనయుడు విజయ్‌ను సోమవారం విజయవాడ సీఐడీ పోలీసులు విచారణ నిమిత్తం తీసుకొచ్చారు. సీఎం సతీమణి భారతిపై అనుచిత పోస్టుల కేసులో గతేడాది సెప్టెంబర్‌లో విజయ్‌పై సీఐడీ కేసు నమోదు చేసింది. విచారణ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగింది. అనంతరం విజయ్ మీడియాతో మాట్లాడుతూ సీఐడీ పోలీసులు అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానం చెప్పానని, ప్రధానంగా టీడీపీ సోషల్ మీడియాపై ప్రశ్నలు అడిగారని తెలిపారు. వచ్చే నెల 16న మరోసారి విచారణకు రావాలన్నారని చెప్పారు. తనపై తప్పుడు కేసు బనాయించడంతో హైకోర్టుకు వెళ్లానన్నారు. వివేకా హత్య కేసు దర్యాప్తు, లోకేశ్ పాదయాత్ర నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే తనకు నోటీసులిచ్చారని విజయ్ ఆరోపించారు. విజయ్‌తో పాటు టీడీపీ నేతలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు, నసీర్‌అహ్మద్, చిట్టాబత్తిన చిట్టిబాబు, రావిపాటి సాయికృష్ణ, కోటేశ్వరరావు, న్యాయవాది ఈశ్వరయ్య ఉన్నారు.

సాయ్ సభ్యురాలుగా మంత్రి ఆర్కే రోజా


మంత్రి రోజాను సన్మానిస్తున్న నాయకులు

నగరి(చిత్తూరు జిల్లా): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సభ్యురాలిగా రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా నియమితులయ్యారు. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కార్యదర్శి జతిన్ నర్వాల్ నుంచి సోమవారం ఆమెకు ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా రోజాను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. మంత్రి రోజా మాట్లాడుతూ అందుబాటులో ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని క్రీడారంగ ఉన్నతికి కృషి చేస్తానని తెలిపారు. జగనన్న క్రీడాసంబరాలు, సీఎం కప్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు ద్వారా రాష్ట్రంలోని క్రీడాకారులకు అత్యున్నత ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు.

విషమంగానే తారకరత్న ఆరోగ్యం

- ఎక్మో కాదు.. వెంటిలేటర్‌తో చికిత్స
- వైద్యుల వెల్లడి

బనశంకరి: నాలుగు రోజుల కిందట గుండెపోటుకు గురై బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలుగు నటుడు నందమూరి తారకరత్న పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆయన ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్లు సోమవారం సాయంత్రం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో వైద్యులు పేర్కొన్నారు. తారకరత్నకు ఎక్మో సపోర్ట్ ఇవ్వలేదని, అత్యాధునిక వైద్యపరికరాలతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. సోమవారం నిర్వహించిన వైద్యపరీక్షలపై వివరాలు వెల్లడించలేదు. ఆస్పత్రి వద్దకు అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో పోలీసులు పటిష్ట భద్రత కల్పించారు. నిమ్హాన్స్ న్యూరోసర్జన్ డాక్టర్ గిరీశ్ కులకర్ణి నేతృత్వంలో ఇద్దరు న్యూరోసర్జన్లు, నారాయణ హృదయాలయకు చెందిన ఎనిమిదిమందికిపైగా వైద్యనిపుణులు తారకరత్నకు చికిత్స చేస్తున్నారు.

యువత చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు

పాదయాత్రలో నారా లోకేశ్

వి.కోట (చిత్తూరు జిల్లా): రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్ర సోమవారం ఉదయం చిత్తూరు జిల్లా వి.కోట మండలం అన్నవరం గ్రామం నుంచి ప్రారంభమై సాయంత్రం దానమయ్యగారి పల్లె వద్ద ముగిసింది. ఈ యాత్రలో భాగంగా ఆయన వి.కోటలో యువ నాయకుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో యువకులకు మేలు జరగలేదన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెడుతున్నారన్నారు. అంతకు ముందు వడ్డెర కులస్తులతో సమావేశంలో మాట్లాడుతూ బీసీల్లో వడ్డెర్లు ఎందుకు ఇంకా అభివృద్ధి చెందలేదన్న విషయంపై టీడీపీ ప్రభుత్వం ఓ కమిటీని వేసిందన్నారు. అయితే ఆ కమిటీ ఏమైందో ఈ ప్రభుత్వమే జవాబు చెప్పాలన్నారు. లోకేశ్ తన వాహనానికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన బంకులో డీజిల్ పోయించుకొన్నారు. రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ ధరల పెంపునకు సీఎం జగన్ కారణమని ఆరోపించారు.

ఈ 'చిత్రం' చూశారా!!


సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న ఫొటో

నేల పైన ఓ పసుపు రంగు వస్త్రం. దాని పైన ఓ నాలుగు ఆలుగడ్డలు, ఓ నాలుగు టమోటాలు, కొన్ని ముల్లంగి, ఓ చిన్న బుట్టలో నిమ్మకాయలు. ఇది కూరగాయల దుకాణమట! ఈ కూరగాయలు అమ్మడానికి ఇద్దరు మహిళలు! వారితో లోకేశ్ మాటామంతీ! ఇంతా చేస్తే.. ఈ ఇద్దరు మహిళల్లో ఒకరు ఆ తర్వాత లోకేశ్ పాదయాత్రలోనూ కనిపించారు. ఆమె చేతిలో తమిళనాడుకు చెందిన ఓ సంచీ.. ఆదివారం చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం బడుగుమాకులపల్లి సంతలో జరిగిన ఈ 'షో'ను సోషల్ మీడియా పసిగట్టేసింది. లోకేశ్ పాదయాత్రకు తమిళనాడు నుంచి ఆర్టిస్టులను తెచ్చి, ఇక్కడ 'షో' చేస్తున్నారని సోషల్ మీడియా ఉతికి ఆరేస్తోంది.

– శాంతిపురం, చిత్తూరు జిల్లా

తెలంగాణ

తెర్రెం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న మహిళా మావోయిస్టు అరెస్టు

చర్ల: తెర్రెంలో 2021లో జరిగిన అతిపెద్ద ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న ఒక మహిళా మావోయిస్టును ఆదివారం రాత్రి రాయ్‌పూర్‌కు చెందిన ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఒకటో ప్లాటూన్ సెక్షన్ కమాండర్ మడవి హిడ్మా నేతృత్వాన 2021 ఏప్రిల్ 4న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధి టేకులగూడెం-జొన్నగూడ అటవీ ప్రాంతాల్లో మాటు వేసిన మావోయిస్టులు పక్కా పథకం ప్రకారం పోలీసు బలగాలను రప్పించి మందుపాతరలను పేల్చడంతో పాటు రాకెట్ లాంఛర్లతో దాడి చేశారు. ఈ ఘటనలో 22 మంది జవాన్లు మృతిచెందగా, 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే, కోబ్రా విభాగం జవాన్ ఒకరిని మావోయిస్టులు పట్టుకెళ్లి ఐదు రోజుల తరువాత విడిచిపెట్టారు. ఈ ఘటన అప్పట్లో ఇరు రాష్ట్రాల పోలీసు యంత్రాంగాన్ని ఆందోళనకు గురి చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న మావోయిస్టుల్లో పలువురిని గతంలోనే అరెస్టు చేయగా, తాజాగా ఆదివారం రాత్రి బీజాపూర్ జిల్లాలోని భూపాలపట్నం సమీపాన మహిళా మావోయిస్టు మడకం ఉంగిని అరెస్టు చేశారు. ఉంగి స్వగ్రామం బీజాపూర్ జిల్లా ఉడతమల్ల కాగా, ఈమె పదేళ్లుగా మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఉంగిని ఎన్ఐఏ అధికారులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు.



నా రాత ఏ శ్రుతులు, అపశ్రుతులు పలకనీ –
అది నేను; నా రక్తం; నా గడచిన జీవితపు ఛాయ.
– చలం

సాక్షి
మంగళవారం, జనవరి, 31

కొత్త పొద్దుపొడుపు

అవును... భారత క్రికెట్‌లో ఇది కొత్త పొద్దుపొడుపు. దక్షిణాఫ్రికాలో మహిళల తొలి అండర్‌–19 టీ20 వరల్డ్‌ కప్‌లో ఆదివారం సాయంత్రం భారతీయ బాలికలు ఇంగ్లండ్‌ జట్టును మట్టికరిపించి, ప్రపంచ విజేతలుగా నిలిచిన క్షణాలు అలాంటివి. షఫాలీ వర్మ సారథ్యంలో తెలుగమ్మాయి సునీత గొంగడి సహా 15 మంది సభ్యుల టీనేజ్‌ బాలికల జట్టు తమ విజయంతో దేశ మహిళా క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. క్రికెట్‌ దిగ్గజం సచిన్‌ టెండూల్కర్, స్వయంగా దక్షిణాఫ్రికాకు వచ్చి ఫైనల్‌కు ముందు స్ఫూర్తి నింపిన ఒలింపిక్స్‌ జావెలిన్‌ త్రో ఛాంపియన్‌ నీరజ్‌ చోప్రా సహా అందరి ఆశలనూ, అంచనాలనూ నిజం చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో పురుషులకు సమానంగా మహిళలకూ వేతనమివ్వాలని గత అక్టోబర్‌ చివరలో భారత క్రికెట్‌ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయించిన వేళ... తాజాగా మహిళల ప్రీమియర్‌ లీగ్‌ (డబ్ల్యూపీఎల్‌) ఏర్పాటైన క్షణాన... వీస్తున్న మార్పు పవనాలకు ప్రపంచ కప్‌ సాధన ఓ కొత్త జోడింపు.

సరిగ్గా 40 ఏళ్ళ క్రితం 1983లో పురుషుల ప్రపంచ కప్‌లో భారత క్రికెట్‌ జట్టు అనూహ్య విజయం సాధించింది. ఆ తర్వాత భారత క్రికెట్‌ మరింత మెరుగైన రీతిలో సమూలంగా మారిపోయింది. తాజాగా మన బాలికలు సాధించిన విజయం మన మహిళా క్రికెట్‌కు సరిగ్గా అలాంటి ఉత్ప్రేరకమే. గతంలో మన మహిళా క్రికెట్‌ జట్టు ఒకటి కన్నా ఎక్కువ సార్లే ప్రపంచ కప్‌ ఫైనల్స్‌కు చేరింది. అయితే, ఏ ఫార్మట్‌లోనైనా మన మహిళా క్రికెటర్లు వరల్డ్‌ కప్‌ సాధించడం ఇదే తొలిసారి. బీసీసీఐ మహిళా క్రికెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన సమయంలో ఈ విజయం ఒక కొత్త ఉత్సాహం, ఊపునిచ్చాయి.

విరాట్‌ కోహ్లీ తదితరులది ఐపీఎల్‌ (ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌) తరం కాగా, షఫాలీ వర్మ సారథ్యంలోని అండర్‌–19 వరల్డ్‌ ఛాంపియన్‌ బాలికలను రానున్న డబ్ల్యూపీఎల్‌ (ఉమెన్స్‌ ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌) తరం అనుకోవచ్చు. 2008 బాలుర అండర్‌–19 వరల్డ్‌ కప్‌లో కోహ్లీ బృందం ఇలాగే విజయం అందుకుంది. అదే సమయంలో ఐపీఎల్‌ రావడంతో రాత్రికి రాత్రి పలువురు లక్షాధికారులయ్యారు. ఆటకు అవతార మూర్తులై, ఇంటింటా పాపులర్‌ అయ్యారు. భారత క్రికెట్‌ స్వరూప స్వభావాలే మారిపోయాయి. ఇప్పుడు మన బాలికల జట్టు ప్రపంచ ఛాంపియన్లుగా అవతరించిన సమయానికి డబ్ల్యూపీఎల్‌ కొత్తగా వచ్చింది. త్వరలో తొలి డబ్ల్యూపీఎల్‌ వేలంతో ఈ క్రికెటర్లలో కొందరు లక్షాధికారులు కానున్నారు. కష్టాలు కడతేరి, ఆర్థిక, సామాజిక హోదా మారిపోనుంది. ఈ మ్యాచ్‌ల ప్రసార హక్కులు, పలు ఫ్రాంఛైజీల బిడ్లు దాదాపు రూ. 5.5 వేల కోట్ల పైగా పలికినట్టు వార్త. మహిళా క్రికెట్‌కు ఇవి బంగారు క్షణాలంటున్నది అందుకే.

అయితే, ఎన్ని లీగ్‌లు వచ్చినా అంతిమంగా అగ్రభాగాన నిలిపేది ప్రతిభే. భారత అండర్‌–19 బాలికల క్రికెట్‌ జట్టు ఈ ఐసీసీ వరల్డ్‌ కప్‌లో మొదటి నుంచి తన సత్తా చాటుతూ వచ్చింది. ఎప్పటికప్పుడు ఆట మెరుగుపరుచుకుంటూ ఆస్ట్రేలియా (ప్రాక్టీస్‌ మ్యాచ్‌లో) సహా అనేక జట్లను అధిగమించి, ఫైనల్స్‌కు చేరింది. కప్‌ సాధించింది. మన బాలికల క్రికెట్‌ ఈ వరల్డ్‌ కప్‌ ఘనత సాధించడం వెనుక ఆటగాళ్ళతో పాటు పలువురి పాత్ర ఉంది. జాతీయ క్రికెట్‌ అకాడెమీ (ఎన్సీఏ) శ్రద్ధ, మహిళా కోచ్‌ నూషిన్‌ అల్‌ ఖదీర్‌ అసాధారణ అంకితభావం లాంటివి అండగా నిలిచాయి. పద్ధెనిమిదేళ్ళ క్రితం వరల్డ్‌ కప్‌ ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన భారత సీనియర్‌ మహిళా జట్టులో సభ్యురాలైన నూషిన్‌ ఆకలిగొన్న పులిలా బరిలోకి దిగి, ఈ టీనేజ్‌ బాలికలను తీర్చిదిద్దారు. పోటీలోని వివిధ జట్ల క్రికెటర్ల కన్నా ప్రతిభావంతులుగా నిలిపారు.

ఈ ప్రతిభాపాటవాలు భారత మహిళా క్రికెట్‌ భవిష్యత్తుకు బలమైన పునాది. కాలగతిలో సీనియర్ల స్థానాన్ని భర్తీ చేసే సామర్థ్యంతో బాలికలు ఉరకలెత్తుతున్నారు. దేశంలో మహిళా క్రికెట్‌ ప్రమాణాలు మెరుగవుతున్నాయనడానికి ఇది ఓ సూచన. నిజానికి, అర్ధశతాబ్ద కాలంలో మన మహిళా క్రికెట్‌ అనేక శృంఖలాలు తెంచుకొంది. పంజరాలను దాటింది. సామాన్య స్థాయి నుంచి అసామాన్యతకు ఎదిగింది. గడచిన రెండు సీనియర్ల టీ20 వరల్డ్‌ కప్‌లలో మన మహిళా జట్టు సెమీ ఫైనలిస్టుగా, ఫైనలిస్టుగా నిలిచింది. దక్షిణాఫ్రికాలో ఈ తొలి అండర్‌–19 టీ20 కప్‌లో బాలికలు ఏకంగా విజేతలయ్యారు. ఇది వారి జీవితాల్లోనే కాదు... మొత్తం భారత మహిళా క్రికెట్‌ చరిత్రలోనే కీలక మలుపు.

దేశంలో ఆడపిల్లలకు ప్రత్యేక క్రికెట్‌ అకాడెమీలు వెలుస్తున్న రోజులివి. ఈ విజయం వాటికి కొత్త ఉత్తేజం. విజేతలకు ఆత్మవిశ్వాసం పెంచే ఔషధం. పురుషులకు భిన్నంగా తగిన పారితోషికం లేకున్నా, ఇంటా బయటా అవమానాలు ఎదురైనా, ఆర్థిక – సామాజిక అవరోధాలున్నా – అవన్నీ దాటుకొని వచ్చిన స్త్రీలు కాబట్టి తాజా విజయం మరింత గొప్పది. ఇది... కూతురు సోనా యాదవ్‌ క్రికెట్‌ షూస్‌ కోసం అదనపు షిఫ్టులు పనిచేసిన గ్లాస్‌ ఫ్యాక్టరీ కార్మికుడు, ఆడబిడ్డ త్రిష శిక్షణ కోసం ఉద్యోగం వదిలి భద్రాచలం నుంచి హైదరాబాద్‌ మారిన తండ్రి... ఇలా ఎందరో తల్లితండ్రుల త్యాగఫలం. ఆడపిల్లలను ప్రోత్సహిస్తే వారు కుటుంబానికే కాదు... దేశానికీ ఎంతటి పేరు తెస్తారో చెప్పడానికి ఇది తాజా దర్పణం. బ్యాడ్మింటన్‌ తర్వాత భారత మహిళా క్రీడాంగణంలో ఇక క్రికెట్‌ కొత్త దీపశిఖ. దీన్ని మరింత ప్రజ్వరిల్లేలా చేయాల్సింది ఆటల సంఘాలు, అధికారంలోని పెద్దలే.

ముంచే గాలివాటు రాజకీయాలు



ఏబీకే ప్రసాద్
సీనియర్‌ సంపాదకులు

ఆంధ్రప్రదేశ్‌ గత శాసనసభ ఎన్నికల్లో 'బింకానికి' పోయి రెండు చోట్ల నిలబడి, ఘోరాతిఘోరమైన ఓటమి పాలయ్యాడు పవన్‌ కల్యాణ్‌. పరువూ పోయింది, 'పవరూ' రాలేదు. అయినా తన దంబపు 'పవనిజం' స్లోగన్‌ను వదులుకోలేదు. అంతవరకే అయితే సరే అనవచ్చు. కానీ ఆయన ఏ నిశ్చితాభిప్రాయం లేని 'వ్యామోహాల పుట్ట' అని రోజురోజుకూ రుజువవుతోంది. అదే ఆయనతో 'నేనెవరితోనైనా సరే పొత్తులకు సిద్ధం' అనేలా చేస్తోంది. అన్నట్టూ– పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికి పెడుతుందట అన్న సామెత మనకు ఉండనే ఉంది.

శతాబ్దాలకు సరిపడా నీతుల్ని శతక వాఙ్మయ కర్తలు ఎందుకు బోధించి పోయారోగానీ, అవి నేటి భ్రష్ట రాజకీయ సంస్కృతికి ప్రత్యక్షర సాక్ష్యాలుగా నిలిచి పోతున్నాయి. 'గాలివాటు' రాజకీయాలకు పేరు మోసిన పవన్‌ కల్యాణ్‌ నిశ్చితాభిప్రాయం లేని 'వ్యామోహాల పుట్ట' అని రోజు రోజుకూ రుజువవుతోంది. 'వారాహి' వాహనాన్ని చూపి దాన్నొక బెదిరింపు సాధనంగా చూపెడుతున్నాడు. 'వ్యామోహాలు' ఎలాంటివో వేమన నిర్వచించి పోయాడు: ''ఈ దేహమే వ్యామోహాల పుట్ట. కానీ అశాశ్వతమై పగిలి పోయే ఓ కుండ. ఈ శరీరం తొమ్మిది కంతల తిత్తి. ఆ 'తిత్తి'కి ఒంటి నిండా దిగేసే సొమ్ములు చాలక కులాలు, గోత్రాల పేర్లు కూడా ఆభరణాలుగా తగిలించుకుని ఊరేగుతున్నారు''. అల్ప బుద్ధివాడు అధికారంలోకి వస్తే మంచివాళ్లందర్నీ తొలగ్గొడతాడనీ, ఇదెలాంటిదంటే 'పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికి పెట్టిందన్న' సామెత లాంటిదనీ అన్నాడు.

బహుశా అందుకనే పోతనామాత్యుడు కూడా మనిషి బుద్ధుల్ని నాలుగైదు రకాలుగా వర్ణించి పోయాడు. అవి: 'కుబుద్ధి, మంద బుద్ధి, అల్ప బుద్ధి, దుర్బుద్ధి' అని! ఈ అవకాశవాద బుద్ధే, ఇప్పుడు 'నేనెవరితోనైనా సరే పొత్తులకు సిద్ధం' అని పవన్‌ చేత అనిపిస్తోంది. గత ఎన్నికల్లో 'బింకానికి' పోయి రెండు చోట్ల నిలబడి, అభాసుపాలై ఘోరాతిఘోరమైన ఓటమి పాలయ్యాడు. ఫలితంగా పరువూ పోయింది, 'పవరూ' దూరమై పోయింది. ఇన్ని దారుణ అనుభవాల నుంచి కూడా పవన్‌ తన 'పవనిజం' అన్న పాత స్లోగన్‌ను మాత్రం వదులుకో లేకుండా ఉన్నాడు.

ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన షెడ్యూల్డ్‌ కులాలు, షెడ్యూల్డ్‌ తరగతుల అభ్యున్నతికి రాజ్యాంగపరంగా రక్షణ కల్పించే అవసరాన్ని తొలిసారిగా గుర్తించి దానికి చట్టరూపం ఇవ్వాలన్న తలంపు మొదటిసారిగా 2001లోనే ప్రతిపక్ష నాయక హోదాలో వైఎస్‌ రాజశేఖర రెడ్డికి వచ్చింది. ఆయన ప్రతిపాదించిన దరిమిలానే దళిత వర్గాలకు 'సబ్‌ ప్లాన్‌' చట్టం వచ్చింది. ఆ చట్టం కాలపరిమితి మొన్నటి జనవరి 23తో ముగియవలసింది. కానీ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రి వైఎస్‌

రెండో మాట



జగన్‌ మోహన్‌ రెడ్డి మరో ముందడుగు వేసి దాన్ని మరొక పదేళ్లకు పొడిగిస్తూ ఆర్డినెన్స్‌ జారీ చేయాలని నిర్ణయించడం వల్ల దళితుల, ఆదివాసీల అభ్యున్నతికి ఈ చర్య ఎంతో దోహదం చేస్తుంది. సకల దళిత శక్తులు వివిధ దశల్లో సమీకృతమైన ఫలితమే 'సబ్‌ ప్లాన్‌'. ఆ నిధులు దుర్వినియోగమై పక్కదారులు పడుతున్నాయని సబ్‌ ప్లాన్‌ లక్ష్యాల గురించిన అవగాహన లేని పవన్‌ వాపోవడం కేవలం ఆయన ద్వేష భావననే బట్టబయలు చేస్తోందని చెప్పక తప్పదు.

దేశానికి స్వాతంత్య్రం వచ్చినా, షెడ్యూల్డ్‌ కులాలు, తెగల ప్రజాబాహుళ్యానికి మాత్రం గణనీయమైన స్థాయిలో ఒరిగిందేమీ లేదంటూ అంబేడ్కర్‌ తన బాధను చివరి శ్వాస వరకూ వ్యక్తం చేస్తూనే వచ్చారు. ''షెడ్యూల్డ్‌ కులాలు, షెడ్యూల్డ్‌ తరగతుల బతుకుతెరువులు ఆచరణలో బాగుపడనంత కాలం, ఆ వైపుగా సమూలమైన, సమగ్రమైన మార్పులు రానంత కాలం భారతదేశ భవిష్యత్తు ఆశాజనకంగా ఉండబోదని అంబేడ్కర్‌ స్పష్టం చేశారని సుప్రసిద్ధ జాతీయ వ్యంగ్య చిత్ర వారపత్రిక 'శంకర్స్‌ వీక్లీ' (1953 ఫిబ్రవరి) నివేదించింది. అంతేగాదు, కళావంతులైన దేవదాసీలకు చెందిన కేసరీబాయి కేర్కర్‌ (1892–1977) స్వరంతో 'వందేమాతరం' గ్రామఫోన్‌ రికార్డును సిద్ధం చేయాలనీ, ఆ తొలి కాపీని తానే కొంటాననీ ప్రకటించినవారు అంబేడ్కర్‌! ఎందుకంటే 'సురశ్రీ'గా పేరొందిన కేర్కర్, జైపూర్‌కు చెందిన అత్రౌలి ఘరానాలో 20వ శతాబ్దపు క్లాసికల్‌ సింగర్‌గా పేరొందిన హిందూస్తానీ సంగీత విద్వాంసుడు అల్లాదియా ఖాన్‌ వద్ద శిక్షణ పొందిన విషయాన్ని బహిర్గతం చేశారు అంబేడ్కర్‌.

హైందవంలోని కుల వ్యవస్థను, పరమత విద్వేష భావాలను వ్యతిరేకించిన అంబేడ్కర్‌ చివరికి బౌద్ధ ధర్మాన్ని ప్రేమించి ఆహ్వానించవలసి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర శాసన వేదికలలో పాల్గొనే సభ్యులపై ఏయే అనర్హతా నిబంధనలను విధించాలో 1951లోనే ప్రత్యేక బిల్లును ఆయన రూపొందించారు. శాసన వేదికల్లోని సభ్యులకు రాజకీయ పదవుల ఆశ జూపడం ద్వారానో, మరే ఇతర ప్రయోజనాలు కల్పిస్తామనో ప్రలోభాలకు గురిచేసే పార్లమెంట్‌ వేదిక వల్ల ప్రయోజనం లేదు. ఎలాంటి భీతి లేదా ప్రలోభమో ప్రభుత్వం నుంచి లేకుండా పార్లమెంట్‌ సభ్యులు స్వతంత్రంగా వ్యవహరించలేకపోతే అలాంటి 'పార్లమెంట్‌' వల్ల గానీ, శాసనసభ వల్లగానీ ప్రజలకు ఉపయోగం ఉండదు. అలాంటి స్థితిలోనే పాలకులకు 'డూడూ బసవన్న'లుగా వ్యవహరిస్తారని అంబేడ్కర్‌ హెచ్చరించారు. అలాంటి పరిస్థితుల్లోనే పార్లమెంట్‌ (లేదా శాసన వేదిక) కాస్తా స్టాక్‌ ఎక్స్ఛేంజి వ్యాపార మార్కెట్‌గా ఎలా మారిపోతుందో అంబేడ్కర్‌ ఉదాహరించారు.

అంతేగాదు, బ్రిటిష్‌ ఇండియా ప్రభుత్వంలో ఉన్న షెడ్యూల్డ్‌ కులాల అభ్యర్థుల సంఖ్యకన్నా స్వతంత్ర భారత ప్రభుత్వ కొలువుల్లో ఉన్న వారి సంఖ్య బహు తక్కువనీ, ఆ మాటకు వస్తే తన స్వతంత్ర భారత రాజ్యాంగ ముసాయిదా ప్రతినే తారుమారు చేయడానికి ముసాయిదా సంఘంలోని కొందరు సభ్యులు సాహసించిన విషయాన్నీ కూడా అంబేడ్కర్‌ బయట పెట్టాల్సి వచ్చిందని మరచి పోరాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ రోజున ఆంధ్రప్రదేశ్‌ సహా కొన్ని రాష్ట్రాలలో అధికారం కోసం, దళిత వర్గాలపై ఆధిపత్యం కోసం కేవల పదవీ కాంక్షతో కక్షిదారులైన కొందరు అగ్ర – అర్ధ అగ్రవర్ణాలకు చెందిన 'వినాయకులు' పని చేస్తున్నారన్నది పచ్చి నగ్న సత్యం. బహుపరాక్, ప్రసిద్ధ ఫ్రెంచి చిత్రకారుడు పియరీ నోరా అన్నట్టు– ''జ్ఞాపక శక్తి ఉన్న చోటునే మరుపు పెద్దమ్మ కూడా వెన్నంటే ఉంటుంది''!

abkprasad2006@yahoo.co.in

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్‌ మీడియా

అదే సిగ్నల్‌



మా ఇల్లు పూర్తిగా వాస్తుకు అనుగుణంగా ఉంది. ఉత్తరంలో ఎయిర్‌టెల్‌ సిగ్నల్స్‌ వస్తాయి. దక్షిణంలో వొడాఫోన్‌ సిగ్నల్స్‌ అందుతాయి. మీది కూడా అంతేనా?

– రౌనక్‌ మహాజన్, వ్యాఖ్యాత

తగ్గిన స్థానం



గౌతమ్‌ అదానీ ప్రపంచ ధనవంతుల జాబితాలో తొమ్మిదో స్థానానికి పడిపోయారు. శుక్రవారం ఆయన మూడు నుంచి ఏడో స్థానంలోకి వచ్చారు.

– ప్రశాంత్‌ కనోజియా, ఆర్‌ఎల్‌డీ క్యాంపెయిన్‌ ఇంచార్జ్‌

చరిత్రను మార్చడమా?



మొఘల్‌ గార్డెన్స్‌కు పోటీగా మరొక ఉద్యానాన్ని నిర్మించి దానికి నువ్వు కోరుకున్న పేరు పెట్టుకోవచ్చు కదా! ఈ పేర్ల మార్పు మీద అంత పట్టింపు ఎందుకు? చరిత్రను తుడిచిపెట్టడానికి చేస్తున్న ప్రయత్నం ఇక నిలిచిపోయేట్టు లేదు.

– సుమంత్‌ రామన్, జర్నలిస్ట్‌

జాగ్రత్త అవసరం



ఆస్ట్రేలియాలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నాయి. భారత జాతీయ పతాకాన్ని చూపినందుకుగానూ హిందూ సమాజానికి చెందిన భారతీయులను ఖాలిస్తానీలు ఆస్ట్రేలియా వీధుల్లో కొట్టారు. ఖాలిస్తానీ తీవ్రవాదం అనేది ఏ క్షణమైనా పేలే బాంబు.

– మోనికా వర్మ, వ్యాఖ్యాత

పరిష్కారమే కానీ...



ఒకవేళ పాకిస్తాన్‌ ఎప్పటికీ భారత్‌తో విడిపోక పోయివుంటే, వాళ్ల పరిస్థితి ఇలా ఉండేది కాదు. పాకిస్తాన్‌ను కాపాడటానికి ఉన్న ఏకైక పరిష్కారం 'అఖండ్‌ భారత్‌' మాత్రమే. కానీ ఒకవేళ ఈ సమయంలో ఇండియాతో పాకిస్తాన్‌ కలిస్తే అది ఇండియా ప్రగతిని కూడా ఆపుతుంది.

– పాయన్‌ అలీ, స్వేచ్ఛావాది

సయోధ్యే తారకమంత్రం



యావజ్జీవితం హిందూ ముస్లిం ఐక్యత కోసం కృషి చేసినందుకు 75 ఏళ్ల క్రితం ఈ రోజున (జనవరి 30) మహాత్మా గాంధీ హత్యకు గురయ్యారు. మహాత్ముడికి నివాళులు అర్పిస్తున్నవారు సామాజిక సయోధ్య అనేదాన్ని జీవించేందుకు ఒక విశ్వాస నియమంగా పెట్టుకోవాలి. పెదవుల మీద రామ్, హృదయాల్లో నాథూరామ్‌ ఉండకూడదు.

– రాజ్‌దీప్‌ సర్దేశాయ్, జర్నలిస్ట్‌

వాళ్లెందుకు వినాలి?



సౌదీ అరేబియా అంతటా మసీదుల్లో బయటి లౌడ్‌స్పీకర్ల వాడకాన్ని నియంత్రించారు. అల్లాహ్‌ మాత్రమే అసలైన, అత్యున్నత దేవుడు అని రోజుకు ఐదుసార్లు నిరంతరం బిగ్గరగా చెప్పుకొనే 'అజాన్‌'ను ఇండియా కూడా తప్పక నిషేధించాలి. 'కాఫీర్లు' దాన్ని బలవంతంగా ఎందుకు వినాలి?

– ఖాలిద్‌ ఉమర్, సెక్యులర్‌ హ్యూమనిస్ట్‌

భారత రత్న ఇవ్వాలి!

ఈ ఏడాది పద్మ పురస్కారాలు ప్రకటించారు కానీ దేశ అత్యున్నత పురస్కారం 'భారత రత్న'ను ప్రకటించలేదు. ఎన్నో త్యాగాలూ, సేవలూ చేసినవారికి ప్రదానం చేసే ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రతి ఏడాదీ ప్రకటించి వారిని గౌరవించుకోవడం మన విధి. 1954 నుండి భారత రత్న పురస్కారాన్ని ఇస్తున్నారు. ఇప్పటివరకు 48 మందికి ఈ అవార్డును అందించారు. చివరిసారిగా 2019లో ముగ్గురికి ఇచ్చారు. సామాజిక సేవకుడు నానాజీ దేశ్‌ముఖ్‌ (మరణానంతరం), కళాకారుడు డాక్టర్‌ భూపేన్‌ హజారికా (మరణానంతరం), మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ ముఖర్జీలకు ఈ అవార్డును ప్రదానం చేశారు.

భారత రత్నకు వ్యక్తులను ఎంపిక చేసే ప్రక్రియ పద్మ అవార్డుల కంటే భిన్నంగా ఉంటుంది. ఈ అవార్డుకు వ్యక్తులను సిఫార్సు చేసే ప్రక్రియ ప్రధాన మంత్రి నుంచి మొదలవుతుంది. వ్యక్తుల పేర్లను ఆయనే భారత రాష్ట్రపతికి పంపిస్తారు. కులం, వృత్తి, జెండర్‌... ఇలా ఎలాంటి భేదం లేకుండా ఎవరి పేరునైనా భారత రత్నకు పరిశీలించొచ్చు. ప్రతి ఏటా ముగ్గురికి భారత రత్న ఇవ్వొచ్చు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా పద్మ పురస్కారాలను ప్రకటించినట్లుగా భారత రత్న పురస్కారాన్ని ప్రకటించడం లేదు. అలా ప్రకటించాలని ప్రత్యేక నిబంధనలు ఏమీ లేకపోయినప్పటికీ, దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ళు అయిన సందర్భంగా ఈ ఏడాది దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను అర్పించిన అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్‌ ఆజాద్‌ వంటి మహనీయులకూ గొప్ప సంఘ సంస్కర్త లైన పూలే దంపతులకూ, జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య వంటి త్యాగ ధనులకూ, ధ్యాన్‌ చంద్‌ వంటి క్రీడాకారులకూ భారత రత్న పురస్కారం ఇచ్చి ఉంటే బాగుండేది.

ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజాభివృద్ధి కోసం పాటుపడిన విశిష్ట వ్యక్తులకు భారత రత్నను ప్రదానం చేయడం ద్వారా వారి త్యాగాలను ఈ తరానికి మరొక్కసారి పరిచయం చేసినట్లు అవుతుంది. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– ఎం. రాం ప్రదీప్, తిరువూరు, ఎన్టీఆర్‌ జిల్లా

'పెద్దలు' కుమ్మక్కైతే న్యాయం గతేమిటి?

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్‌

మన రాజ్యాంగం ఎవరో ఒకరు రచించిన పుస్తకం కాదు. అది అంబేడ్కర్‌ వంటి మహానుభావులు నిర్మించిన ఒక సంవిధానం. రాజ్యాంగ నియమాలతో పాటు కొన్ని సంప్రదాయాలూ అనేక ఏళ్ల నుంచీ కొనసాగుతున్నాయి. అందులో సుప్రీం కోర్టు కొలీజియం వ్యవస్థ ఒకటి. ఈ వ్యవస్థ ద్వారా న్యాయమూర్తుల నియామకాలనూ, బదిలీలనూ చేపడతారు. అయితే ఈ కొలీజియం వ్యవస్థ పార్లమెంట్‌ చేసిన చట్టం ద్వారానో లేదా రాజ్యాంగ నిబంధనలను అనుసరించో ఏర్పడింది కాదు. అది సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా పరిణామం చెందిన వ్యవస్థ. సుప్రీంకోర్టు కొలీజియానికి సుప్రీం ప్రధాన న్యాయమూర్తి మార్గదర్శకత్వం వహిస్తారు. నలుగురు సుప్రీం కోర్టు సీనియర్‌ న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. హైకోర్టు కొలీజియానికి ఆ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నాయకత్వం వహిస్తారు. ఇద్దరు సీనియర్‌ హైకోర్టు న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. కొలీజియం సిఫార్సు చేసినవారిని ప్రభుత్వం నియమిస్తుంది. అయితే ఇటీవల కేంద్ర న్యాయ శాఖా మంత్రి కిరణ్‌ రిజిజు కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధి ఉండాలనే ప్రతిపాదన చేస్తూ సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖ వివాదాస్పదమయింది.

సుప్రీం కోర్టు ధర్మాసనాలు ఇచ్చిన అనేక తీర్పుల వల్ల... నియమాల కన్నా ఎక్కువగా సంప్రదాయాల ఆధారంగానే స్వతంత్ర న్యాయవ్యవస్థ నిర్మితమవుతూ వస్తోంది. ఈ క్రమంలోనే కొలీజియం వచ్చింది. ఇప్పుడు ఆ వ్యవస్థలో ప్రభుత్వ ప్రతినిధి ఉండాలనే ప్రతిపాదన న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తినే దెబ్బ తీసేవిధంగా ఉందని పలువురు న్యాయనిపుణులు అంటున్నారు.

కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధికి స్థానం గురించి మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం మాట్లాడుతూ... ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్‌ జగదీప్‌ ధన్‌ఖర్, లోక్‌సభ స్పీకర్‌ ఓం బిర్లా, కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్‌ రిజిజుల అభిప్రాయాలను ప్రస్తావించారు. ఆ సందర్భంగా రాజ్యాంగ మౌలిక నిర్మాణం లేదా స్వభావాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే సమాఖ్య, కార్యనిర్వాహకవర్గం, స్వతంత్ర న్యాయవ్యవస్థ రాజ్యాంగ ముఖ్య విభాగాలు అని రాజ్యాంగ ధర్మాసనం నిర్దేశించిన సంగతిని పేర్కొన్నారు.

కొలీజియంలో పార్లమెంట్, ప్రభుత్వ పెద్దలకు స్థానం కల్పించడానికి చేసిన 99వ రాజ్యాంగ సవరణ చట్టాన్నీ, జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ (ఎన్‌జేఏసీ) చట్టాన్నీ సుప్రీం కోర్టు కొట్టివేసిన విషయాన్నీ ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న 'పెద్దలు' (ముగ్గురు) పరోక్షంగా సుప్రీం ఇచ్చిన ఈ తీర్పును ఒప్పుకోవడం లేదనీ, ఆ నిర్ణయాన్ని మరో దారిలో అమలుచేయాలని చూస్తున్నారనీ ట్విట్టర్‌ వేదికగా ఆయన అన్నారు.

'1967–77 సంవత్సరాల మధ్య దేశ చరిత్రను ధన్‌ఖర్, బిర్లా, రిజిజులు చదివే ఉంటారని నేను భావిస్తున్నాను. రెండు భిన్న విషయాలను ధన్‌ఖర్‌ కలగలిపి వేశారు. రాజ్యాంగంలోని



ప్రతీ లేదా ఏదైనా ఒక నిబంధనను పార్లమెంటు సవరించగలదా; ఆ సవరణ న్యాయ వ్యవస్థ సమీక్ష పరిధిలోకి రాదా అన్నది ఒక అంశం. 99వ రాజ్యాంగ సవరణను, జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ చట్టాన్ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు సరైనదేనా అన్నది రెండో అంశం. సుప్రీం కోర్టు కేశవానంద భారతి కేసులో తీసుకున్న నిర్ణయం సరైనదనీ, జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ చట్టం కేసులో తప్పుడు నిర్ణయం తీసుకున్నదనీ అభిప్రాయపడేందుకు ఆస్కారమున్నది. నిజానికి న్యాయశాస్త్ర పండితులు అనేక మంది ఇదే విధంగా అభిప్రాయపడుతున్నారు' అని చిదంబరం అన్నారు.

అంతేకాదు ''న్యాయవ్యవస్థ నిర్ణయాల కంటే పార్లమెంటు నిర్ణయాలే సర్వోన్నతమైనవనే వాదనను అంగీకరించామనుకోండి. జరిగేదేమిటి? నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. జమ్మూ–కశ్మీర్‌లో వలే ఒక రాష్ట్రాన్ని విభజించి పలు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేయడాన్ని మీరు ఆమోదిస్తారా? వాక్‌ స్వాతంత్య్రాన్నీ, దేశంలోని ఏ ప్రాంతంలోనైనా నివసించే స్వేచ్ఛనూ, ఏ వృత్తినైనా ఆచరించే, ఏ వ్యాపారాన్ని అయినా చేసే స్వేచ్ఛను రద్దుచేయడాన్ని మీరు ఒప్పుకుంటారా? స్త్రీ పురుషులను సమానంగా పరిగణించని, హిందువులు, ముస్లింల పట్ల రాజ్య వ్యవస్థ భిన్న రీతుల్లో వ్యవహరించడాన్ని అనుమతించి... స్వలింగ సంపర్కులకు హక్కులు నిరాకరించే చట్టాలను మీరు ఆమోదిస్తారా? ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, పార్శీలు, జైనులు, బౌద్ధులు, యూదులు, ఇతర మైనారిటీ వర్గాలకు రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులను రద్దు చేయడాన్ని మీరు అంగీకరిస్తారా? ఏడవ షెడ్యూలు నుంచి రాష్ట్ర జాబితాను తొలగించి, శాసన నిర్మాణాధికారాలు అన్నిటినీ పార్లమెంటుకు అప్పగించడాన్ని మీరు సమ్మతిస్తారా? ఒక నిర్దిష్ట భాషను యావద్భారతీయులు తప్పనిసరిగా నేర్చుకు తీరాలనే ఆదేశాన్ని మీరు పాటిస్తారా? నేరారోపణకు గురైన ప్రతీ వ్యక్తి అమాయకుడుగా నిరూపణ కానంతవరకు అతడిని అపరాధిగా భావించాలని నిర్దేశిస్తున్న చట్టాన్ని మీరు అంగీకరిస్తారా? పార్లమెంటు నేడు అటువంటి చట్టాలు చేయదు, చేయలేదు. చేసినా వాటిని సమీక్షించి తిరస్కరించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉన్నది. ఇందుకు భిన్నంగా 'పార్లమెంటరీ పూర్ణాధిపత్యం, న్యాయవ్యవస్థ సంయమనం' సిద్ధాంతం కింద అటువంటి చట్టాలపై న్యాయ సమీక్ష జరగదు'' అని చిదంబరం పేర్కొన్నారు.

రాజ్యాంగ సంవిధాన మౌలిక స్వభావాన్ని మార్చడానికి వీలులేదని సుప్రీంకోర్టు అనేక సార్లు చెప్పినా, దశాబ్దాలుగా స్థాపితమైన సంప్రదాయాలు మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. 99వ రాజ్యాంగ సవరణను, జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ చట్టాన్ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినా... ప్రధానమంత్రీ, ఇతర ముఖ్యమైన మంత్రులూ, నాయకులూ తమ బాధ్యతను మరచి రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీయడానికి ఏదో విధంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

కొలీజియంలోని సుప్రీంకోర్టు సీనియర్‌ న్యాయమూర్తులు కాకుండా చీఫ్‌ జస్టిస్, ప్రధాన మంత్రి, న్యాయమంత్రి కలిసి న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో పాల్గొనే విషయాన్ని ఈ 'ముగ్గురు' పెద్దలు నిర్ణయిస్తారట. ఇదే జరిగితే న్యాయం బతుకుతుందా?

వ్యాసకర్త డీన్, స్కూల్‌ ఆఫ్‌ లా, మహీంద్రా యూనివర్సిటీ

అగతాసువులు

'అర్జునా! యుద్ధభూమికి వచ్చి కీలక సమయంలో అస్త్ర సన్యాసం చేస్తానంటున్నావు. పెద్ద పెద్ద మాటలన్నీ చెప్తున్నావు. కానీ నిజంగా ప్రజ్ఞాశాలులైన వారు 'గతాసువు'లను గురించి గానీ, 'అగతాసువు'లను గురించి గానీ ఇలా శోకించరు' అంటూ శ్రీకృష్ణ పరమాత్మ తన గీతాబోధ ఆరంభిస్తాడు.

'గత అసువు'లంటే అసువులు కోల్పోయిన వాళ్ళు. 'అగత –అసువు'లంటే బ్రతికి ఉన్నవాళ్ళు. ఇంకొంత కచ్చితంగా అనువదిస్తే, 'అ–గత–అసువు'లంటే 'ఇంకా ప్రాణాలు కోల్పోని వాళ్ళు' అని చెప్పాలి. బతుకుతున్న వాళ్లందరినీ పట్టు కొని, కేవలం 'ఇంకా మరణించనివాళ్ళు'గా ప్రస్తావించడం కొంచెం కటువుగా ఉన్నా, అది ఎంతో అర్థవంతమైన మాట.



ఈ జీవన స్రవంతి ఒక నిరంతర ప్రవాహం. పాత నీటిని తోసుకొంటూ కొత్త నీరు రావటం ప్రవాహ ధర్మం. జాతస్య హి ధ్రువో మృత్యుః – పుట్టిన వాడికి మరణం తథ్యం. ధ్రువం జన్మ మృతస్య చ– మరణించినవాడు కర్మఫల శేషం అనుభవించడానికి మళ్ళీ పుట్టక తప్పదు. ఇది ఇంద్రియ గోచరం కాక పోయినా, శాస్త్రాలు చెప్పే ఆప్తవాక్య రూపమైన సత్యం. 'ఇంకా పుట్టని వాళ్ళు పుట్టా లంటే, ఇంకా మరణించని వాళ్ళే చోటివ్వాలి' అని చమత్కరిస్తారు స్వామి చిన్మయానంద.

'నేను మర్త్యుడిని. నా జీవితం క్షణ భంగురం' అని తరచుగా గుర్తుచేసుకొంటుంటే, జీవితాలను మరింత ఎక్కువ నిశ్చింతగానూ, అత్యాశలకూ అధర్మాలకూ దూరంగానూ జీవించవచ్చని పెద్దలెందరో ఉద్బోధిస్తూ వచ్చారు. ప్రాణికోటిలో యావన్మందికీ తప్పనిసరి అని తెలిసిన విషయాల గురించి శోకించటం వల్ల ప్రయోజనం శూన్యం. మన నియంత్రణలో లేని విషయాల చింత మాని, మన వల్ల కావలసిన పని మీద దృష్టి ఉంచితే సమర్థత పెరుగుతుంది అన్నది వ్యక్తిత్వ వికాస ప్రాథ మిక సూత్రాలలో ఒకటి.

'త్రికరణ శుద్ధితో నీ స్వధర్మం నువ్వు నిర్వహించు. లాభాలాభాలూ, జయాపజయాలూ సమంగా భావించి, ఫలాపేక్ష లేకుండా కర్తవ్యతా భావంతో పని చేయటమే కర్మయోగం. కర్మ మీద ధ్యాస ఉంచు, ఫలం మీద ఆసక్తి వదులు. 'కర్మణి ఏవ అధికారః తే, మా ఫలేషు!' అంటూ గీతా బోధ ఆరంభమౌతుంది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.దశమి ప.2.34 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: రోహిణి రా.2.59 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: సా.6.32 నుండి 8.15 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.50 నుండి 9.34 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.46 వరకు, అమృతఘడియలు: రా.11.33 నుండి 1.12 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.37, సూర్యాస్తమయం: 5.50.

క్లుప్తంగా...

టీడీపీ నేతలపై ఎమ్మెల్యే వంశీ పరువు నష్టం దావా

గన్నవరం: టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి రామ్, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడుపై స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరువు నష్టం దావా దాఖలు చేశారు. సంకల్ప సిద్ధి మల్టీ మార్కెటింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానితో పాటు తనపై అసత్య ఆరోపణలు చేసినందుకు పరువు నష్టం దావా వేసినట్లు ఎమ్మెల్యే వంశీ పేర్కొన్నారు. ఈ మేరకు కృష్ణాజిల్లా గన్నవరం కోర్టుకు స్వయంగా వచ్చి దావాకు సంబంధించిన పత్రాలను కోర్టు అధికారులకు సమర్పించారు. అనంతరం వంశీమోహన్ మాట్లాడుతూ... టీడీపీతో విభేదించినప్పటి నుంచి ఆ పార్టీ నేతలు ఓ ప్రణాళికా బద్ధంగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగా సంకల్ప సిద్ధి మల్టీ మార్కెటింగ్ స్కీమ్‌కు కొడాలి నానికి, తనకు సంబంధం ఉందని సామాజిక మాధ్యమాలు, ప్రెస్‌మీట్ల ద్వారా టీడీపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా కార్యాలయాల నుంచి అసత్య ప్రచారం చేసిందన్నారు. పేద ప్రజల నుండి దోచుకున్న డబ్బుతో బెంగళూరులో ఆస్తులు కొనుగోలు చేసినట్లుగా తమపై నిరాధారమైన, అసంబద్ధమైన ఆరోపణలు చేశారని తెలిపారు. ఇప్పటికే తమపై తప్పుడు ఆరోపణలు చేసిన పట్టాభి, బచ్చుల అర్జునుడుకు లీగల్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఇంతవరకు తన నోటీసులకు స్పందించలేదన్నారు. అందుకే పట్టాభి, బచ్చులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పరువు నష్టం దావాను దాఖలు చేశానని ఎమ్మెల్యే వంశీ స్పష్టం చేశారు.

యువతి సాహస యాత్ర

- సైకిల్‌పై భోపాల్ నుంచి తిరుపతికి చేరిన ఆశ మాలవీయ
- సన్మానించిన ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



తిరుపతి క్రైం: ప్రముఖ సైకిల్ రైడర్ ఆశ మాలవీయ ఒంటరిగా భోపాల్ నుంచి ప్రారంభించిన సైకిల్ యాత్ర సోమవారం తిరుపతికి చేరింది. మధ్యప్రదేశ్‌లోని రాజగర్ జిల్లా, నాటారం గ్రామానికి చెందిన ఆశ మాల వీయ 2022, నవంబర్ ఒకటో తేదీన భోపాల్ నుంచి ఆల్ ఇండియా సైకిల్ యాత్ర ప్రారంభించారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మీదుగా తన యాత్రను కొనసాగించి ఆగస్టు 5వ తేదీన ఢిల్లీకి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రపంచంలో మహిళలకు భారతదేశానికి మించిన సురక్షితమైన దేశం మరొకటి లేదనే విషయాన్ని చాటిచెప్పేందుకు తాను ఈ యాత్ర చేపట్టినట్లు ఆశ మాలవీయ వెల్లడించారు. ఈ క్రమంలో ఆమె 91వ రోజున తిరుపతి చేరుకుని ఎస్పీ కార్యాలయం వద్దకు వచ్చారు. ఆశ మాలవీయను ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సన్మానించారు. అనంతరం గాంధీజీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆశ మాలవీయ మూడేళ్ల వయసులోనే తన తండ్రిని కోల్పోయారని, తల్లి రాజుబాయి ప్రోత్సాహంతో పీజీ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పూర్తిచేశారని చెప్పారు. మౌంటేనీరింగ్(పర్వతారోహణ) క్రీడాకారిణిగా ఉంటూ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సాధించారని తెలిపారు. ఆమె ఇప్పటికే తన యాత్రను ఏడు రాష్ట్రాల మీదుగా 8,200 కిలోమీటర్లు కొనసాగించారని, దిగ్విజయంగా పూర్తిచేసి, తన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, విమలకుమారి, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు. కొద్దిసేపు విరామం అనంతరం ఆశ మాలవీయ బయలుదేరి నెల్లూరు వైపు వెళ్లారు.

సడలని వృక్ష బంధం!



క్రేన్ సాయంతో చెట్లను తరలిస్తున్న దృశ్యం

రాజానగరం: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధంలో ఒక రైతు పొలంలో సుమారు 50 ఏళ్లుగా పెనవేసుకుని ఉన్న మర్రిచెట్టు, తాటిచెట్టు అనుబంధానికి స్థానిక జీఎస్ఎల్ ప్రాంగణంలో సోమవారం పునఃప్రతిష్ట జరిగింది. మర్రిచెట్టులో మొలచిన తాటిచెట్టును పొలం అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగిస్తున్నారన్న విషయాన్ని జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలుసుకున్నారు. వెంటనే రైతుతో మాట్లాడి.. ప్రొక్లెయిన్ సాయంతో 20 అడుగుల విస్తీర్ణంలో 10 అడుగుల లోతు తీసి, చెట్ల వేళ్లు ఏమాత్రం దెబ్బతినకుండా తొలగించారు. అనంతరం ట్రాలీపై జీఎస్ఎల్ ప్రాంగణంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న హాబిటేట్ రెస్టారెంట్ ముంగిట ఉన్న ప్రాంగణంలో నాటారు. ఈ చెట్ల బరువు 40 టన్నులు, ఎత్తు 40 అడుగులు ఉంటుంది. 20 మంది పనివారితో నాలుగు రోజులుగా చేస్తున్న ఈ పనులు సోమవారం పూర్తయ్యాయని జీఎస్ఎల్ ఇంజినీర్ మురళీ తెలిపారు. ఏడాదిన్నర కిందట ఇదే విధంగా రంగంపేట మండలం, వడిశలేరు నుంచి కూడా వందేళ్ల వయస్సున్న మర్రిచెట్టును తెచ్చి ఇదే ప్రాంగణంలో పాతారు. ప్రస్తుతం అది పచ్చని ఆకులతో కళకళలాడుతోంది.

ఆత్మనిర్భర్ భారత్‌కు ఉన్నత విద్య కీలకం

- ఏఐయూ అధ్యక్షుడు ఆచార్య సురంజన్ దాస్
- నేడు, రేపు ఏయూలో దక్షిణ భారత వీసీల సమావేశం



మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఏఐయూ అధ్యక్షుడు సురంజన్‌దాస్

ఏయూ క్యాంపస్: భారతీయ విద్య విధానం మార్పులకు అవకాశం ఇస్తోందని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) అధ్యక్షుడు ఆచార్య సురంజన్ దాస్ తెలిపారు. ఏయూ సెనేట్ మందిరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ సాధించే ప్రక్రియలో ఉన్నత విద్య, పరిశోధనలు కీలకంగా నిలుస్తాయని చెప్పారు. వీటిని ప్రధానంగా చేసుకుని ఏఐయూ రెండు రోజుల సదస్సును ఏయూ వేదికగా నిర్వహిస్తోందన్నారు. దేశ అభ్యున్నతికి ఉపయుక్తంగా తీసుకోవాల్సిన చర్యలు, అవలంబించాల్సిన విధానాలపై ఏఐయూ ఒక నివేదికను సిద్ధం చేసి ఏటా కేంద్రానికి అందిస్తుందని తెలిపారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏయూ వేదికగా సౌత్ జోన్ విశ్వవిద్యాలయాల సదస్సును మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తామని తెలిపారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 11.30 గంటలకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభిస్తారని, అనంతరం ఏయూలోని ఐఐఎం సమావేశ మందిరంలో సెషన్స్ నిర్వహిస్తామని చెప్పారు. సదస్సులో సౌత్ జోన్‌కి చెందిన 140 మంది విశ్వవిద్యాలయాల ఉప కులపతులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏఐయూ సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిట్టల్, ఏఐయూ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీడీ శర్మ, ఏఐయూ సమన్వయకర్త డాక్టర్ ఎస్.రమాదేవి, ఏయూ సమన్వయకర్త డాక్టర్ కె.రాంజీ తదితరులు ప్రసంగించారు.

అందుబాటులోకి డిజిటల్ తాళపత్రాలు

ఆంధ్రవిశ్వవిద్యాలయం వద్ద దశాబ్దాలుగా 1,109 మంది దాతలు అందించిన 2.62 లక్షల పురాతన తాళపత్రాలున్నాయని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. రెండేళ్లుగా ప్రత్యేక సాంకేతిక ఉపకరణాలతో 2.16 లక్షల తాళపత్రాలను డిజిటలైజేషన్ చేశామని, వీటిని మంగళవారం గవర్నర్ చేతుల మీదుగా క్లౌడ్‌లో ఉంచి జన బాహుళ్యంలోకి తెస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఈ జ్ఞానాన్ని అన్ని విశ్వవిద్యాలయాలు వినియోగించుకునే వీలుంటుందని వివరించారు.

ఆదాయ లక్ష్యం మైలురాయి దాటిన 'రైల్వే'

- విజయవాడ రైల్వే డివిజన్ ఆదాయ లక్ష్యం రూ.3,257 కోట్లు
- ఆర్థిక సంవత్సరానికి 63 రోజుల ముందే రూ. 3,271 కోట్ల రాబడి



రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌కు 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన రూ.3,257 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని ఏడాది ముగియటానికి 63 రోజులు ముందుగానే సాధించి రికార్డు సృష్టించినట్లు సీనియర్ డీసీఎం వి.రాంబాబు తెలిపారు. జనవరి 28న సరుకు రవాణా ద్వారా డివిజన్ రూ. 3,271 కోట్ల ఆదాయానికి చేరుకోవడంతో ఈ రికార్డు నమోదైనట్లు చెప్పారు. 2018–19 ఆర్థిక సంవత్సరంలో నమోదైన అత్యధిక ఆదాయం రూ.5,136 కోట్ల మైలురాయిని దాటేందుకు అతి దగ్గరలోనే ఉన్నట్లు తెలిపారు. సాధించిన ఆదాయంలో ప్రధానంగా 15.12 మెట్రిక్ టన్నుల బొగ్గు రవాణా ద్వారా 52 శాతం వచ్చిందని చెప్పారు. ఆరు మెట్రిక్ టన్నుల ఎరువుల రవాణా రెండవ పెద్ద ఆదాయ వనరుగా ఉందన్నారు. అదే విధంగా డివిజన్‌లోని బి.డి.యు. (బిజినెస్ డెవలప్‌మెంట్ యూనిట్)ల కృషితో సన్‌ఫ్లవర్ ఆయిల్, కలప, గోధుమలు, ఫ్లైయాష్ బ్రిక్స్ తదితర కొత్త రవాణా మార్గాలతో పాటు కృష్ణపట్నం పోర్టు, కాకినాడ పోర్టు సైడింగ్స్ కీలక పాత్ర పోషించాయన్నారు. కాగా, ఈ అరుదైన ఘనత సాధించడంలో కృషి చేసిన సీనియర్ డీసీఎం రాంబాబు, సీనియర్ డీవోఎం నరేంద్రవర్మను డీఆర్ఎం శివేంద్రమోహన్ ప్రత్యేకంగా అభినందించారు.

ఖేలో ఇండియా పోటీలకు పయనం

- రాష్ట్రం నుంచి 87మంది క్రీడాకారుల ప్రాతినిధ్యం
- దశల వారీగా మధ్యప్రదేశ్ వెళ్తున్న క్రీడా జట్లు
- తొలిసారిగా ఖేలో ఇండియాలో జలక్రీడలకు ప్రవేశం
- ఏపీ నుంచి వాటర్ స్పోర్ట్స్‌లో ఐదుగురు సభ్యుల బృందం

సాక్షి, అమరావతి: మధ్యప్రదేశ్‌లో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా–2022 జాతీయ పోటీలకు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు తమ షెడ్యూల్ ప్రకారం తరలి వెళుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్, ఇండోర్, గ్వాలియర్, ఉజ్జయిని, జబల్‌పూర్, మండల, బాలాఘాట్, ఖర్గోవ్ పట్టణాల్లో 13 రోజులపాటు జరిగే ఈ పోటీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 5,812 మంది క్రీడాకారులు పాల్గొంటారు. రాష్ట్రం నుంచి 13 క్రీడాంశాల్లో 87 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారు. మొత్తం 27 విభాగాల్లో పోటీలు నిర్వహించనుండగా, తొలిసారిగా జల క్రీడలైన కానో స్లాలోమ్, కయాకింగ్, కెనోయింగ్–రోయింగ్‌ను ప్రవేశపెట్టారు. ఫెన్సింగ్‌ను కూడా చేర్చారు. అండర్–18 బాలబాలికల విభాగంలో ఫిబ్రవరి 11వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. ఈ మెగా స్పోర్ట్స్ ఈవెంట్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమవగా, మంగళవారం నుంచి షెడ్యూల్ ప్రకారం క్రీడా పోటీలను నిర్వహించనున్నారు.

ఏపీ నుంచి ఇలా...

రాష్ట్రం నుంచి 13 క్రీడాంశాల్లో 87 మంది క్రీడాకారులు పోటీపడనున్నారు. ఈ పోటీల తేదీల వారీగా క్రీడాకారుల జట్లను మధ్యప్రదేశ్ పంపిస్తున్నారు. తొలి విడతగా కొన్ని జట్లు వెళ్లాయి. క్రీడాకారులకు శాప్ ప్రత్యేక శిక్షణ కూడా అందించింది. చివరి తేదీల్లో పోటీలు ఉన్నవారికి రెండు, మూడు రోజుల పాటు అదనపు శిక్షణ లభించేలా ప్రయాణ ఏర్పాట్లుచేశారు. తొలిసారిగా జలక్రీడల్లో ఏపీ నుంచి ఐదుగురు క్రీడాకారులు పోటీ పడనున్నారు.

11 క్రీడల ప్రత్యక్ష ప్రసారం..

ఖేలో ఇండియా పోటీల్లో 11 క్రీడాంశాలను హాట్‌స్టార్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. వీటిల్లో అథ్లెటిక్స్, రెజ్లింగ్, బాక్సింగ్, షూటింగ్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, టెన్నిస్, యోగా, మల్లఖంబ ఉన్నాయి.

విశాఖ కేంద్రంగా పాలన చేయాలి

855వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో విశాఖ కేంద్రంగా పాలన సాగించే దిశగా నిర్ణ యం తీసుకోవాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు కోరారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 855వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధే ధ్యేయంగా 5 కోట్ల మంది ప్రజలు ఎదురుచూస్తున్నారని, కానీ బాబు మాత్రం తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అమరావతిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. 29 గ్రామాల్లో రైతులు, రైతు కూలీ లు ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన దుస్థితికి కారణం బాబు కాదా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పాత్రను పక్కనబెట్టిన బాబు తన పుత్రుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌ను ప్రజల్లోకి పంపించి అబద్ధాలు ప్రచారం చేసి నా నమ్మే పరిస్థితి లేదన్నారు. రాజకీయాలకు అనర్హుడైన అజ్ఞాని లోకేశ్‌ను జాకీలు పెట్టి పైకి లే పేందుకు ఎల్లో మీడియా ప్రభుత్వంపై బురదచల్లుతున్నారని చెప్పారు. నాయకులు మాదిగాని గురు నాథం, నూతక్కి జోషి, పులి దాసు, పెరికే వరప్రసాద్ పలువురు దళిత నాయకులు మహిళలు పాల్గొన్నారు.

కువైట్ నుంచి స్వస్థలానికి..

- ఏపీఎన్ఆర్‌టీఎస్ సాయం



కడప కార్పొరేషన్: పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గానికి చెందిన కట్టా వెంకట శ్రీనివాసులు అనే వ్యక్తికి ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సహకారం అందించింది. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వెంకట శ్రీనివాసులు కువైట్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. సదరు కంపెనీ సక్రమంగా జీతాలు ఇవ్వకుండా అకామా రెన్యూవల్, రెసిడెన్సీకి సంబంధించిన విషయాలు పట్టించుకోకపోవడంతో నాలుగేళ్లుగా అతను అకామా లేకుండానే బయట పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. అయితే దురదృష్టవశాత్తు అతని ఆరోగ్యం దెబ్బతిని రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. కువైట్‌లోని ఫర్వానియ ఆస్పత్రిలో దీనస్థితిలో ఉన్న అతని పరిస్థితిని వారి కుటుంబ సభ్యులు ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. కువైట్ రీజినల్ కో–ఆర్డినేటర్ నాయిని మహేశ్వర్‌రెడ్డి ద్వారా ఎంబసీ అధికారులను సంప్రదించి ఈనెల 26వ తేదీ ఇండియాకు పంపించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టికెట్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి 20 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 78,639 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లను భక్తులు సమర్పించారు.

రేపు తిరుమలలో విష్ణు సహస్రనామ అఖండ పారాయణం

భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య తిరుమల నాదనీరాజనం వేదికపై విష్ణు సహస్రనామ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. వేదపండితులు శ్రీ రామానుజచార్యులు పర్యవేక్షణలో జాతీయ సంస్కృత విద్యాపీఠం ఉపకులపతి డాక్టర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తదితరులు విష్ణు సహస్రనామ విశిష్టతను భక్తులకు వివరిస్తారు.



వారి ఆభరణాలకు అతుకులు ఉండవు. బంగారంలో కల్తీకి అసలు అంగీకరించరు. స్వచ్ఛమైన మేలిమి బంగారంతోనే నగానట్రా చేయించుకుంటారు. దాని కోసం స్వర్ణకారుల వద్ద స్వయంగా కూర్చుని మరీ తమకు కావలసిన రీతిలో వస్తువులు చేయించుకుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే పల్లె జీవనంలో ఉండే స్వచ్ఛతే తమ అభరణాల్లోనూ ఉండాలని వారు తపిస్తారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని మారుమూల మత్స్యకార, గిరిజన పల్లెల్లో ఇప్పటికీ ఇటువంటి స్వచ్ఛమైన జీవన సౌందర్యం కనిపిస్తుంది. అక్కడి మహిళల మోముల్లో తొణికిసలాడే అమాయకత్వం.. ఈ ఆభరణాల జిలుగులతో వారి అందాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. పల్లెల్లో నిన్నటితరం ప్రతినిధులైన అమ్మమ్మలు, నాయనమ్మల్లో చాలా మంది ఇలాంటి ఆభరణాలే ధరిస్తుంటారు. అసలు వీటి ప్రత్యేకతలేమిటి..? ప్రస్తుతం వీటిని తయారు చేసే వారు ఎక్కడ ఉన్నారు. తయారు చేయాలంటే ఎంత చార్జీ చేస్తారు..? వంటి వివరాల సమాహారమే ఈ కథనం.



జీవితమైనా.. నగలైనా.. స్వచ్ఛతే ఆభరణం

- అతుకులు లేని వస్తువులపైనే మోజు
- వాటి తయారీ కూడా కష్టమే
- భిన్నమైన డిజైన్లతో ఆకట్టుకునే రీతిలో..
- పల్లె అందాలకు వింత సోయగం







శ్రీకాకుళం డెస్క్:

చాలా మ్యాగజైన్లు, పత్రికలు.. ఫొటో ఎగ్జిబిషన్లలో గిరిజన, పల్లెకార మహిళల ఫొటోలను ఇట్టే గుర్తుపట్టేస్తాం. కారణం వారి కట్టు..బొట్టు.. ధరించే నగల్లో ప్రత్యేకత. ముక్కు, చెవి, మెడ భాగాల్లో చిత్రమైన ఆకృతులతో కూడిన వారి నగలు మనల్ని ఆకర్షిస్తాయి. అలాంటి ఆభరణాలు ఏ షోరూమ్‌లలో కూడా కనిపించవు. వాటి కోసం ఎవరూ పెద్దగా ప్రచారం కూడా చేయరు. తయారీదారుల వద్ద ఉండే చిన్న చిన్న ఆల్బమ్(క్యాటలాగ్)లలో మాత్రమే ఇవి కనిపిస్తుంటాయి.

అందానికి ఆరు..

గిరిజన, ఇతర పల్లెల్లో ఉండే ముందుతరం వారు ధరించే ఆభరణాలను పరిశీలిస్తే ఆరు రకాలు కనిపిస్తాయి. వాటిలో చెవి భాగంలో ధరించే నాగులు, కొనకమ్ములు, ముక్కుకు ధరించే కమ్ములు, మెడలో ధరించే పుటకల పేట, మామిడి పిందెల పేట, అడ్డికలను ఎక్కువ మంది ధరిస్తున్నారు. వీటినే నాటి తరం వారు అధికంగా తయారు చేయించుకుంటున్నారు. ఈ ఆభరణాల తయారీకి మేలిమి బంగారం అంటే 24 క్యారెట్ల బంగారంతో మాత్రమే వినియోగిస్తారని చెబుతున్నారు స్వర్ణకారులు.

అతుకు లేకుండా.. అందంగా..

- ఈ ఆభరణాలు అతుకులేకుండా తయారు చేయడంలో ప్రతిభ చూపుతారు స్వర్ణకారులు.
- ఈ ఆభరణాల తయారీకి తరుగు అనేది ఉండదు.
- తయారీకి మాత్రం స్వర్ణకారులు రోజుకూలీని చార్జీ చేస్తారు.
- సుమారు రూ.800 నుంచి వెయ్యి వరకు మజూరీగా తీసుకుంటారు.
- ఆభరణాన్ని గిరిజనులు, గ్రామీణ మహిళలు దగ్గరుండే తయారు చేయించుకుంటారు.



చూసేందుకు మనం చేతికి ధరించే బ్రాస్‌లెట్ మాదిరిగా ఉంటుంది. దీన్ని అడ్డిక అని పిలుస్తారు. దీని తయారీకి కనీసం 46 గ్రాముల బంగారం అవసరం. దీన్ని మెడలో ధరించడం నాటితరం వారి సంప్రదాయం.

కొన్ని గంటల వ్యవధిలో సిద్ధం చేసి ఇస్తారు స్వర్ణకారులు.

పురాతన పనిముట్లతో..



నాటితరం మహిళలు ధరించే ఆరు రకాల ఆభరణాలు తయారు చేసేందుకు పురాతన పనిముట్లనే వినియోగించాల్సి ఉంటుంది. మేలిమి బంగారంతో చేసే ఈ ఆభరణాలకు అతుకులుండవు. ప్రస్తుతం జనం వాడుతున్న ఆభరణాలతో పోలిస్తే వీటిని తయారు చేయడం కొంచెం కష్టమే. కొద్ది మంది మాత్రమే వీటిని తయారు చేస్తున్నారు.

– మహేష్ కడియం, ఆభరణాల తయారీదారు

శరీరంలో భాగంగా..



మేము ధరించే సంప్రదాయ ఆభరణాలు మా శరీరంలో భాగంగా చూసుకుంటాం. విరిగితే తప్ప వాటి జోలికి వెళ్లం.

– సవర రాజమణి, సాబకోట, మందస

గంటల వ్యవధిలో తయారీ..



మేం ధరించే ఆభరణాలు కేవలం కొద్ది గంటల వ్యవధిలో తయారు చేసి మాకు అందజేస్తారు. ఉదయం వెళితే సాయంత్రానికి సిద్ధం చేసి ఇస్తారు. తరుగు ఉండదు. నేను చాలా ఏళ్ల క్రితం ఆభరణాలు తయారు చేయించుకున్నా.

–సవర సరోజిని, సాబకోట, మందస

24 క్యారెట్ల బంగారం అంటే..

- 100 శాతం స్వచ్ఛత కలిగిన బిస్కెట్ బంగారాన్ని 24 క్యారెట్ల బంగారంగా పిలుస్తారు.
- 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంలో 8శాతం రాగి కలిపితే దాన్ని 22 క్యారెట్ల బంగారంగా వ్యవహరిస్తారు. అలాగే 916 అని కూడా పిలుస్తారు.

22 క్యారెట్ల బంగారం దేనికి..

మనం నిత్యం ధరించే గొలుసులు, ఉంగరాలు, హారాలు, ఇతర ఆభరణాలు 22 క్యారెట్ల బంగారంతో తయారు చేస్తారు. 24 క్యారెట్ల బంగారంతో మనం ధరించే వస్తువులు తయారు కావు. ఎందుకంటే మనం ధరించే నగల్ని అతకాల్సి ఉంటుంది. అందులో రంగురాళ్లు, ఇతర అలంకరణ సామగ్రి అమర్చాల్సి ఉంటుంది. అందుకే 22 క్యారెట్ల బంగారం వినియోగిస్తామని తయారీ దారులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

రేప్ కేసులో ఆశారాం దోషే
తేల్చిన కోర్టు, నేడు శిక్ష ఖరారు

గాంధీనగర్: 2013 నాటి రేప్ కేసులో వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపును దోషిగా గుజరాత్‌లోని ఓ న్యాయస్థానం సోమవారం తేల్చింది. ఆయనకు శిక్షను సెషన్స్ కోర్టు జడ్జి డీకే సోని మంగళవారం ప్రకటించనున్నారు. సాక్ష్యాధారాల్లేక ఆశారాం భార్య సహా ఆరుగురికి కేసు నుంచి విముక్తి కల్పించారు. అహ్మదాబాద్ శివారులో తన ఆశ్రమంలో ఉంటున్న శిష్యురాలిపై 2001–2006 మధ్య ఆశారాం పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు 2013లో కేసు నమోదైంది. మరో రేప్ కేసులో ఆయన జోధ్‌పూర్ జైలులో ఉన్నారు.

చావనైనా చస్తా గానీ... బీజేపీతో కలవను: నితీశ్

పట్నా: చావనైనా చస్తా గానీ బీజేపీతో మళ్లీ జట్టుకట్టేది లేదని జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ తెగేసి చెప్పారు. పట్నాలో సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. 2013, 2017ల్లో కాషాయ పార్టీతో కూటమిగా ఏర్పడి తప్పిదం చేశానన్నారు. 'ఆర్జేడీ చీఫ్ లాలూ యాదవ్‌పై కేంద్రం అనేక కేసులు బనాయించింది. ఫలితం లేకపోవడంతో చేతులు కలపాలంటూ నాపైనా బీజేపీ ఒత్తిడి తెచ్చింది. ఇప్పుడూ ఆర్జేడీ నేతలను కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నిస్తోంది' అని ఆరోపించారు.

మోదీ–బీబీసీ పిల్స్‌పై... వచ్చే వారం విచారణ

న్యూఢిల్లీ: గోధ్రా అల్లర్లకు నాటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీనే బాధ్యుడన్న బీబీసీ డాక్యుమెంటరీని నిషేధించడంపై దాఖలైన వ్యాజ్యాలపై ఫిబ్రవరి 6న సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. లాయర్ ప్రశాంత్ భూషణ్, మాజీ జర్నలిస్ట్ ఎన్ రామ్ తరఫున దాఖలైన పిల్స్ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలా ధర్మాసనం ముందుకొచ్చాయి.

9 లక్షలకు పైగా ప్రభుత్వ వాహనాలు... ఏప్రిల్ 1 నుంచి తుక్కే

న్యూఢిల్లీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్టీసీలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో 15 ఏళ్లు దాటిన 9 లక్షలకు పైగా కార్లు, బస్సులు తదితర వాహనాలను ఏప్రిల్ 1 నుంచి రోడ్డెక్కబోవు. రిజిస్ట్రేషన్ రద్దు చేసి వాటన్నింటినీ తుక్కు కింద మార్చేస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి చెప్పారు. వాటిని పర్యావరణహిత ప్రత్యామ్నాయ ఇంధనాలతో కూడిన కొత్త వాహనాలను భర్తీ చేస్తామన్నారు. అయితే రక్షణ, సైనిక వాహనాలు, ప్రత్యేక వాహనాలు తదితరాలకు ఇది వర్తించబోదన్నారు.

మేఘాలయలో ముక్కోణం

కదన రంగంలో ఎన్‌పీపీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ • పాత ప్రత్యర్థులు కాన్రాడ్, ముకుల్ సంగ్మా మధ్య హోరాహోరీ



ఈశాన్య భారత్‌లో గిరిజన ప్రాబల్యం కలిగిన మేఘాలయాలో శాసనసభ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. 60 అసెంబ్లీ స్థానాలున్న మేఘాలయలో ఫిబ్రవరి 27న ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం మార్చి 2న ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. రాష్ట్రంలో పాత ప్రత్యర్థులైన కాన్రాడ్ సంగ్మా, ముకుల్ సంగ్మా మళ్లీ హోరాహోరీగా తలపడుతున్నారు. 2018 నాటి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నేతృత్వం వహించి, 21 స్థానాల్లో పార్టీని గెలిపించిన మాజీ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా ఈసారి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) నుంచి బరిలోకి దిగుతుండడం ఆసక్తి కలిగిస్తోంది. కిందటిసారి పోటీలో లేని తృణమూల్ కాంగ్రెస్ ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతుండడం విశేషం. 2018లో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించి, అధికార పీఠానికి దగ్గరగా వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో సిట్టింగ్ అభ్యర్థులంటూ ఎవరూ లేకపోవడం గమనార్హం. ఎన్నికల్లో ఎన్‌పీపీకి కాన్రాడ్ సంగ్మా, తృణమూల్ కాంగ్రెస్‌కు ముకుల్ సంగ్మా, కాంగ్రెస్‌కు విన్సెంట్ పాలా, బీజేపీకి ఎర్నెస్ట్ మారీ నాయకత్వం వహిస్తున్నారు. ప్రధానంగా ఎన్‌పీపీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోరు సాగుతోంది. అంతర్గత లుకలుకలతో అధికార మేఘాలయ ప్రజాస్వామ్య కూటమి(ఎండీఏ) కూటమి విచ్ఛిన్నమైంది. కూటమిలోని నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ), భారతీయ జనతా పార్టీ(బీజేపీ), యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ), హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(హెచ్‌ఎస్‌పీడీపీ), పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) ఒంటరిగానే పోటీ చేస్తున్నాయి. ఎండీఏలో అతిపెద్ద పార్టీ అయిన నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) నేత, ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా మరోసారి కుర్చీ దక్కించుకోవడమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఒకవేళ ఆ పార్టీ గెలిస్తే మేఘాలయలో 2013 తర్వాత వరుసగా రెండోసారి అధికారం దక్కించుకున్న తొలి పార్టీగా ఎన్‌పీపీ రికార్డుకెక్కుంది.

18 మంది రాజీనామా

2018లో కేవలం 20 సీట్లు గెలుచుకున్న ఎన్‌పీపీ.. యూడీపీ(6 సీట్లు), హెచ్‌ఎస్‌పీడీపీ(2 సీట్లు), పీడీఎఫ్(4 సీట్లు), బీజేపీ(2 సీట్ల)తోపాటు ఒక స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తర్వాత ఎమ్మెల్యేల గోడదూకుళ్లు తదితరాలతో బలాబలాలు మారుతూ వచ్చాయి. 2021 నవంబర్‌లో ముకుల్ సంగ్మా నేతృత్వంలో 12 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి, తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. మిగిలిన 9 మంది ఎమ్మెల్యేలు సైతం పార్టీ నుంచి బయటకు వచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఎమ్మెల్యేలు లేకుండాపోయారు. ఇటీవలే 18 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు, సొంత పార్టీలకు రాజీనామా చేశారు. టిక్కెట్లపై హామీ ఇచ్చే పార్టీలో చేరి పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తృణమూల్‌లో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలూ వీరిలో ఉన్నారు. గిరిజన రాష్ట్రమైన మేఘాలయకు ప్రత్యేక హోదా ఉంది. దాంతో రాష్ట్రంలో ఖర్చు చేసే నిధుల్లో 90 శాతానికిపైగా నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచే వస్తుంటాయి. సాధారణంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఇక్కడి రాజకీయాలను చాలావరకు ప్రభావితం చేస్తూ ఉంటుంది. చిన్నాచితక పార్టీలు ఏదో ఒక నినాదంతో ఎన్నికల్లో పోటీ చేయడం, ఒకటో రెండో స్థానాలు గెలుచుకొని, ఫలితాల అనంతరం నెంబర్ గేమ్‌లో వీలైనంత మేరకు లబ్ధి పొందడం పరిపాటిగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

చేరికలు, రాజీనామాల తర్వాత అసెంబ్లీలో పార్టీల ప్రస్తుత బలం

పార్టీ	సీట్లు
నేషనల్ పీపుల్స్ పార్టీ	20
తృణమూల్ కాంగ్రెస్ పార్టీ	8
యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ	8
పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్	2
బీజేపీ	3
ఇతరులు	1
ఖాళీలు	18
మొత్తం	60

మళ్లీ మాదే అధికారం: ఎన్‌పీపీ

మిత్రపక్షంగా ఉన్న బీజేపీ రాష్ట్రంలో అభివృద్ధి పనులకు ఆటంకాలు సృష్టించిందని, అందుకే ఆ పార్టీతో తెగతెంపులు చేసుకున్నామని ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా తేల్చిచెప్పారు. ప్రభుత్వ వ్యతిరేకత ఏమాత్రం లేదని, తాము మళ్లీ నెగ్గడం ఖాయమని ఎన్‌పీపీ రాష్ట్ర అధ్యక్షుడు డబ్ల్యూ.ఖార్‌లుఖీ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

ప్రభావితం చేసే అంశాలేమిటి?

ప్రభుత్వ వ్యతిరేకత: కాన్రాడ్ సంగ్మా సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోవడం, విచ్చలవిడిగా అవినీతి జరుగుతుండడం, నిధుల లేమితో ఆరోగ్య రంగం కునారిల్లుతుండడం ప్రభుత్వానికి ప్రతికూలంగా మారింది.

సరిహద్దు రగడ: మేఘాలయ–అస్సాం నడుమ సరిహద్దు వివాదం రగులుతోంది. రెండు రాష్ట్రాల్లో సరిహద్దులో ఉన్న పలు తెగల మధ్య హింసాకాండ చోటుచేసుకుంది. పరస్పరం దాడులు చేసుకున్నారు. సరిహద్దు సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని జనం ఆరోపిస్తున్నారు.

కూటమి విచ్ఛిన్నం: అధికార మేఘాలయ ప్రజాస్వామ్య కూటమి(ఎండీఏ) కూటమి విచ్ఛిన్నమై, పార్టీలు సొంతంగా పోటీ చేస్తుండడం ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాకు నష్టం చేకూరుస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




మహాత్మునికి రాష్ట్రపతి, ప్రధాని నివాళులు

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ 75వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి మోదీ సోమవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని మహాత్ముని సమాధి రాజ్‌ఘాట్ వద్ద పుష్పగుచ్ఛాలుంచారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. గన్ సెల్యూట్, సర్వమత ప్రార్థనలు, గాంధీకి ఇష్టమైన గేయాలాపన జరిగాయి. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు నివాళులర్పించారు. 'బాపుకు నా నివాళులు. దేశ సేవలో ప్రాణాలర్పించిన ఎందరో అమరుల త్యాగాలు దేశం కోసం పనిచేయాలనే సంకల్పాన్ని మరింత పెంచుతాయి' అని మోదీ ట్వీట్ చేశారు.

ప్రధాని మోదీతో కొరోసీ భేటీ

ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ (యూఎన్‌జీఏ) అధ్యక్షుడు సాబా కొరోసీ మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్‌తో భేటీ అయ్యారు. పలు అంతర్జాతీయ సవాళ్లపై చర్చలు జరిపారు. జల సంరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం ఆవశ్యకత కూడా ప్రస్తావనకు వచ్చినట్లు అనంతరం మోదీ ట్వీట్ చేశారు. ఉక్రెయిన్ సంక్షోభం, జీ20 ఎజెండాతోపాటు ఐరాస సంస్కరణలపై చర్చించినట్లు జై శంకర్ పేర్కొన్నారు. పలు అంశాలపై వారి అవగాహన, స్పందన అద్భుతమని కొరోసీ కొనియాడారు. భారత్‌తోపాటు పలు దేశాలు సీమాంతర ఉగ్రవాదంతో బాధ పడుతున్న విషయం తనకు తెలుసునన్నారు.

క్షిపణి దాడికి ఒక్క నిమిషం చాలు

నాటి బ్రిటన్ ప్రధాని బోరిస్‌కు పుతిన్ వార్నింగ్


పుతిన్


బోరిస్ జాన్సన్

లండన్: ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగిన రష్యాను ఎలాగైనా నిలువరించేందుకు ప్రయత్నించిన బ్రిటన్ మాజీ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్‌ను పుతిన్ బెదిరించారా ? అంటే అవునని సమాధానం చెబుతోంది బీబీసీ డాక్యుమెంటరీ. ఉక్రెయిన్–రష్యా యుద్ధం తొలినాళ్లలో పుతిన్‌కు, బోరిస్‌కు మధ్య జరిగిన ఫోన్‌కాల్ సంభాషణలు, పశ్చిమ దేశాలతో పుతిన్ నేతృత్వంలోని రష్యా వైఖరిని వెల్లడిస్తూ బీబీబీ 'పుతిన్ వర్సెస్ ది వెస్ట్' పేరిట ఒక డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. బీబీసీతో బోరిస్, బ్రిటన్ రక్షణ మంత్రి, పలువురు తెలిపిన వివరాలతో రూపొందిన ఈ డాక్యుమెంటరీ సోమవారం ప్రసారమైంది. డాక్యుమెంటరీ వెల్లడించిన విషయాల్లో కొన్ని..

- యుద్ధం మొదట్లోనే అంటే గత ఏడాది ఫిబ్రవరిలో పుతిన్‌కు బోరిస్ ఫోన్‌చేశారు. ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు స్వస్తి పలకాలని హితవు పలికారు. దానికి ససేమిరా ఒప్పుకోని పుతిన్ ఏకంగా బోరిస్‌ను బెదిరించారు!. 'బోరిస్.. మిమ్మల్ని బాధపెట్టడం నా ఉద్దేశం కాదుగానీ క్షిపణితో(అలాంటి) దాడి చేసేందుకు ఒక్క నిమిషం చాలు నాకు. ఇది త్వరలో వర్తమానప్రపంచంలో దారుణ విపత్తుగా పరిణమించబోతోంది' అని అన్నారు.
- బోరిస్ సంయమనం కోల్పోకుండా చర్చలకు ప్రాధాన్యమిస్తూనే దీటుగా బదులిచ్చారు.
- 'వెనక్కి వెళ్లకపోతే రష్యాపై పశ్చిమ దేశాలు అత్యంత కఠిన ఆంక్షలు విధిస్తాయి. నాటో సేనలు రష్యా సరిహద్దులను చుట్టుముడతాయి. సరైన భవిష్యత్తు లేనపుడు ఉక్రెయిన్ నాటోలో చేరబోదు' అని అన్నారు.
- బ్రిటన్ రక్షణ మంత్రి బెన్ వాలేస్ కూడా మాస్కోకు వెళ్లి నచ్చజెప్పే ప్రయత్నంచేశారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం రాబోతోందని ఆనాడే అంచనావేశారు.
- పుతిన్, బోరిస్ తాలూకు ఈ ఫోన్‌కాల్ వివరాలను బ్రిటన్ ప్రధాని కార్యాలయం, రష్యా అధికారికంగా ఎప్పుడూ వెల్లడించకపోవడం గమనార్హం.



రామశిల వచ్చేస్తోంది

అయోధ్యలో రామాలయంలో సీతారాముల విగ్రహాల తయారీ కోసం తీసుకొస్తున్న సాలిగ్రామ శిలలివి. వీటిని నేపాల్‌లో సీత జన్మస్థలంగా భావించే జనక్‌పూర్ నుంచి తీసుకొస్తుండటం విశేషం!

నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: వాడీవేడీ చర్చలకు వేదికగా నిలిచే పార్లమెంట్‌లో బడ్జెట్ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉభయ సభలనుద్దేశించి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. రాష్ట్రపతిగా ఉభయసభలనుద్దేశిస్తూ ఆమె చేస్తున్న తొలి ప్రసంగం ఇది. ఆ తర్వాత సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. బుధవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2023–24 ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఫిబ్రవరి 2న రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. రాజ్యసభ, లోక్‌సభలో దీనిపై ప్రధాని మోదీ సమాధానం ఇవ్వనున్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని పాత పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లోనే నిర్వహిస్తామని లోక్‌సభ స్పీకర్ బిర్లా గతంలో ప్రకటించారు. ఈసారి సమావేశాలు రెండు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత ఫిబ్రవరి 14 వరకు, ఆ తర్వాతి విడత మార్చి 12న మొదలై ఏప్రిల్ ఆరో తేదీన పూర్తికానుంది.

ప్రధాన సమస్యలపై నిలదీత!

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం ఓ వైపు సన్నాహాలు చేస్తుండగా, మరోవైపు కేంద్రాన్ని నిలదీసేందుకు విపక్షాలు కత్తులు నూరుతున్నాయి. పెరిగిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, తాజా ఆర్థిక పరిస్థితి, సన్నగిల్లిన కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, పెరిగిన చైనా సరిహద్దు వివాదం, బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల్లో గవర్నర్ల జోక్యం, గౌతమ్ అదానీ షేర్లపై హిండెన్‌బర్గ్ సంచలనాత్మక నివేదిక, జాతీయస్థాయి కుల గణన, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని కడిగి పారేయాలని విపక్షాలు నిర్ణయించాయి. రాష్ట్రపతి ప్రసంగాన్ని కొన్ని పార్టీలు 'బాయ్‌కాట్' చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. బీఆర్ఎస్, ఆప్ ఇప్పటికే ఈ మేరకు నిర్ణయించాయి. గవర్నర్ వ్యవస్థపై బీఆర్ఎస్ సహా డీఎంకే, టీఎంసీ గట్టిగా పోరాడాలని నిర్ణయించుకోగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలపై సీపీఐ, సీపీఎం ప్రభుత్వాన్ని నిలదీయనున్నాయి. చైనా సరిహద్దు వివాదాలు, రూపాయి పతనం, బడా కార్పొరేట్ కంపెనీల దోపిడీపై కాంగ్రెస్ పార్టీ మోదీ సర్కార్‌ను ఇరకాటంలో పెట్టేలా వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. బడ్జెట్ సమావేశాలపై కేంద్రం సోమవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆర్జేడీ, జేడీయూ, బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, డీఎంకే, టీఎంసీ, బీజేడీ తదితర 27 పార్టీలు హాజరవగా కాంగ్రెస్ దూరంగా ఉంది.

పాక్ మసీదులో తాలిబన్ ఆత్మాహుతి దాడి...

61 మంది దుర్మరణం



పెషావర్: పాకిస్తాన్‌లో తాలిబన్లు దారుణ దాడికి తెగబడ్డారు. సోమవారం పెషావర్‌లో మధ్యాహ్నం ప్రార్థనాల కోసం మసీదుకు చేరుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని తాలిబన్ ఆత్మాహుతి బాంబర్ జరిపిన దాడిలో ఏకంగా 61 మంది ప్రాణాలు కోల్పోయారు. 157 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో పోలీసులు, భద్రత, ఆరోగ్య సిబ్బంది ఎక్కువగా ఉన్నారు. దాడి జరిగిన మసీదు నగరంలోని పోలీస్ లైన్స్ ప్రాంత పోలీస్ ఆఫీస్ సమీపంలో ఉంది. దాంతో ఈ మసీదులో మధ్యాహ్నం ప్రార్థనల్లో ఎక్కువ మంది పోలీసు, ఆర్మీ, బాంబ్ నిర్వీర్య దళాల సభ్యులు పాల్గొన్నారు. అఫ్గాన్‌లో గత ఏడాది ఆగస్టులో తెహ్రీక్ ఈ తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ) కమాండర్ ఉమర్ ఖలీద్ ఖురసానీని చంపినందుకు ప్రతీకారంగా పెషావర్ పేలుడు జరిపామని ఖలీద్ సోదరుడు ప్రకటించారు. పేలుడు ధాటికి మసీదు కొంత నేలకూలింది. ఈ శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండొచ్చని ఒక పోలీసు అధికారి చెప్పారు. ఎస్పీ ఆఫీస్ పక్కనే ఉన్న ఈ మసీదుకు భద్రత ఎక్కువ. మసీదులో నాలుగు అంచెల భద్రత వలయం దాటుకుని మరీ ఆత్మాహుతి బాంబర్ లోపలికొచ్చి దాడి చేయడం గమనార్హం. దాడి సమయానికి ఆ మసీదు లోపల, బయట కలిపి మొత్తంగా 300–400 మంది పోలీసులు ఉండొచ్చని పెషావర్ సిటీ పోలీస్ ఆఫీసర్ ముహమ్మద్ ఇజాజ్ ఖాన్ చెప్పారు. దాడి ఘటనను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు.

మెక్సికోలో కాల్పులు.. 8 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. జెరెజ్ టౌన్‌లోని ఓ నైట్‌క్లబ్‌లో సాయుధ దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. దీంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దుండగులు పెద్ద సంఖ్యలో ఆయుధాలతో రెండు వాహనాల్లో ఎల్‌వానాడిటో నైట్‌క్లబ్‌కు చేరుకొని, అక్కడున్న జనంపై కాల్పులు జరిపారని పోలీసులు వెల్లడించారు. ఈ కాల్పుల్లో ఆరుగురు అక్కడికక్కడే మరణించారని, ఆసుపత్రి చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారని పేర్కొన్నారు. మృతులు, క్షతగాత్రుల్లో క్లబ్ ఉద్యోగులు, సంగీత కళాకారులు, వినియోగదారులు ఉన్నారని తెలిపారు.

దక్షిణాఫ్రికాలోనూ...

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలోని జిక్వెబెర్హా(పోర్ట్ ఎలిజబెత్)లో ఆదివారం బర్త్‌డే పార్టీలో జరిగిన కాల్పుల్లో 8 మంది చనిపోగా మరో ముగ్గురు గాయపడ్డారు. క్వాజఖెలె టౌన్‌షిప్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో సాయంత్రం 5 గంటల సమయంలో బర్త్‌డే వేడుక జరుపుకుంటున్నారు. ఇద్దరు వ్యక్తులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి పరారయ్యారు. ఇంటి యజమాని సహా 8 మంది ప్రాణాలు కోల్పోగా ముగ్గురు గాయాలపాలయ్యారు. నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు పోలీస్ విభాగం ప్రతినిధి ప్రిసిల్లా నాయుడు చెప్పారు. ఇంటి యజమానితో దుండగులకు వైరం ఉందా? లేక మరేదైనా కారణమా? దర్యాప్తులో తేలనుందని ఆమె అన్నారు.

రష్యా దాడుల్లో ఐదుగురు మృతి

కీవ్: రష్యా దాడుల్లో గత 24 గంటల్లో ఐదుగురు చనిపోగా, మరో 13 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు సోమవారం తెలిపారు. ఉక్రెయిన్‌లోని రెండో అతిపెద్ద నగరం ఖర్కీవ్‌తోపాటు ఖెర్సన్‌పైనా రష్యా భారీగా కాల్పులు సాగిస్తోందన్నారు. దాడుల్లో ఖెర్సన్ పోర్టులోని రెండు విదేశీ పడవలు దెబ్బతిన్నట్లు తెలిపిన అధికారులు, అంతకుమించి వివరాలను వెల్లడించలేదు. డొనెట్స్క్ ప్రాంతంలోనూ భీకర పోరు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ సామర్థ్యాన్ని పెంచేందుకు గల ప్రతి అవకాశాన్నీ నాటో సభ్య దేశాలు పరిశీలిస్తున్నాయని పోలండ్ ప్రధాని మాటీజ్ మొరావికీ సోమవారం చెప్పారు.

హింసను ప్రేరేపిస్తున్నారు

జోడో యాత్ర ముగింపు సభలో మోదీ, అమిత్ షాలపై రాహుల్ ధ్వజం


సభలో రాహుల్, ప్రియాంక, ఖర్గే, మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా తదితరులు

శ్రీనగర్: ''దేశంలో స్వేచ్ఛాయుత, లౌకిక విలువలపై ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ, ఆరెస్సెస్ నిత్యం దాడి చేస్తున్నాయి. వాటికి పాతర వేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందుకోసం నిరంతరం హింసను ప్రేరేపిస్తున్నాయి''అంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఆ విలువల పరిరక్షణకే భారత్ జోడో యాత్ర చేపట్టినట్టు పునరుద్ఘాటించారు. జోడో యాత్ర సోమవారం జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో లాంఛనంగా ముగిసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ, షేర్ ఏ కశ్మీర్ క్రికెట్ స్టేడియంలో సభ నిర్వహించింది. 9 విపక్ష పార్టీల నేతలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. హింస ఎంతటి బాధాకరమో మోదీ లాంటివారికి ఎన్నటికీ అర్థం కాదంటూ ఈ సందర్భంగా రాహుల్ ఆక్షేపించారు. తన నానమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీల హత్యోదంతాలను గుర్తు చేసుకున్నారు. ''వారిక లేరని ఫోన్ కాల్స్ ద్వారానే తెలుసుకున్నా. ఆ దుర్వార్తలు విని విలవిల్లాడిపోయా. అలాంటి ఫోన్ కాల్స్ అందుకోవాల్సి రావడంలో ఉండే అంతులేని బాధను, నొప్పిని కశ్మీరీలు అర్థం చేసుకోగలరు. పుల్వామా వంటి ఉగ్ర దాడులకు బలైన ఆర్మీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది కుటుంబాలు అర్థం చేసుకోగలవు. నేను, నా చెల్లెలు అర్థం చేసుకోగలం. అంతేగానీ మతిలేని హింసను ప్రేరేపించే మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్ వంటివాళ్లు ఎన్నటికీ అర్థం చేసుకోలేరు'' అంటూ తీవ్ర విమర్శలు చేశారు.

కశ్మీర్లో నడవాలంటే వారికి భయం

బీజేపీ అగ్ర నేతలకు దమ్ముంటే తనలా జమ్మూ కశ్మీర్లో పాదయాత్ర చేయాలని రాహుల్ సవాలు విసిరారు. ''అది వారి తరం కాదు. చేయలేరు. ఒక్కరు కూడా జమ్మూ కశ్మీర్లో నాలా నడవలేరు. ఎందుకంటే వారికి అంతులేని భయం'' అంటూ ఎద్దేవా చేశారు. ''కశ్మీర్లో పాదయాత్ర వద్దని నాకు సలహాలొచ్చాయి. బులెట్ ప్రూఫ్ కార్లో చేయాలని స్థానిక యంత్రాంగమూ సూచించింది. నడిస్తే నాపై ఏ గ్రెనేడో వచ్చి పడొచ్చని హెచ్చరించింది. బహుశా నన్ను భయపెట్టడం వారి ఉద్దేశం కావచ్చు. కానీ నేను భయపడలేదు. నన్ను ద్వేషించేవారికి నా తెల్ల టీ షర్టు రంగు (ఎర్రగా) మార్చే అవకాశం ఎందుకివ్వకూడదని ఆలోచించా. ఈ రాష్ట్రం నా సొంతిల్లు. కశ్మీరీలు నావాళ్లు. వాళ్లతో కలిసి నడిచి తీరాలని నిర్ణయించుకున్నా. కశ్మీరీలు నాపై గ్రెనేడ్లు విసరలేదు. హృదయపూర్వకంగా అక్కున చేర్చుకున్నారు. అంతులేని ప్రేమతో ముంచెత్తారు. చిన్నా పెద్దా తేడా లేకుండా మనస్ఫూర్తిగా స్వాగతించి నన్ను తమవాణ్ని చేసుకున్నారు'' అంటూ ప్రశంసించారు. ''నాకు లేనిదీ, బీజేపీ నేతలకున్నదీ భయమే. నిర్భయంగా జీవించడాన్ని మహాత్మా గాంధీ నుంచి, నా కుటుంబం నుంచి నేర్చుకున్నా'' అన్నారు. సభలో డీఎంకే, జార్ఖండ్ ముక్తి మోర్చా, బహుజన్ సమాజ్ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, సీపీఐ, ఆర్ఎస్పీ, వీసీకే, ఐయూఎంఎల్ నేతలు మాట్లాడారు. తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ, జేడీ(యూ) తదితర పక్షాలు గైర్హాజరయ్యాయి.

కశ్మీర్ నా సొంతిల్లు

కశ్మీర్ తన సొంతిల్లని రాహుల్ పదేపదే గుర్తు చేసుకున్నారు. ''రాష్ట్రంలో నడుస్తుంటే అప్పుడెప్పుడో సరిగ్గా ఇవే దారుల గుండా నా పూర్వీకులు కశ్మీర్ నుంచి అలహాబాద్ వెళ్లారన్న ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. నేను నా ఇంటికి తిరిగొస్తున్నట్టు ఫీలయ్యా. ఎందుకంటే నాకంటూ ఓ ఇల్లు లేదు. చిన్నతనం నుంచీ ప్రభుత్వ ఆవాసాల్లోనే బతికాను. వాటిని నా ఇల్లని ఎప్పుడూ అనుకోలేకపోయాను. నా వరకూ ఇల్లంటే ఓ ఆలోచన. జీవన విధానం. కశ్మీరియత్ శివుని ఆలోచనా ధార. శూన్యత్వం. అహంపై పోరాడి గెలవడం. ఇది నన్నెంతో ఆకట్టుకుంది. దీన్నే ఇస్లాంలోనూ ఫనా అన్నారు. అస్సాం, కర్నాటక, మహారాష్ట్ర... అన్ని రాష్ట్రాల్లోనూ ఈ భావధార ఉంది. దీన్నే గాంధీ వైష్ణో జనతో అన్నారు. నా పూర్వీకులు ఇక్కణ్నుంచి వెళ్లి అలహాబాద్‌లో గంగా తీరాన స్థిరపడి కశ్మీరియత్‌ను యూపీలో ప్రచారం చేశారు. అదే గంగా యమునా పవిత్ర సంగమం'' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. 'నా ఇంటికి వెళ్తున్నట్టు అన్పిస్తోంది' అంటూ జమ్మూ కశ్మీర్లోకి ప్రవేశించే ముందు తల్లి సోనియాకు, తనకు రాహుల్ మెసేజ్ చేశారని ప్రియాంక చెప్పుకొచ్చారు.



సోదరితో సరదాగా...

రాజకీయాలు, ప్రసంగాలు, విమర్శల నడుమ రాహుల్ కాసేపు సోదరి ప్రియాంకతో సరదాగా స్నోబాల్ ఫైట్ చేస్తూ సేదదీరారు. ఒక వీడియోలో రాహుల్ రెండు మంచు ముక్కలను వెనక దాచుకుని ప్రియాంకను సమీపించి ఆమె తలపై కొట్టి ఆట పట్టించారు. ఆమె కూడా ఆయన వెంట పడి తలంతా మంచుతో నింపేశారు. తర్వాత జోడో యాత్ర క్యాంప్ సైట్ వద్ద, అనంతరం పీసీసీ కార్యాలయంలోనూ రాహుల్ జాతీయ జెండా ఎగురవేశారు. యాత్రలో తనతో పాటు కలిసి నడిచిన భారత యాత్రీలకు కృతజ్ఞతలు తెలిపారు. వణికించే చలిలోనూ ఇన్ని రోజులుగా కేవలం తెల్ల టీ షర్టుతోనే యాత్ర చేసిన రాహుల్ ఎట్టకేలకు సోమవారం జాకెట్ ధరించారు. తర్వాత పొడవాటి సంప్రదాయ బూడిద రంగు కశ్మీరీ ఫేరన్ ధరించి ర్యాలీలో, సభలో పాల్గొన్నారు.

ఎవరేమన్నారంటే...

భారత్ జోడో యాత్ర ఎన్నికల్లో గెలుపు కోసం కాదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై దేశ ప్రజలనందరినీ ఒక్కటి చేయగలనని రాహుల్ పాదయాత్రతో నిరూపించారు.
– మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

బ్రిటిష్ పాలనపై ఐక్యంగా పోరాడి స్వాతంత్ర్యం సాధించుకున్నాం. అలాగే బీజేపీ పాలనపైనా పోరుకు లౌకిక శక్తులన్నీ కలిసి రావాలి.
– డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

శాంతి, సౌభ్రాతృత్వాలు కోరుకునే వారికి దేశంలో కొదవ లేదని జోడో యాత్ర నిరూపించింది. దక్షిణం నుంచి ఉత్తరానికి చేసినట్టుగానే దేశ పశ్చిమ కొస నుంచి తూర్పుకు కూడా రాహుల్ పాదయాత్ర చేయాలి. నేను ఆయన వెంట నడుస్తా.
– ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్

రాహుల్‌గాంధీ రూపంలో దేశానికి ఒక నూతన ఆశా కిరణం దొరికింది.
– మెహబూబా ముఫ్తీ, పీడీపీ అధ్యక్షురాలు

విభజన రాజకీయాలు దేశానికెప్పుడూ హానికరమే. వాటిని వ్యతిరేకిస్తూ నా సోదరుడు చేసిన యాత్రకు జనం వస్తారో లేదోనని అని నేను మొదట్లో అనుకున్నా. కానీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా ఆద్యంతం వారు భారీగా తరలి వచ్చి సంఘీభావంగా నిలిచారు. ఐక్యతా స్ఫూర్తిని చాటారు. దేశమంతా యాత్రకు ఇంతగా మద్దతుగా నిలవడం నిజంగా గర్వకారణం.
– ప్రియాంకా గాంధీ వద్రా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం । 31 । జనవరి । 2023



చిరకాల జ్ఞాపకం
హంపీ ఉత్సవాల్లో పునీత్ రాజ్‌కుమార్ ఇసుక శిల్పం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న బాలికలు

న్యూస్‌రీల్

అహింసామూర్తిపై శాంతి కపోతాలు



సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా అంతటా నివాళులు అర్పించారు. బెంగళూరు విధానసౌధలోని బాపూజీ విగ్రహం మీద కపోతాల సందడి

కేసు పరిష్కారం కాగానే పీఎస్‌ఐ పరీక్షలు : డీజీపీ

బనశంకరి: రాష్ట్రంలో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్షలను భవిష్యత్‌లో పకడ్బందీగా నిర్వహిస్తామని రాష్ట్ర డీజీపీ ప్రవీణ్‌సూద్ ట్వీట్ చేశారు. ఎస్‌ఐ పోస్టుల పరీక్షల్లో మరోసారి అక్రమాలు జరగకుండా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని, కోర్టు ఆదేశాల కోసం వేచి ఉన్నామని, పీఎస్‌ఐ అక్రమాలు కేసు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నియామక ప్రక్రియ చేపట్టరాదని కోర్టు సూచించిందని, దీంతో కేసు పరిష్కారం అయిన తరువాత పీఎస్‌ఐ పరీక్ష నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని డీజీపీ ట్వీట్ చేశారు.

కవి తిరుమలేశ్ కన్నుమూత

యశవంతపుర: కన్నడ కవి, విద్యాంసుడు, విమర్శకుడు, భాషా విజ్ఞాని కేవీ తిరుమలేశ్ (82) సోమవారం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాదులోని కూతురి ఇంటిలో మృతి చెందారు. కేరళ కాసరగోడులోని కారడ్యలో జన్మించిన ఆయన హైదరాబాద్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు.

అప్పులు తీర్చటానికీ చోరీలు

యశవంతపుర: అప్పు తీర్చడానికి చోరీల బాట పట్టిన ఓ ఆటో డ్రైవర్‌ను మల్లేశ్వరం పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ. 1.5 లక్షల నగదు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. రంగస్వామి ఆటో డ్రైవర్. కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. ఆదాయం సరిపోకపోవడంతో చోరీలు చేయడం మొదలు పెట్టాడు. ఈ నెల 24న సాయంత్రం ఇతని ఆటోలో ఓ మహిళ ఎక్కింది. మల్లేశ్వరంలో ఆమె బ్యాగ్‌ను ఆటోలోనే ఉంచి ఆస్పత్రిలోకి వెళ్లింది. ఇదే అదనుగా రంగస్వామి అక్కడి నుంచి ఉడాయించాడు. కొద్ది సేపు తరువాత మహిళ బయటకు వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిఘా ఉంచి రంగస్వామిని అరెస్ట్ చేశారు.

జాతిపితకు ఘన నివాళి



బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మగాంధీకి నివాళులు అర్పించారు. సోమవారం గాంధీ వర్ధంతి సందర్భంగా ఎంజీ.రోడ్డులోని గాంధీజీ విగ్రహానికి బీబీఎంపీ పాలనాధికారి రాకేశ్ సింగ్, కమిషనర్ తుషార్ గిరినాథ్, పాలికె అధికారులు నివాళులు అర్పించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో బీబీఎంపీ వలయ కమిషనర్లు పీఎస్.రవీంద్ర, ప్రత్యేక కమిషనర్లు రెడ్డిశంకర బాబు, ప్రీతిగెహ్లాట్, జాయింట్ కమిషనర్ పల్లవి, మాజీమంత్రి రామచంద్రగౌడ, మాజీ మేయర్లు పద్మావతి గంగాధరగౌడ, గంగాంబికా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వెన్నదొంగకు బంగారు ఛత్రి



యశవంతపుర: ఉడుపి శ్రీకృష్ణుడికి అదమారు మఠం విశ్వప్రియతీర్థస్వామి సోమవారం బంగారు గొడుగును సమర్పించారు. ఉడుపి పర్యాయమఠం ఈశప్రియతీర్థతో కలిసి ఆయన రూ.50 లక్షలు విలువైన 2.5 కేజీల బంగారు గొడుగును నల్లనయ్యకు అందించి మొక్కు తీర్చుకున్నారు.

ఆపరేషన్ చిరుత

- పట్టి బంధించి సంతాన హర శస్త్రచికిత్సలు
- ఆపై పునరావాస కేంద్రాల్లో నిర్బంధం
- గుజరాత్ నమూనా అమలుపై దృష్టి

బనశంకరి: మలెనాడు, బయలుసీమ అటవీ ప్రాంతాల గ్రామాలు, ఊళ్లలోనూ పదేపదే సంచరిస్తున్న చిరుతపులుల హవాకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం తీర్మానించింది. సుమారు 1800 చిరుతలతో కన్నడనాడు దేశంలోనే రెండవ అత్యధిక చిరుతలున్న ప్రాంతంగా పేరుపొందింది. జనావాస ప్రాంతాల్లోకి చొరబడుతున్న చిరుతలను బంధించి పునర్వసతి కేంద్రాలకు తరలించి వాటికి సంతాన రహిత శస్త్రచికిత్సలు చేయాలని, తద్వారా వాటి జనాభా తగ్గి చొరబాట్ల సమస్య అదుపులోకి వస్తుందని అటవీశాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఇలాంటి ప్రయోగం చేస్తున్న గుజరాత్‌కు వెళ్లి అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు ఉన్నత వర్గాల సమాచారం.

నగరాలకూ వ్యాపించిన సంఘర్షణ

రాష్ట్రంలో ఒకప్పుడు అరణ్యప్రాంత గ్రామాలకు పరిమితమైన మానవ-వన్యజీవి సంఘర్షణ నేడు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఏకంగా రాజధాని బెంగళూరులోనూ చొరబడి దాడులు చేస్తుండడంతో శివారు ప్రాంతాల్లో భయం ఏర్పడింది. మైసూరు జిల్లా సహా పలుచోట్ల గత రెండునెలలుగా వన్యజీవులు దాడులతో 11 మంది బలయ్యారు. ప్రధానంగా చిరుతల సమస్య తీవ్ర కలకలం రేపుతోంది. వీటి నియంత్రణకు ప్రభుత్వం గుజరాత్ నమూనాను ఆశ్రయించింది. పట్టుకున్న చిరుతలను అడవుల్లోకి వదిలిపెట్టే బదులు రాష్ట్రంలోని 9 జూలలో పునర్వసతి కేంద్రాల్లో బంధించి ఉంచాలని, అంతేకాకుండా సంతాన హరణ శస్త్రచికిత్స చేయాలనే యోచన ఉంది. ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సీఎం బసవరాజబొమ్మై ఆదేశించారని అటవీశాఖ ఉన్నత వర్గాలు తెలిపాయి.



హాసన్ జిల్లా అరసికెరె వద్ద గతంలో వ్యక్తిపై చిరుత దాడి దృశ్యాలు



రెండు నెలల్లో జంతువుల దాడుల్లో 14 మంది మృత్యువాత

- గత రెండు నెలల్లో ఏనుగు దాడుల్లో 7 మంది, చిరుత- 4, ఎలుగుబంటి- 1, అడవిపందులు- 1, పులి - 1 తో కలిపి మొత్తం 14 మంది మృతిచెందారు.
- గత ఒక ఏడాదిలో మైసూరు జిల్లాల్లో 24, మండ్యలో 17, రామనగరలో 18, తుమకూరులో 14 తో పాటు మైసూరు సర్కిల్‌లో 73 చిరుతలను బంధించారు.
- మైసూరు జిల్లాలో టీ.నరసీపుర వద్ద రెండు రోజుల వ్యవధిలో జనవరి 20, 22 తేదీల్లో చిరుతలు ఇద్దరిని పొట్టనబెట్టుకున్నాయి. ఆ చిరుత మనిషి రక్తానికి అలవాటుపడిందని ప్రజల్లో భయం నెలకొంది. ఒక పులి కూడా యువకున్ని బలిగొంది.
- ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీవ్రమైన చర్యలకు సిద్ధమైంది. అయితే వన్యజీవులను నియంత్రించే అటవీశాఖలో పెద్దసంఖ్యలో అధికారులు, కిందిస్థాయి ఉద్యోగుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో జంతువుల సంచారాన్ని గుర్తించడంలో వైఫల్యం జరుగుతోంది.



గత నెలలో మైసూరు నగర శివార్లలో పట్టుబడిన చిరుతపులి

చిరుతలను గుర్తించడం కష్టం

ఏనుగులు భారీ జంతువులు కాబట్టి అవి అడవులను దాటి వస్తే ప్రజలు, లేదా అటవీ సిబ్బంది సులభంగా పసిగట్టి జాగ్రత్త చర్యలు తీసుకోగలరు. కానీ చిరుతలు, పులుల కదలికలు అంచనాకు చిక్కడం లేదని అటవీశాఖ అధికారులు సీఎం బసవరాజబొమ్మై సమక్షంలో వాపోయారు. బెళగావిలో చిరుత కోసం 41 రోజుల పాటు గాలించినప్పటికీ ఆచూకీ దొరకలేదని తెలిపారు. అలాగే టి.నరిసిపురలోనూ జరుగుతోందని తెలిపారు.



బెళగావిలో క్లబ్ పార్క్‌లో చొరబడిన చిరుత కోసం ఏనుగుతో గాలింపు, అయినా అది చిక్కలేదు

పంచమసాలి 2ఎ రిజర్వేషన్‌పై వాదనలు

శివాజీనగర: పంచమసాలి లింగాయత్ 2ఏ రిజర్వేషన్ విషయమై వెనుకబడిన వర్గాల కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన మధ్యంతర నివేదికను ధర్మాసనానికి అందజేసేందుకు ప్రభుత్వం హైకోర్టును సమయం కోరింది. పంచమసాలి లింగాయత్ ఉప కులానికి కేటగిరి 2ఏ కింద రిజర్వేషన్ కల్పించే విషయమై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ బెంగళూరుకు చెందిన డీ.జీ.రాఘవేంద్ర, ఇత రులు ప్రజా వ్యాజ్యాలు వేశారు. ఈ పిటిషన్‌ను జడ్జిలు ఆలోక్ ఆరాధె, విశ్వజిత్ శెట్టి ధర్మాసనం విచారణ చేపట్టారు. ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ ప్రభులింగ నావదగి వాదనలను వినిపిస్తూ, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను ఫిబ్రవరి 2న సీల్డ్ కవర్‌లో అందజేస్తామని హామీ ఇచ్చారు. ధర్మాసనం తదుపరి విచారణను వాయిదా వేసింది.

డీకేని ఓడించి రాజకీయాలను విరమిస్తా: జార్కిహొళి

యశవంతపుర: డీకే శివకుమార్‌పై వ్యక్తిగతంగా యుద్ధం ప్రారంభించినట్లు బీజేపీ నేత, మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి తెలిపారు. సోమవారం ఆయన బెళగావిలో విలేకరులతో మాట్లాడారు. నేను డీకేశికి భయపడి ఇంటిలో కూర్చోలేదు. సక్రమంగా రాజకీయాలలో కొనసాగుతున్నా అన్నారు. డీకే రాజకీయాలకు యోగ్యమైన వ్యక్తి కాదన్నారు. నేను ఎప్పుడూ వ్యక్తిగతంగా ద్వేషించలేదు, ఎవరిపైనా సీడీని విడుదల చేయలేదు. నాపై సీడీని విడుదల చేయడం ద్వారా ఒక మహిళ జీవితాన్ని డీకే నాశనం చేశాడని ఆరోపించారు. సీడీని విడుదల చేసిన వ్యక్తులను కఠినంగా దండించాలి, ఈ కేసును సీబీఐకి అప్పగించి నిందితులందరినీ శిక్షించాలని కోరారు. తనకు రాజకీయాలు అవసరం లేదని, డీకే శివకుమార్‌ని ఓడించిన తరువాత రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన చెప్పారు. తరువాత గోకాక్ తాలూకా కొణ్ణూరులో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తాను ఎనిమిదోసారి ప్రజలపై నమ్మకం ఉంచి పోటీ చేస్తానని చెప్పారు.



పుష్పవనానికి సెలవు

బెంగళూరు లాల్‌బాగ్‌లో గణతంత్ర దినోత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహించిన ఫల పుష్ప ప్రదర్శన సోమవారంతో సమాప్తమైంది. మళ్లీ ఫ్లవర్ షోను చూడాలంటే ఆగస్టు 15 వరకు ఎదురుచూడాల్సిందే. చివరిరోజు ఓ మోస్తరుగా సందర్శకులు తరలివచ్చారు



మురుగునీరు.. చెరువులకు మంచిదేనా?

- బెంగళూరు నుంచి శివారు ప్రాంతాల పంపిణీకి సన్నాహాలు
- రూ.865 కోట్లతో పథకం

బనశంకరి: ఐటీ నగరంలో చల్లఘట్ట, హెబ్బాల మురుగు కాలువల నుంచి నీటిని కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల్లోని చెరువులకు తరలిస్తుండడంతో అక్కడ భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. బెంగళూరు ఉత్తర, బెంగళూరు దక్షిణ, నెలమంగల, తుమకూరులలో 97 చెరువులకు వృషభావతి రాచకాలువ నుంచి మురుగునీటిని సంస్కరించి పంపాలని ప్రభుత్వం తీర్మానించింది. రూ.865 కోట్ల వ్యయంతో ఈ పథకానికి చిన్ననీటిపారుదల శాఖ, బెంగళూరు నీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ మండలి (బీడబ్ల్యూ ఎస్ఎస్‌బీ) సిద్ధమైంది.

నాయండహళ్లి నుంచి పంపింగ్

నాయండహళ్లి మురుగునీటి సంస్కరణకేంద్రం నుంచి (ఎస్‌టీపీ) 100 ఎంఎల్‌డీల నీటిని చెరువులకు పంపింగ్ చేస్తారు. ఇందు కోసం 84 కిలోమీటర్లు పొడవు పైపులైన్ వేస్తారు. డాబస్‌పేటే పారిశ్రామికవాడ ప్రాంతానికి కూడా నీటినందిస్తారు. 97 చెరువుల్లో 50 చెరువులు నెలమంగల తాలూకాలో, 34 తుమకూరు తాలూకాలో, 10 చెరువులు బెంగళూరు ఉత్తరలో, 3 బెంగళూరు దక్షిణ తాలూకాలో ఉన్నాయి.

కోలారు, చిక్క జిల్లాలో భూగర్భ జలం వృద్ధి

హెబ్బాళ-నాగావర కాలువ నుంచి డ్రైనేజీ నీటిని చెరువులకు నింపడంతో కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయని అధికారులు తెలిపారు. గతంలో కోలారు, చిక్కబళ్లాపుర ప్రాంతాల్లో భూగర్భ జలాలు 1000 అడుగులకు పడిపోయాయి. ఇప్పుడు 450 అడుగులకు వచ్చాయన్నారు. ప్రస్తుతం బెంగళూరు గ్రామాంతర, తుమకూరు జిల్లాల్లో ఇదే విధంగా మార్పులు తీసుకురావాలని నిర్ణయించామని చిన్ననీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు.



బెంగళూరు నుంచి కోలారు, చిక్క జిల్లాల చెరువులకు మురుగునీటి సరఫరా

ఆరోగ్యానికి మంచిది కాదన్న నిపుణులు

- కానీ ఈ పథకంపై నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మురుగునీరు భూగర్భంలోకి చేరితే మానవుల ఆరోగ్యానికి తీవ్ర దుష్పరిణామాలు తలెత్తవచ్చని తెలిపారు.
- ఈ ప్రాంతాలకు బెంగళూరు నుంచి మురుగునీటిని సరఫరా చేయడం సరైన నిర్ణయం కాదు. కలుషిత నీటిని సరఫరా ఎంతమాత్రం తగదని బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ టీవీ రామచంద్ర తెలిపారు.
- నీటి నాణ్యతపై భయంగా ఉందని కోలారు ప్రాంత రైతులు తెలిపారు. నీటిని నింపిన కొన్ని చెరువుల్లో రసాయనిక నురగ కనబడింది. ఈ నీటిని పంటలకు, ఇతర అవసరాలకు ఎలా ఉపయోగించగలం? అని ఆ ప్రాంతవాసులు ప్రశ్నించారు. వారి సందేహాలను సర్కారు నివృత్తి చేయాల్సి ఉంది.



బెంగళూరులోని మురుగునీటిని ఇలా శుద్ధీకరించి చెరువులకు సరఫరా చేస్తున్నారు



శుద్ధి చేసిన మురుగునీటితో నిండిన చిక్కబళ్లాపుర జిల్లాలోని ఒక చెరువు

ఇంజినీరింగ్ పట్టభద్రుడు ఆత్మహత్య

మైసూరు: నిరుద్యోగంతో బాధపడుతూ ఒక యువకుడు జీవితంపై విరక్తి చెంది ప్రాణాలు తీసుకున్నాడు. ఈ సంఘటన మైసూరు నగరంలోని జనతా నగరలో చోటు చేసుకుంది. యువకుడు లోహిత్‌రాజ్ (28) ఇంజినీరింగ్‌లో కంప్యూటర్స్ సైన్స్ కోర్సు చదివాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా చిన్నాచితకా ఉద్యోగాలే వచ్చాయి. తన చదువుకు సరిపడా ఉద్యోగం లభించక, చేయడానికి సరైన పనిలేక పోవడంతో ఆవేదనతో సోమవారం ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సరస్వతీపురం పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఇందిరా క్యాంటీన్లకు నీటి సరఫరా బంద్

శివాజీనగర: బెంగళూరులోని పలు ఇందిరా క్యాంటీన్లకు బీడబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు నీటి సరఫరాను బంద్ చేశారు. నగరంలోని వసంతనగర, జయనగర, బన్నప్పపార్క్, శివాజీనగరతో పాటు వివిధ చోట్లలో ఉన్న ఇందిరా క్యాంటీన్‌లలో నీరు లభించటం లేదు. నీటి బిల్లు పెరిగిపోయింది. కాంట్రాక్టర్లు బిల్లు చెల్లించలేదని, దీంతో అధికారులు నీటి సరఫరా కట్ చేశామన్నారు. తమ క్యాంటీన్‌లో ప్రస్తుతానికి నీరు రావటం లేదు. దీంతో తానే నేరుగా నీరు తీసుకొచ్చి ప్రజలకు ఇస్తున్నానని ఒక క్యాంటీన్‌లోని టోకెన్ సెంటర్ ఉద్యోగి తెలిపారు. ఈ సమస్యపై స్పందించిన ఓ కాంట్రాక్టర్ ఒకేసారి నీరు బిల్లు చెల్లించేందుకు సాధ్యపడదు. మాకు బీబీఎంపీ నుంచి బిల్లులు రావాల్సి ఉంది, అవి వచ్చాక బిల్లు చెల్లిస్తామని తెలిపారు. హఠాత్తుగా నీటి సరఫరా నిలిపివేయటం సరికాదన్నారు. ఈ విషయంపై స్పందించిన బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ కాంట్రాక్టర్‌లతో చర్చిస్తానని తెలిపారు.

మంత్రివర్గ విస్తరణ లేనట్టే?

- అది ముగిసిన అధ్యాయమన్న సీఎం

శివాజీనగర: మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీకి వెళ్లి ఏమి చెప్పాలో చెప్పాం. వారు తగిన సమయంలో తీర్మానం చేస్తారు అని సీఎం బసవరాజ బొమ్మై తెలిపారు. సోమవారం గాంధీ వర్ధంతి సందర్భంగా విధానసౌధ వద్ద బృహత్ గాంధీ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణ ముగిసిన పోయిన అధ్యాయమన్నారు. దీంతో విస్తరణ లేనట్టేనని దాదాపు ఖాయమైంది. ఫిబ్రవరి 17న బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు, అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేయనున్నట్లు సీఎం తెలిపారు. మహాత్మాగాంధీ బాటలో నడిచేందుకు ప్రతి ఒక్కరూ సంకల్పం చేయాలని తెలిపారు.

క్లుప్తంగా

అహింసా మార్గంలో దేశానికి గాంధీజీ స్వాతంత్ర్యం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నాయక్

రాయచూరురూరల్: దేశానికి అహింసా మార్గం ద్వారా మహాత్మ గాంధీ స్వాతంత్ర్యం తెచ్చారని డీసీసీ అధ్యక్షుడు బి.వి.నాయక్ వెల్లడించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ వర్ధంతిలో పాల్గొని మాట్లాడారు. నాడు తెచ్చిన స్వాతంత్ర్యానికి తూట్లు పొడిచే రాజకీయాలు సాగుతున్నాయన్నారు. మహాత్మగాంధీ సత్యం, శాంతి, అహింస, సమానత్వం, సహకారం ఉండాలని పిలుపు ఇచ్చిన నేత అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోసురాజు, బసవరాజ్‌రెడ్డి, సుఖాణి, ఆంజనేయ, జయన్న తదితరులున్నారు.

పట్టభద్రులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్



ఆందోళనలో పాల్గొన్న కిసాన్ సెల్ సభ్యులు

రాయచూరు రూరల్: వ్యవసాయ వర్సిటీలో చదివిన వ్యవసాయ ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగాలు కల్పించాలని లోక్ జనశక్తి కిసాన్ సెల్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం వ్యవసాయ వర్సిటీ వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో వ్యవసాయ ఇంజినీరింగ్ పట్టభద్రులకు 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ వర్సిటీ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు.

పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం



లక్ష్మీఆదినారాయణస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శివశంకర్‌రెడ్డి తదితరులు

గౌరిబిదనూరు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికలలో గెలవాలని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తాలూకాకు ఈశాన్య దిక్కులో ఉన్న గుడిబండ తాలూకా ఎల్లోడు లక్ష్మీ ఆదినారాయణ స్వామికి సోమవారం పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రాబోయే ఎన్నికలలోనూ ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఖరారైంది. ఎన్నికలలో పోటీ చేయడం ఇది వరుసగా 6వ సారి. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవరెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ బదిలీ

శివమొగ్గ: జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ నాగేంద్ర ఎఫ్ హొన్నళ్లి బదిలీ అయ్యారు. సీనియర్ కేఏఎస్ అధికారి అయిన ఆయనను బెంగళూరు నగరంలో ఉన్న పారిశ్రామిక, శిక్షణ, ఉపాధి శాఖ డైరెక్టర్‌గా నియమించారు. అదనపు జిల్లాధికారిగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం, నగరాభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేశారు.

స్వామీజీపై చర్య తీసుకోండి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: అంబేడ్కర్‌ను అవమానించిన స్వామీజీపై చర్యలు చేపట్టాలని మాదిగ దండోరా డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు నరసింహులు మాట్లాడారు. కేదార పీఠాధిపతి భీమా శంకర్‌లింగ స్వామీజీ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాలుకింద వేసి నలిపేస్తామని వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన స్వామీజీపై చర్యలు చేపట్టాలని స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

విరుపాక్షయ్యస్వామికి భార్గవ ప్రశస్తి

కంప్లి: కన్నడ పాత్రికేయునిగా, వ్యవసాయ, జ్యోతిష్య రంగాల్లో విశేష సేవలందించిన నెంబర్ 10 ముద్దాపురకు చెందిన ఎంఎస్.విరుపాక్షయ్య స్వామిని హొసపేటెలో సంగీత భారతి సంస్థ తరఫున రాష్ట్ర స్థాయి సమాజ సేవా భార్గవ ప్రశస్తితో గౌరవించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు హెచ్‌పీ.కల్లంభట్, ప్రముఖులు ఎస్‌డీ బసవరాజ్, బంగి దొడ్డమంజునాథ, ఎంకే.గురురాజ్, వీడీ వెంకనగౌడ్రు, హెచ్‌పీ విశ్వశంకర్ భట్, బెంగళూరు డీఆర్‌డీఓ విజ్ఞాని డాక్టర్ స్వామి నాయక్, విజయపుర సీఆర్‌పీ ఎల్‌పీ కులకర్ణి, భరతనాట్య శిక్షకురాలు పూర్ణిమా అశోక్ పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర కోసం రాస్తారోకో



పత్తిని రోడ్డుపై వేసి రాస్తారోకో చేస్తున్న రైతులు, కార్యకర్తలు



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో రైతులు పండించిన పత్తికి మద్దతుధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏఐకేకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ఏడో మైల్ క్రాస్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమ్మాల్ మాట్లాడారు. ప్రభుత్వం రైతుల శ్రేయస్సు దృష్ట్యా సత్వరం మద్దతుధరను ప్రకటించాలన్నారు. ఇటీవల జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ క్వింటాల్ పత్తిని రూ.9,500 ధరకు కొనుగోలు చేయాలని సూచించినా అధికారులు, దుకాణదారులు రూ.7000 లోపు ధరకే కొనుగోలు చేశారన్నారు. పత్తికి క్వింటాల్‌కు రూ.12,500ల మద్దతుధర కల్పించాలని కోరుతు తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాస్తారోకోతో రెండు గంటల పాటు వాహన రాకపోకలు స్తంభించిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న కలెక్టర్, ఎస్పీలు

కోలారు : రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ముందస్తుగా ప్రజలను జాగృత పరచడానికి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం డీఏఆర్ పోలీస్ క్వార్టర్స్ సమీపంలో బృహత్ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కలెక్టర్ వెంకటరాజ ప్రారంభించి మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువత రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదాన ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శిబిరంలో కలెక్టర్ వెంకటరాజతో పాటు ఎస్పీ నారాయణ తదితర పోలీస్ సిబ్బంది రక్తదానం చేశారు.

రేడియేషన్ యంత్రం రిపేరీ ఎన్నడో?

- చికిత్స కోసం కేన్సర్ రోగుల పడిగాపులు



విమ్స్‌లోని కేన్సర్ వార్డు ఇదే(ఫైల్)

బళ్లారి రూరల్: బళ్లారి, రాయచూరు, కొప్పళ, చిత్రదుర్గతో పాటు రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన అనంతపురం, కర్నూలుల నుంచి వచ్చే కేన్సర్ రోగులకు విమ్స్ ఆరోగ్య ప్రదాయిని. రోగులకు విమ్స్ కేన్సర్ విభాగంలో రేడియేషన్, బ్రేకీథెరపీ, కిమోథెరపీ చికిత్సలు అందజేస్తుంటారు. అయితే రేడియేషన్ యంత్రం మరమ్మతుకు గురై దాదాపు మూడు నెలలు కావస్తోంది. దీంతో కేన్సర్ రోగులు వ్యయప్రయాసల కోర్చి సుదూర బెంగుళూరు, హుబ్లీ, కర్నూలుకు వెళ్లలేక రేడియేషన్ యంత్ర ఎప్పుడు రిపేరీ అవుతుందా? అని వేచిచూస్తున్నారు. అధికారులు మాత్రం రిపేరీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించామని కాలం వెళ్లదీస్తున్నారు. రోగుల పరిస్థితిని అర్థం చేసుకొని రేడియేషన్ యంత్రాన్ని సత్వరం మరమ్మతు చేయించి చికిత్స ఆరంభించాలని కోరుతున్నారు.

అరకొర బస్సులు..ప్రయాణికుల పాట్లు



బస్టాండ్‌లో బస్సు వద్ద గుమికూడిన ప్రయాణికులు

సిరుగుప్ప: తాలూకా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించే ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రతి నిత్యం ప్రయాణికులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇది బస్సుల కొరత వల్లో లేక ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణో తెలియడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమయానికి సరిగా బస్సులు రాకపోవడంతో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, గర్భిణులు, దివ్యాంగులు బస్సుల కోసం ఎదురుచూసి నిరాశ చెందడంతోపాటు సీట్ల కోసం బస్సులను ముట్టడించే ప్రయాణికుల మధ్య చిక్కి ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి నెలకొంది. కొన్ని ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో విద్యార్థులకు పాస్‌లను నిషేధిస్తే, మరికొన్ని బస్సులు ప్రయాణికులను మాత్రమే ఎక్కించుకొని విద్యార్థులకు వెనుక ఇంకొక బస్సు వస్తుందని చెప్పి విడిచి వెళ్లిపోతున్నారు. దీంతో యువ విద్యార్థులకు, డ్రైవర్లకు మధ్య గొడవ మొదలై పోలీస్ స్టేషన్ వరకు వెళ్లి చివరకు విద్యార్థుల తల్లిదండ్రులు వేలాది రూపాయల మేర జరిమానా కట్టిన నిదర్శనాలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టి బస్ సౌకర్యాన్ని మెరుగుపరచాలని ప్రయాణికులు ఒత్తిడి చేస్తున్నారు.

కొత్త వ్యక్తుల కదలికలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సిద్దరామేశ్వరగౌడ

బళ్లారిటౌన్: కాలనీల్లో కొత్తగా సంచరించే వారి కదలికలపై అప్రమత్తంగా ఉండాలని గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ సిద్దరామేశ్వరగౌడ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి రాయల్ కాలనీలో కన్నడ చైతన్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన పోలీస్ సంపర్క అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వాకింగ్‌కు వెళ్లే మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్ల ముందు, వాకింగ్ వెళ్లే సమయాల్లో ఎవరిదో చిరునామా అడిగే నెపంతో ఉన్నఫళంగా మెడలోని ఆభరణాలను లాక్కెళతారన్నారు. కాలనీల్లో అనుమానాస్పదంగా తిరిగే వారిపై జాగ్రత్త అవసరమన్నారు. మహిళలు బయటికి వెళ్లేటప్పుడు ఆభరణాలు కనిపించకుండా వస్త్రధారణ చేసుకోవాలన్నారు. బహిరంగ స్థలాల్లో మద్యం సేవిస్తూ, జూదం ఆడుతూ ప్రజలకు అంతరాయం కల్గిస్తుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రముఖులు ప్రభుకుమార్, రఘురాంశెట్టి, స్థానికులు రాఘవేంద్రాచార్, రామమూర్తి, సతీష్, ప్రకాశ్ హెమ్మాడి, జ్యోతీ ప్రకాశ్, సుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రచయితపై చర్యలకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: శ్రీరామచంద్రుడిని అవమానించిన రచయిత కేఎస్ భగవాన్‌పై చర్యలు చేపట్టాలని హిందూ జనజాగృతి సమితి డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి గౌరవాధ్యక్షురాలు సువర్ణ మాట్లాడారు. శ్రీరాముడు సీతాదేవి సమక్షంలోనే మద్యం తాగేవాడని భగవాన్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండించారు. బిహార్ విద్యా శాఖా మంత్రి చంద్రశేఖర్ శ్రీరామ మను చరితం ద్వేషం పుట్టించే గ్రంథమని అభివర్ణించడాన్ని తప్పుబట్టారు. ఉత్తర ప్రదేశ్ సమాజ్‌వాదీ పార్టీ నేత స్వామి ప్రసాద్ మౌర్య గ్రంథాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పేర్కొనడంపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో జయశ్రీ, కృష్ణవేణి, శివరాజ్, హనుమంతులున్నారు.

విద్యా సంస్థలపై చర్యలేవీ?



డీడీపీఐకి వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

బళ్లారి అర్బన్: నగరంలో గుర్తింపు లేని పాఠశాలలు, కళాశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని కళ్యాణ కర్ణాటక అభివృద్ధి సమితి, నవ కర్ణాటక యువశక్తి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కోట ప్రాంతంలోని జిల్లా విద్యాశాఖ అధికారి(డీడీపీఐ) కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షులు పీఎం.ఈశ్వరప్ప, యువశక్తి అధ్యక్షులు సిద్మల్ మంజునాథ్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా విద్యా సంస్థలను నడుపుతున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూ.శ్రీరాములు, యూ.రమేష్‌కుమార్, జీ.నరేశ్‌బాబు, కట్టి ఈశ్వర్, శ్రీనివాస్, ఎం.దేవేశ్, ముండాసద మల్లికార్జున, కే.రమేష్, సిద్మల్ సంతోష్ పాల్గొన్నారు.

కేఆర్‌పీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన ప్రముఖులతో కలిసి విజయచిహ్నం చూపుతున్న గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: నగరంలోని ప్రముఖ నేతల మద్దతుదారులు సోమవారం గాలి జనార్దన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. ఉదయం జనార్దన్‌రెడ్డి నివాసంలో నగరసభ మాజీ స్థాయి సమితి చైర్మన్, మాజీ కౌన్సిలర్ ఈ.రామకృష్ణ, నగరసభ మాజీ అధ్యక్షులు పంపణ్ణ నాయక్, మాజీ కౌన్సిలర్ రామనాయక్ తదితరులు కేఆర్‌పీపీ తీర్థం పుచ్చుకున్నారు. కొప్పళ తాలూకాలోని చిలకముఖిలో కేఆర్‌పీపీ పార్టీలో వందలాది కార్యకర్తలు చేరారు. ఈ ప్రాంతంలోని మూడు గ్రామ పంచాయతీల పలువురు సభ్యులు కూడా కేఆర్‌పీపీ కండువా వేసుకున్నారు. ఈ గ్రామంలోని ఆలయాలను జనార్దన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో డప్పుల వాయిద్యాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు సాగింది. కడేదాళలో గ్రామ ప్రముఖ నేత రామణ్ణగౌడ దళపతి నేతృత్వంలో వందలాది కార్యకర్తలు జనార్దన్‌రెడ్డి పార్టీలో చేరిపోయారు. ఒళబళ్లారికి జనార్దన్‌రెడ్డి వెళ్లగా గ్రామస్తులు ఆయనపై పూల వర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో పాటు ప్రజలు, నాయకులు తమ పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు.

కోలారు వార్తలు...

ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మాలూరు : పటిష్ట దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని గంగా నికేతన్ ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్ రామచంద్రప్ప తెలిపారు. సోమవారం తాలూకాలోని లక్కూరులో ప్రభుత్వ కళాశాల గడినాడు సాంస్కృతిక భవన సభాంగణంలో నిర్వహించిన జాతీయ కవి కువెంపు 118వ జయంతి, అంబేడ్కర్ 132వ జయంతిలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. మొదటి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కువెంపు కన్నడ సాహిత్య లోకానికి చేసిన సేవలు అపారమన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అనికేతన సాంస్కృతిక వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె మునికృష్ణప్ప, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బి మునియప్ప పాల్గొన్నారు.

అమరుల సేవలు శ్లాఘనీయం



సిబ్బందికి ప్రతిజ్ఞా విధిని బోధిస్తున్న ఎస్పీ ధరణీదేవి

కేజీఎఫ్ : నగరంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం పోలీసు అమరయోధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ ధరణీదేవి పోలీస్ సిబ్బందికి ప్రతిజ్ఞా విధిని బోధించారు. విధి నిర్వహణలో అమరులైన సిబ్బందికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది సేవలు శ్లాఘనీయమన్నారు. వారిని సదా స్మరించుకోవాలన్నారు. సహాయక పాలనాధికారి జి.విశ్వనాథ్, డీఎస్పీ వి.ఎల్.రమేష్, నజీమా భాను, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్‌లోకి కార్యకర్తల చేరిక



కాంగ్రెస్‌ను వీడి జేడీఎస్‌లోకి చేరిన కార్యకర్తలు

శ్రీనివాసపురం: వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థులను గెలిపించాలని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి మనవి చేశారు. సోమవారం ఉప్పరపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఇవే తనకు ఆఖరు ఎన్నికలని అన్నారు. గత పదేళ్లుగా తాలూకాలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. జేడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు రుణాలను నమ్ముకుని ఎన్నికల్లో గెలవాలనుకుంటున్న వారికి ఈసారి ఓటమి తప్పదన్నారు. గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌ని వీడి జేడీఎస్‌లో చేరారు. జెడ్పీ మాజీ సభ్యుడు తూపల్లి నారాయణస్వామి ఉన్నారు.

అహం వీడితే ఆనందం

- అలరించిన చైనీయుల వేడుకలు



ప్రశాంతి నిలయం: పుట్టపర్తి ప్రశాంతి నిలయం చైనీయుల నూతన సంవత్సర వేడుకలతో అలరారింది. సాయికుల్వంత్ సభా మందిరంలోభక్తులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీఅలరించాయి. తైవాన్, సింగపూర్, మలేషియా, హాంకాంగ్, జపాన్, ఇండోనేషియా దేశాల భక్తులు ఈ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చైనీస్ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే డ్రాగన్ నృత్యం ఆకట్టుకుంది. మానవుడు అహం వీడితే భగవంతునిగా మారవచ్చు అన్న సందేశాన్నిస్తూ చైనీస్ భక్తి నాటికను ప్రదర్శించారు. మానవుడు సనాతన ధర్మాలైన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలను కలిగి ఉండాలని, కామ క్రోధ మధ మాత్సర్యాలను విడనాడాలని సందేశాన్నిచ్చారు. సంగీత గాన కచేరి పరవశభరితంగా సాగింది. గంటకు పైగా చైనీస్ భాషలో భక్తిగీతాలను ఆలపిస్తూ సత్యసాయిని కీర్తించారు.

కోర్టు ఆవరణలో ఉత్సాహంగా స్వచ్ఛభారత్



పాల్గొన్న న్యాయమూర్తులు, సిబ్బంది

గంగావతి రూరల్: జాతీయ స్వచ్ఛతా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా కార్యక్రమంలో జిల్లా న్యాయాలయం న్యాయమూర్తులు, జిల్లా అడ్వకేట్ల సంఘం అధ్యక్షులు, పదాధికారులు, న్యాయాలయ ఉద్యోగులు ఉత్సాహంగా చేతులు కలిపారు. కార్యక్రమాన్ని ప్రధాన జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ బీ.ఎస్ రేఖా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొప్పళ జిల్లా అడ్వకేట్ల సంఘం అధ్యక్షులు ఏ.వి.కణవి, కార్యదర్శి బి.వి.సజ్జన్, ఎంప్లాయీస్ సంఘం సభ్యులు, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్జిలచే పార్కులో స్వచ్ఛ సేవ

చిక్కబళ్లాపురం: జాతీయ స్వచ్ఛతా దినోత్సవం సందర్భంగా సోమవారం చెన్నయ్య పార్కులో జిల్లా జడ్జి రాజశేఖర్ చీపురు పట్టి చెత్త ఊడ్చారు. జడ్జిలు కెబి శివప్రసాద్, లక్ష్మీకాంత్ జె మిస్కిన్, సబ్ కలెక్టర్ సంతోష్‌కుమార్, లాయర్లు, నగరసభ సిబ్బంది పాల్గొన్నారు.

సృజన వెలికితీతకు కలికా హబ్బ దోహదం



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

కంప్లి: పిల్లల్లో దాగి ఉన్న సృజనశీలతను వెలికితీసేందుకు కలికాహబ్బ దోహదపడిందని హొసపేటె బీఈఓ చెన్నబసప్ప తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్ఎన్ పేటె పాఠశాల, 8వ వార్డు క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన బాలల కలికాహబ్బ ఊరేగింపును ప్రారంభించి ఆయన మాట్లాడారు. కలికాహబ్బతో పిల్లల్లో స్వతంత్రంగా ఆలోచించే శక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌసియాబేగం మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు అనేక సౌకర్యాలతో గుణాత్మక విద్యను అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు పిల్లలు, చేర్పించేందుకు వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపాలన్నారు. చేర్పుకోవడం ఒకటే కాదని క్రీడల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఊరేగింపులో అనేక వేషధారణలు, సింగారించిన జోడెడ్ల బండిపై బయలాట వేషధారి పిల్లలతో చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీపీ ఈఓ కేఎస్ మల్లనగౌడ, మున్సిపల్ అధ్యక్షురాలు శాంతలా, ఈసీఓ జీ.వీరేష్, సీఆర్‌పీ రేణుకారాధ్య, జీ.హన్మంతప్ప, ఉప ప్రిన్సిపల్, టీఎం బసవరాజ్ పాటిల్, ఉపాధ్యాయ బృందాలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత రసమంజరి

హొసపేట: హంపీ ఉత్సవాల ముగింపు వేడుకల్లో ప్రధాన వేదిక వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన సంగీత రసమంజరి శ్రోతలను ఆకట్టుకొంది. కన్నడ ప్రసిద్ధ సినీగాయకుడు విజయప్రకాష్ తన మధుర కంఠంతో కన్నడ సినీ పాటలను పాడి వినిపించారు. పునీత్ నటించిన చిత్రం బొంబె హేళుతైతే పాటకు ప్రేక్షకులు ఈలలు, చప్పట్లతో సందడి చేశారు. అదే విధంగా గాయని అనన్యభట్ కేజీఎఫ్-2 సినిమా పాటను పాడి వినిపించారు. హిందీ సినీ గాయకుడు కైలాస్ కేర్ హిందీ పాటలతో సందడి చేశారు.

వసతి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పావగడ: గుజ్జనడులోని మొరార్జి వసతి పాఠశాల(ఎస్సీ) విద్యార్థులు రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాలో ప్రథమ స్థానం సాధించారు. ఈనెల 27, 28న బెంగళూరు ప్యాలెస్ మైదానంలో జరిగిన విజ్ఞానమేళాలో ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ పర్యావరణ ఆరోగ్యం - లాభదాయక సుస్థిర వ్యవసాయం అనే అంశంపై నమూనాలు ప్రదర్శించారు. దీంతో న్యాయ నిర్ణేతలు ప్రథమ స్థానాన్ని ప్రకటించి షీల్డ్, ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతి అందించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: భారత రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రగతిశీల సంఘాలు పేర్కొన్నాయి. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ర్యాలీనుద్దేశించి ప్రతిభ మాట్లాడారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల దేశంలో శాంతిభద్రతలు నెలకొన్నాయన్నారు. అయితే కుల, మత విభేదాలను రేపేందుకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుటిల యత్నాలకు బలి కారాదంటూ కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు.

చివరి ఆయకట్టుకు నీరందించండి



వినతిపత్రం సమర్పిస్తున్న కరవే నాయకులు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ చివరి ఆయకట్టు భూములకు నీరందించాలని కరవే సభ్యులు పేర్కొన్నారు. సోమవారం సిరవారలోని మాన్వి క్రాస్ వద్ద రాస్తారోకో చేపట్టి నీటి పారుదల శాఖ అధికారులతో సంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడారు. కాలువలో నీటి గేజ్‌ను సక్రమంగా నిర్వహించి ఆయకట్టు భూములకు నీరందించాలని కోరారు. ఆందోళనలో శంకరగౌడ, శరణప్పగౌడ, రైతులు పాల్గొని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

మత్స్యకారుల రుణాలను మాఫీ చేస్తాం

- మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి



మాట్లాడుతున్న మాజీ సీఎం కుమారస్వామి

రాయచూరు రూరల్ : రాష్ట్రంలో మత్స్యకారులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, తమను పూర్తి స్థాయి మెజార్టీతో ప్రజలు ఆశీర్వదించాలని మాజీ సీఎం కుమారస్వామి ప్రజలను అభ్యర్థించారు. సోమవారం సింధనూరు తాలూకా బెంగాలీ క్యాంప్‌లో ఏర్పాటు చేసిన పంచరత్న రథయాత్ర ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి తమను గెలిపిస్తే రైతులు, మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కళ్యాణ కర్ణాటకలో క్యాంప్‌లను రెవిన్యూ గ్రామాలుగా ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావ్ నాడగౌడ, రమేష్‌గౌడ, సారా మహేష్, మంజేగౌడ, భోజేగౌడ, విరుపాక్షి, భూపాల్ నాడగౌడలున్నారు.

జోరుగా ఇంటింటా ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జేడీఎస్ నాయకులు

కోలారు : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జేడీఎస్ నాయకుడు, సంభావ్య జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్ తెలిపారు. సోమవారం తాలూకాలోని దొడ్డహసాళ జీపీలోని ప్రతి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తాను గత కొన్నేళ్లుగా క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ప్రజల కష్టసుఖాలపై స్పందిస్తున్నానన్నారు. తనను గెలిపించి మరింతగా ప్రజాసేవకు అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర కురుబ సంఘం డైరెక్టర్ కేటీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాల్లో అక్రమాలు ఉండరాదు

కోలారు: గొర్రెల పెంపకందారులు, ఉన్ని ఉత్పాదకుల సహకార సంఘాల్లో అక్రమాలకు తావు లేకుండా చూసుకోవాలని, అప్పుడే ఆర్థికంగా సధృఢం అవుతారని డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్లి గోవిందగౌడ తెలిపారు. సోమవారం సహకార యూనియన్ సభాంగణంలో గొర్రెల పంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లకు, సీఈఓలకు నిర్వహించిన ఒకరోజు సదస్సును ప్రారంభించి మాట్లాడారు. గొర్రెల అభివృద్ధి మండలి నుంచి గొర్రెల పెంపకం దారులకు రూ.40 వేల సహాయధనం లభిస్తుందని తెలిపారు. మూరాండహళ్లి గోపాలప్ప తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతను కాపాడాలి

కోలారు : భారతీయులందరూ ఒకటే అనే జాతీయ భావైక్యతను పెంపొందించుకోవాలని బెంగళూరు ఇంటర్ కల్చర్ డైలాగ్ ఎక్స్ఛేంజ్ ప్రముఖుడు రాబిన్సన్ దాస్ తెలిపారు. సోమవారం తాలూకాలోని చామరహళ్లి పుణ్యకోటి విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. దేశ సర్వతోముఖ ప్రగతికి ప్రజలు సైనికుల్లా పని చేయాలన్నారు. జాతీయ భావైక్యత కోసం ప్రాథమిక దశలోనే సౌహార్దతను అలవర్చుకోవాలన్నారు. పరిసరాల సంరక్షణ అందరి కర్తవ్యంగా భావించాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాస్, సమూహ సంపన్మూల వ్యక్తి జి.వి.గంగాధర్, సంస్థ కార్యదర్శి గోవిందగౌడ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కబడ్డీ విజేత గుంజూరు స్పోర్ట్స్ క్లబ్



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర పరిధిలోని వర్తూరు గ్రామంలో చన్నరాయ స్వామి రథోత్సవం సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలలో గుంజురు స్పోర్ట్స్ క్లబ్ విజేతగా నిలిచింది. విజేత జట్టుకు మహాదేవ పుర బీజేపీ మండల అధ్యక్షుడు మనోహర్ రెడ్డి ట్రోఫీ అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్లి: ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ సతీష్ రెడ్డి సోమవారం నగరంలోని బొమ్మనహళ్లి మంగమ్మపాళ్య వార్డు సామసంద్రపాళ్యలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సమాజ సేవకుడు శ్రీనివాస్ రెడ్డితో కలిసి సామసంద్ర పాళ్యకు చేరుకున్న ఎమ్మెల్యే ప్రభుత్వ పాఠశాలకు చేరుకుని అక్కడ అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామ సమస్యలపై ఆరా తీశారు. శ్రీసాయి రామ్ విద్యాసంస్థల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

షాక్ కొడుతున్న కొళాయి



టెస్టర్‌లో లైట్ వెలుగుతున్న దృశ్యం

కృష్ణరాజపురం: హొసకోటె నగరం టీజీ లేఔట్ మొదటి క్రాస్‌లో తాగునీటి కొళాయికి విద్యుత్ ప్రసరణ అవుతుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని కెనరా బ్యాంకు వెనుక భాగంలో ఉన్న రోడ్డులో తాగునీటి కొళాయిని పట్టుకుంటే షాక్ కొడుతోందని, స్థానికులు టెస్టర్‌తో చూడగా కరెంట్ పాస్ అవుతోంది. మూడు రోజులుగా ఇలాగే ఉందని, ఎటువంటి ప్రమాదం జరగక ముందు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్యక్షుడికి సన్మానం



సన్మానించిన దృశ్యం

గౌరిబిదనూరు: నేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆఫ్ కర్ణాటక అధ్యక్షుడిగా డాక్టర్ సుబ్రమణ్యం, గుండ్లకొత్తూరు గ్రామానికి చెందిన వెంకటశివారెడ్డిని కార్యదర్శిగా ఆదివారం సభ్యులు ఎన్నుకున్నారు. అరుణ్ కుమార్, మధుసూదన్‌లు కార్యదర్శులుగా, ద్వారకానాథ్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ సొసైటీని ప్రముఖ స్వతంత్ర సమర యోధురాలు అనిబిసెంట్ స్థాపించారు. కొత్తగా ఎన్నికైన వారిని సోమవారం తాలూకాకు చెందిన డైయిరి రమేశ్, కృష్ణమూర్తి తదితరులు సన్మానించారు.

క్యాలెండర్ విడుదల



బనశంకరి: శ్రీ ద్రౌపది ధర్మరాయ దేవస్థానంలో కర్ణాటక వహ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్రాధ్యక్షుడు వర్తూర్ జీకే.గిరీశ్, ధర్మరాయస్వామి దేవస్థాన సమితి అధ్యక్షుడు సతీశ్, బాలకృష్ణ నూతన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కరగ పూజారులు జ్ఞానేంద్ర, ఉపాధ్యక్షుడు వేణు, కేఎస్.రాజ్‌కృష్ణమూర్తి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో గో గ్రీన్



తుమకూరు: తుమకూరు నగరంలోని హెచ్.ఎం.ఎస్. టెక్నికల్ మహా విద్యాలయం ఆవరణంలో సోమవారం గో గ్రీన్, గో వ్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్. ఎస్. షఫీ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల మొక్కలతో పాటు ఔషధ మొక్కలను కూడా నాటారు. ఈ సందర్భంగా షఫీ అహ్మద్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

నిత్యం గొడవ పడుతోందని..

- భార్యను హత్యచేసి చెరువులో పడేసిన భర్త
- బెంగళూరు నుంచి వచ్చి తుమకూరు జిల్లాలో అకృత్యం

తుమకూరు: భార్య రోజూ గొడవపడుతోందని కోపంతో భర్త ఆమెను హత్య చేసిన చెరువులో వేసిన సంఘటన జిల్లాలోని తురువెకెరె పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తాలూకాలోని మాయసంద్రలో ఉన్న దొడ్డకెరెలో ఉన్న తాగునీటి ఫిల్టర్ కేంద్రం వద్ద దర్శిని (26) అనే వివాహిత యువతి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆమె భర్త వినయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

బెంగళూరు నుంచి బంధువుల ఇంటికి వచ్చి..

ఈ దంపతులు బెంగళూరు యలహంకలో నివసిస్తుంటారు. అక్కడి దగ్గరలో నాగమంగళలోని బంధువుల ఇంటికి ఆదివారం వెళ్లారు. అక్కడ కూడా దంపతుల మధ్య ఏదో విషయమై రగడ జరిగింది. దీంతో భార్యను తీసుకుని బయటకు వచ్చాడు. సాయంత్రం తుమకూరు జిల్లాలోని దొడ్డకెరె చెరువు వద్దకు చేరుకుని మళ్లీ గొడవపడ్డారు. భర్త కోపం పట్టలేక ఆమెను గొంతు పిసికి చంపి చెరువులో పడవేసి వెళ్లిపోయాడు. సోమవారం చెరువులో యువతి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని వెలికితీసి ఆస్పత్రికి తరలించారు. ఆమె భర్తను అదుపులోకి తీసుకుని విచారించగా, రోజూ గొడవ పడుతుందని, అందుకే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు.



చెరువు వద్ద పరిశీలిస్తున్న పోలీసులు



చెరువులో తేలుతున్న మృతదేహం

అలరించిన ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న దృశ్యం



ఆకట్టుకున్న ముగ్గు

బొమ్మనహళ్లి: నగరంలోని బీటీఎం లేఔట్ నియోజకవర్గంలో సోమవారం జక్కసంద్రలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే, కేపీసీసీ కార్యాధ్యక్షుడు రామలింగారెడ్డి పాల్గొన్నారు. 60 మందికి పైగా మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గురు కాంతార చిత్రంతో వేసిన ముగ్గు ఆకట్టుకుంది. మాజీ మేయర్ బీఎస్ మంజునాథ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మంజునాథ్‌లు పాల్గొన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

వీధికుక్కల దాడిలో దూడ మృతి

మైసూరు: వీధి కుక్కల దాడిలో దూడ మృతి చెందిన ఘటన మైసూరులోని రామకృష్ణ నగరంలో చోటు చేసుకుంది. ఈశ్వర్ అనే వ్యక్తికి చెందిన దూడ రోడ్డుపై ఉండగా ఆదివారం రాత్రి వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి. సోమవారం ఉదయం విషయం గుర్తించిన ఈశ్వర్ చిరుత దాడి చేసి ఉంటుందని భావించారు. అటవీ అధికారులు అక్కడికి చేరుకుని ఆనవాళ్లను పరిశీలించి వీధి కుక్కలు దాడి చేసినట్లు గుర్తించారు.

కారు డివైడర్‌ను ఢీకొని...

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాల తాలూకా కోల్య-అడ్య మార్గంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఉళ్లాల హిదాయత్ నగర నివాసి రిఫాయి (24) మృతి చెందగా, బాషర్ అహమ్మద్, కేరళ కణ్ణూరు నివాసి ఫాతిమా, రేవతిలు గాయపడ్డారు. నలుగురు కలిసి కారులో కోల్య-అడ్య వద్ద వెళ్తుండగా అదుపుతప్పి కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. రిఫాయి కారులో చిక్కుకుని మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఉళ్లాల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైకిస్టు దుర్మరణం

మైసూరు: బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందిన ఘటన మైసూరు-హుణసూరు రోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. మృతుడిని మండ్య జిల్లా పాండవపుర తాలూకా కెన్నాలు గ్రామానికి చెందిన శ్రీనాథ్ (38)గా గుర్తించారు. ఇతను మైసూరు నగరంలోని హుణసూరు రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా వేగానికి వాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. తలకు తీవ్ర గాయంతో శ్రీనాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అర్ధరాత్రి బైక్‌పై విధాన సౌధ వీక్షణకు వచ్చి...

- వ్యక్తి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

శివాజీనగర: ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు స్నేహితులు బైక్‌పై విధానసౌధ వీక్షణకు వచ్చి ప్రమాదానికి గురయ్యారు. ఒకరు మృతి చెందగా మరొకరు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. హైగ్రౌండ్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెవెన్ మినిస్ట్రీస్ క్వార్టర్స్ వద్ద ప్రమాదం జరిగింది. నగరానికి చెందిన రాజేశ్, పరశురామ్ ఆదివారం అర్ధరాత్రి మద్యం తాగి బైక్‌పై విధానసౌధ చూడటానికి బయలుదేరారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో మినిస్టర్స్ క్వార్టర్స్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. వీరితో పాటు మరో బైక్‌లో వస్తున్న స్నేహితుడు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజేశ్ మృతి చెందాడు. హెల్మెట్ ధరించకపోవడమే కారణమని పోలీసులు తెలిపారు.

మృతుడి సమాచారం లభ్యం

- నిందితుడి కోసం పోలీసుల గాలింపు

శివాజీనగర: మైత్రీ సర్కిల్ వద్ద గురువారం రాత్రి హిట్ అండ్ రన్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుడి వివరాలు లభ్యమయ్యాయి. ఆర్టీ నగర చోళనాయకనహళ్లికి చెందిన డీ.ఎస్.వెంకటేశ్‌గా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. మైత్రి సర్కిల్ వద్ద ఆటో దిగి ఇంటికి వెళుతుండగా రోడ్డు దాటే క్రమంలో వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొంది. స్థానికులు బాధితుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

దివంగత నేతలకు నివాళి



తుమకూరు: తుమకూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌ల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తుమకూరు నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని దివంగత నేతల చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు కెంచమారయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించి మోసాలు

యశవంతపుర: కోట్లు విలువ చేసే ఇంటి స్థలాలకు నకిలీ పత్రాలు సృష్టించి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని శేషాద్రిపురం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు విజయమల్యా బ్యాంక్‌లో నకిలీ పత్రాల ఆధారంగా లోన్ తీసుకుని మోసం చేసినట్లు తేలింది. ఇతను పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. 2016 నుంచి నకిలీ పత్రాల ఆధారంగా కోట్లు మోసం చేసినట్లు పోలీసుల విచారణలో బయట పడింది. నిందితుడిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

చోరీ కేసులో అరెస్ట్..

విలాసవంతమైన జీవనం కోసం బైక్‌లు అపహరిస్తున్న ముగ్గురు నిందితులను బెంగళూరు గ్రామీణ జిల్లా దాబస్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. తుమకూరు శాంతినగరకు చెందిన ముబారక్, ఎన్ఆర్ కాలనీకి చెందిన నందీశ్, అరవిందనగరకు చెందిన అభిషేక్‌లను అరెస్ట్ చేసి 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

దంపతులను బెదిరించిన నిందితుల అరెస్ట్

శివాజీనగర: రెండు రోజుల క్రితం కారులో వెళ్తున్న దంపతులను బైక్‌తో ఢీకొట్టి దోచుకోవాలని చూసిన ఇద్దరు దొంగలను ఎట్టకేలకు బెళ్లందూరు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను ధనుష్, రక్షిత్‌లుగా గుర్తించారు. ఆదివారం తెల్లవారుజామున వైట్‌ఫీల్డ్ రోడ్డులో దంపతులు కారులో వస్తుండగా వన్‌వేలో బైక్‌పై వచ్చిన దుండగులు కారును ఢీకొట్టి కిందకు దిగాలని హెచ్చరించారు. భయపడిపోయిన దంపతులు కారులో వేగంగా వెళ్లినా వారిని ఐదు కిలోమీటర్లు ఈ దుండగులు వెంటాడారు. దృశ్యాలు వైరల్ కావడంతో తీవ్రంగా పరిగణించి నిందితులను అరెస్ట్ చేసినట్లు డీసీపీ గిరీశ్ తెలిపారు.

న్యాయ విచారణకు స్యాంట్రో రవి

శివాజీనగర: అత్యాచారంతో పాటు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న స్యాంట్రో రవిని సీఐడీ అధికారులు న్యాయ విచారణకు అప్పగించారు. మధుమేహ బాధితుడైన స్యాంట్రోకు ఆరోగ్య సమస్యలు ఎదురుకావడంతో గురువారం రాత్రి బౌరింగ్ ఆస్పత్రికి తరలించి అక్కడికి విక్టోరియాకు పంపారు. ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు తెలియడంతో శుక్రవారం రవిని సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకొన్నారు. 30 వరకు తమ కస్టడీకి అనుమతి ఉన్నా రెండు రోజుల ముందుగానే అంటే ఈనెల 28న న్యాయ విచారణకు అప్పగించినట్లు సీఐడీ ఉన్నత వర్గాలు తెలిపాయి.



ఆందోళనకు స్పందన ఏదీ?

డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో చేపట్టిన నిరవధిక ధర్నా సోమవారం 8వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ధర్నా క్రమంగా బలహీనపడింది. కొద్దిమంది మాత్రమే ఆందోళన కొనసాగిస్తున్నారు

స్వామీజీ సహాయకురాలు అదృశ్యం



రేవతి

తుమకూరు: తుమకూరు జిల్లాలోని గుబ్బి తాలూకా జీ హొసహళ్ళి గ్రామం పడవల మఠంలో ఉన్న మురుఘ శరణ స్వామి సహాయకురాలు అదృశ్యమైంది. చిత్రదుర్గలోని మురుఘ మఠానికి చెందిన మరో శాఖ పడువల మఠం. శివమూర్తి శివాచార్య స్వామీజీకి సహాయకురాలు అయిన రేవతి అదృశ్యమైన మహిళ. ఈమె స్వామీజీ వద్ద ఉంటూ ఆయన బాగోగులు చూసుకునేవారు. మఠంలో 50కి పైన పశువులను పోషిస్తున్నారు. రేవతి తల్లితో కలిసి ఉంటోంది. జీ.హొసహళ్ళిలో జడెరుద్ర స్వామీజీ మఠం ఉంది. ఈ మఠానికి చెందిన సుమారు 18 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలాన్ని గ్రామస్తులు మురుఘ మఠానికి ఇవ్వగా ఈ స్థలంలో రేవతి నివాసం ఉండేది. చిత్రదుర్గ మురుఘ మఠంలో అక్రమాలు వెలుగులోకి రావడంతో స్థానిక గ్రామస్తులు రేవతిని కూడా ప్రశ్నించారు. దాంతో ఆందోళనకు గురైన ఆమె, కుటుంబం పశువులను కూడా తీసుకుని కనిపించకుండా వెళ్లిపోయారు. సుమారు 12 సంవత్సరాలకు పైగా ఇక్కడ నివాసం ఉంటున్న రేవతి ఒక్కసారిగా అదృశ్యం కావడం చర్చనీయాంశమైంది.

ఇద్దరు నిందితుల అరెస్ట్

యశవంతపుర: బెంగళూరులో బైక్‌లను అపహరిస్తున్న ఇద్దరిని దేవనహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. చన్నరాయపట్టణ నివాసి అరుణ్‌కుమార్ అలియాస్ కాడా, తమిళనాడు కృష్ణగిరి జిల్లా గుండగుర్కికి చెందిన శ్రీధర్‌లను అరెస్ట్ చేశారు. నిందితులపై దేవనహళ్లి, విద్యారణ్యపుర, యలహంక ఉపనగర, అత్తిబెలె, హొసూరు స్టేషన్‌లో కేసులున్నట్లు పోలీసులు తెలిపారు.

హోసూరు వార్తలు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన బైరప్ప

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని శంకరాపురం గ్రామానికి చెందిన బైరప్ప (45) సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంలో హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారి అడ్డగురికి వద్ద వెళ్తుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బైరప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. సూళగిరి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

కెలమంగలం: పెళ్లయి 9 ఏళ్లు గడిచినా పిల్లలు కలగకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన మహిళ బావిలో పడి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మేరకు బెంగళూరు దగ్గర ఆనేకల్ బాద్రిపుర ప్రాంతానికి చెందిన మాదేశ్ (30)కు, డెంకణీకోట సమీపంలోని జార్కాలట్టి గ్రామానికి చెందిన దేవమ్మ (29)తో పెళ్లయింది. ఇంతకాలం గడిచినా దేవమ్మకు సంతానం కలగకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో కోపగించుకొని పుట్టింటికెళ్లిన దేవమ్మ ఆదివారం ఉదయం బావిలో పడి ఆత్మహత్య చేసుకొంది. డెంకణీకోట పోలీసులు చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యం తాళలేక...

క్రిష్ణగిరి: అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన నాగరసంబట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని కుడిమేనహళ్లి గ్రామానికి చెందిన రంగపెరుమాళ్ భార్య గోవిందమ్మ (48). గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ వచ్చింది. ఆరోగ్యం బాగు కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన గోవిందమ్మ ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకుంది. నాగరసంబట్టి పోలీసులు కేసు నమోదు చేశారు.

మెకానిక్ అరెస్ట్

యశవంతపుర: మత్తుపదార్థాలను విక్రయిస్తున్న నిందితుడిని డీజేహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 300 గ్రాముల ఎండీఎంని స్వాధీనం చేసుకున్నారు. గ్యారేజ్‌లో మెకానిక్‌గా పని చేస్తున్న హుసేన్ నైజీరియా పౌరుడితో కలిసి మత్తు పదార్థాలను తెచ్చి అమ్ముతుండగా పోలీసులు అరెస్ట్ చేశారు.

శభాష్ డ్రైవరన్న!

- చెరువులో మునిగిపోతున్న ఇద్దరు బాలికలను రక్షించిన మంజునాథ్



బాలికను తీసుకువస్తున్న మంజునాథ్

తుమకూరు: చెరువులో మునిగిపోతున్న ఇద్దరు బాలికలను ఆర్టీసీ డ్రైవర్ ప్రాణాలతో కాపాడిన ఘటన ఆదివారం సాయంత్రం తుమకూరు జిల్లా శిర తాలూకా హందికుంటె అగ్రహారలో చోటుచేసుకుంది. వివరాలు... కేఎస్ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ మంజునాథ్ ఆదివారం సాయంత్రం ప్రయాణికులతో నాగప్పనకహళ్లి గేట్ మార్గంలో వస్తుండగా సుదూరంలో ఉన్న చెరువులో ఇద్దరు బాలికలు మునిగిపోతున్నట్లు గుర్తించాడు. వెంటనే బస్సును పక్కకు నిలిపి నీటిలో దూకాడు. ఇద్దరిని పట్టుకుని ఒడ్డుకు చేర్చాడు. డ్రైవర్ సాహసాన్ని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. డ్రైవర్ మంజునాథ్ మాట్లాడుతూ... పిల్లలు మునిగిపోతుండగా అక్కడే చెరువు వద్ద తల్లి ఏడుస్తుండటాన్ని గమనించి వెంటనే బస్సు ఆపి చెరువులో దూకి చిన్నారులను రక్షించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంజునాథ్‌ను డిపో మేనేజర్, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

మహాత్ముడికి ఘన నివాళి



బొమ్మనహళ్లిలో గాంధీ వర్ధంతి



బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి గాంధీ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిక్కణ్ణ, వెంకట, రమణప్ప, కృష్ణారెడ్డి, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

బనశంకరి: సత్యం, అహింసా ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్య తీసుకువచ్చిన మహాత్మ గాంధీ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎర్రగంగుల లింగమ్మ వెంకటరామప్ప చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వై.వెంకటనారాయణ తెలిపారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం విద్యారణ్యపురలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాపూజీ చిత్రపటానికి వెంకటనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు.



కుష్టువ్యాధిని తరిమేద్దాం

మండ్య: మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా మండ్య నగరంలో కుష్టు రోగ నివారణ దినోత్సవాన్ని ఆచరించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం నుంచి మండ్య నగరంతో పాటు జిల్లా అంతటా ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు నియంత్రణ ర్యాలీలు జరుగుతాయని కలెక్టర్ హెచ్ఎన్ గోపాలకృష్ణ తెలిపారు. చామరాజేంద్ర సర్కిల్ వద్ద అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో కుష్టు వ్యాధి నివారణే లక్ష్యమని తెలిపారు.

కలెక్టరేట్‌లో వెల్లువెత్తిన ఫిర్యాదులు



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న దృశ్యం

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ సమస్యలపై 263 ఫిర్యాదులను అందజేశారు. కలెక్టర్ జయచంద్రభానురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాగునీరు, ఇళ్లపట్టాలు, కుట్టుయంత్రాలు, రోడ్లవసతి, వృద్ధాప్య పెన్షన్, రుణ సహాయం, ఆర్థిక సాయం తదితర సమస్యలపై అందుకొన్న వినతి పత్రాలను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ద్వారా తలా రూ. 15000 చొప్పున 10 మందికి, దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా తలా రూ. 9050 విలువ చేసే ఉపకరణాలు ఇద్దరి మొత్తం రూ. 1.68 లక్షల విలువ చేసే సంక్షేమ ఫలాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, అధికారులు అయ్యప్పన్, భాగ్యలక్ష్మి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వాసుల సమస్యలను తీర్చాలి



నిరసనకారులను అడ్డుకున్న పోలీసులు

హోసూరు: హోసూరు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ సోమవారం ఆందోళన నిర్వహించింది. యూనియన్ కార్యదర్శి రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళనలో హోసూరు కార్పొరేషన్ పరిధిలో రోడ్ల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి గడిస్తున్న వారి వద్ద అధిక సుంకం వసూలు చేయడాన్ని అడ్డుకోవాలని, వార్డులలో రోడ్లు, తాగునీటి వసతి, మురికి కాల్వల వసతిని ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దార్ గవాస్కర్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకొన్నారు. నాయకులు జయరామన్, తిమ్మారెడ్డి, దేవరాజ్, నారాయణస్వామి, మునివెంకటప్ప, బి.జి.మూర్తి పాల్గొన్నారు.

గ్రామస్థులకు నిత్యావసరాలు సాయం



నిత్యావసరాలను అందజేస్తున్న దృశ్యం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని ఇరుళ పట్టి గ్రామస్థులకు బీజేపీ ఎస్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి పాపణ్ణ సోమవారం సంక్షేమ ఫలాలను అందజేశారు. బొమ్మతత్తనూరు గ్రామ పంచాయతీలోని ఇరుళపట్టి గ్రామస్థులు ఆర్థికంగా వెనుకబడడంతో పాటు, గ్రామంలో మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. గ్రామానికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇరుళపట్టి గ్రామస్థులు తమ పిల్లలను చదివించలేకపోతున్నామని కొద్ది రోజుల క్రితం ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన ప్రజా ప్రతినిధులు ఇరుళపట్టి గ్రామానికెళ్లి పరిశీలించారు. గ్రామానికి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం బీజేపీ ఎస్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి పాపణ్ణ ఇరుళర్‌లకు తన వంతు సాయంగా నిత్యావసర వస్తువులు అందజేశారు.

పాదయాత్ర ముగింపుపై సంబరాలు



కెలమంగలం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రారంభించిన భారత్ జోడో పాదయాత్ర జమ్ముకశ్మీర్‌లో ముగింపు సందర్భంగా సోమవారం డెంకణీకోట పాత బస్టాండులో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకొన్నారు. పార్టీ నాయకులు అబ్దుల్ రహమాన్, షాంత్‌బాషా, భర్గత్, నూరుల్లా, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

గవర్నర్ ప్రసంగంతోనే బడ్జెట్!

- తెలంగాణ అసెంబ్లీ, మండలి సమావేశాలపై వీడిన సందిగ్ధం
- బడ్జెట్‌ను ఆమోదించనున్న గవర్నర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై చిక్కుముడి వీడింది. ఉభయ సభలను ఉద్దేశిస్తూ గవర్నర్ చేసే ప్రసంగంతోనే బడ్జెట్ సమావేశాలను ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఏర్పడిన వివాదం హైకోర్టు వరకు వెళ్లినా.. ఇరువర్గాల మధ్య ఒప్పందంతో సద్దుమణిగింది. కోర్టు సూచనల మేరకు.. బడ్జెట్‌ను ఉభయ సభల్లో ప్రవేశపెట్టడానికి గవర్నర్ అనుమతి ఇచ్చేలా, సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ప్రభుత్వం అంగీకరించేలా ఏర్పాటు జరిగింది. రాష్ట్ర బడ్జెట్ 2023–24 సమావేశాలు గవర్నర్ ప్రసంగంతోనే ప్రారంభమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఇరువర్గాల విజ్ఞప్తి మేరకు కోర్టు ఈ పిటిషన్‌లో వాదనలను ముగించింది. బడ్జెట్‌ను ఫిబ్రవరి 3న అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఈ గడువు సమీపిస్తున్నా బడ్జెట్‌కు గవర్నర్ నుంచి ఆమోదం రాలేదు. దీంతో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలపాలంటూ ఈనెల 21వ తేదీనే గవర్నర్‌కు లేఖ రాశామని, ఇప్పటివరకు సమాధానం రాలేదని పేర్కొంది. వెంటనే అనుమతి ఇచ్చేలా రాజ్‌భవన్‌కు ఆదేశాలు జారీచేయాలని కోరింది. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా లంచ్ మోషన్‌లో విచారించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీల ధర్మాసనానికి అడ్వొకేట్ జనరల్(ఏజీ) సోమవారం ఉదయం విజ్ఞప్తి చేశారు. అయితే 'గవర్నర్ విధుల్లో కోర్టు న్యాయసమీక్ష చేయవచ్చా? నోటీసులు ఇవ్వవచ్చా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే ప్రభుత్వం తరఫున వాదన వినిపించారు. గవర్నర్ కారణం లేకుండా బడ్జెట్‌కు ఆమోదం తెలపకపోవడం సరికాదన్నారు. గవర్నర్ కార్యాలయం తరఫున వాదన వినిపించేందుకు సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. భోజన విరామంలో ఇరువర్గాల న్యాయవాదులు చర్చించుకోవాలని సూచించింది. ధర్మాసనం సూచన మేరకు భోజన విరామ సమయంలో న్యాయవాదులు ప్రభుత్వం, రాజ్‌భవన్‌తో మాట్లాడి.. చర్చించుకున్నారు. ఈ వివరాలను కోర్టుకు తెలిపారు. తమ సమస్య పరిష్కారమైందని చెప్పారు. ఈ పిటిషన్‌లో వాదనలను ముగించాలని ఇద్దరు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విచారణ ముగిస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది.



తీర ప్రాంత సంబరం

నరసన్న కల్యాణం

నేటి అర్ధరాత్రి అంతర్వేది లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం

- ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తుల రాక

సాక్షి, అమలాపురం: ఒకవైపు వశిష్ఠ గోదావరి సముద్రంలో కలిసే పవిత్ర ప్రదేశం.. మరోవైపు కనువిందు చేసే కోనసీమ సోయగం.. వీటి నడుమ కొలువుదీరిన మహిమాన్విత వేలుపు అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి. ఏటా మాఘ మాసంలో కన్నుల వైకుంఠంగా జరిగే స్వామివారి కల్యాణోత్సవంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది. స్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణోత్సవం మంగళవారం రాత్రి 12.46 గంటలకు రోహిణీ నక్షత్రయుక్త తులాలగ్న పుష్కరాంశంలో జరగనుంది.

మూడు రోజులు అక్కడే బస

అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవానికి తీరప్రాంత వాసులకు ప్రత్యేక అనుబంధం ఉంది. అంతర్వేది తీర్థంగా పిలిచే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. కుటుంబాలతో వచ్చిన రైతులు, మత్స్యకారులు మూడు రోజుల పాటు అంతర్వేదిలోనే ఉండటం ఆనవాయితీ. ముందు రోజు అభిషేకం చేయించుకుని, స్వామివారి కల్యాణాన్ని వీక్షించి.. అనంతరం సముద్ర స్నానం చేసి, ఎంతో కోలాహలంగా జరిగే స్వామివారి రథోత్సవాన్ని తిలకించి తిరుగు పయనమవుతారు. కల్యాణోత్సవంలో పాల్గొనడం వల్ల తమ పంటలు బాగా పండి, తమ గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నది వారి నమ్మకం.

పటిష్టమైన ఏర్పాట్లు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో కొలువుదీరిన అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్టంగా ఏర్పాట్లు చేస్తోంది. కరోనా ప్రభావం తగ్గడంతో ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు వస్తారన్న అంచనాతో.. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణ క్రతువు, బుధవారం తెల్లవారుజామున సముద్ర స్నానాలు, మధ్యాహ్నం నుంచి రథోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో భక్తుల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేసి, 135 సీసీ కెమెరాలు, వాకీటాకీల ద్వారా పోలీసుల సమన్వయంతో భద్రత కల్పిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు వినియోగిస్తున్నారు. తాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉంచారు. వైద్య బృందాలను, సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్యం నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాలకొల్లు, నరసాపురం, భీమవరం, అమలాపురం, రాజోలు, రాజమహేంద్రవరం, కాకినాడ ఆర్టీసీ డిపోల నుంచి సుమారు 120కి పైగా బస్సులు నడుపుతున్నారు.


అంతర్వేదిలో కొలువై ఉన్న లక్ష్మీ నరసింహస్వామి

తీరప్రాంత వాసుల ఇష్టదైవం



ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలోని తీర ప్రాంత వాసులకు అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి వారు ఇష్టదైవం. కొన్ని కుటుంబాల వారు దశాబ్దాల కాలంగా క్రమం తప్పకుండా స్వామి వారి కల్యాణోత్సవానికి రావడం ఆనవాయితీ. కరోనా సమయంలో కూడా వారు ఆగలేదు.

– రంగాచార్యులు, స్థానాచార్యులు, అంతర్వేది దేవస్థానం

ఇక హార్ట్‌ఫుల్‌గా సర్జరీలు

విజయవాడ జీజీహెచ్‌లో గుండె ఆపరేషన్లు రెగ్యులర్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు

- అందుబాటులో ముగ్గురు కార్డియోథొరాసిక్ సర్జన్లు
- అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, పోస్ట్ ఆపరేటివ్ కేర్ వార్డు
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి గుండె వైద్యం



లబ్బీపేట (విజయవాడ తూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో పూర్తిస్థాయి గుండె వైద్యం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే అంతర్జాతీయ ప్రమాణాలతో కార్డియాలజీ సేవలు అందిస్తుండగా.. ఫిబ్రవరి మొదటి వారం నుంచి కార్డియోథొరాసిక్ (గుండె సర్జరీలు) కూడా చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గుండె సర్జరీలకు అవసరమైన పరికరాలు, నిపుణులైన సిబ్బందిని అందుబాటులోకి తీసుకువచ్చారు. గత ఏడాది మార్చిలో ఒక గుండె సర్జరీని ప్రయోగాత్మకంగా నిర్వహించినప్పటికీ అనంతరం నిలిచిపోయాయి. ఈసారి రెగ్యులర్‌గా సర్జరీలు చేసేలా పక్కా ఏర్పాట్లు చేశారు.

ఆధునిక ఆపరేషన్ థియేటర్

కార్పొరేట్ ఆస్పత్రిలో కూడా లేనివిధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ విజయవాడ జీజీహెచ్‌లో అందుబాటులో ఉంది. సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని ఐదో అంతస్తులో కార్డియోథొరాసిక్ సర్జరీ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. గుండె సర్జరీలు నిర్వహించేందుకు అవసరమైన చిన్న చిన్న ఎక్విప్‌మెంట్ సైతం సమకూర్చారు. ఆపరేషన్ సమయంలో ఇన్‌ఫెక్షన్లు సోకకుండా లామినర్ ఫ్లోరింగ్‌తో పాటు, మాడ్యులర్స్‌ను ఏర్పాటు చేశారు. సర్జరీ అనంతరం రోగి చికిత్స పొందేందుకు ఆధునిక సౌకర్యాలతో పోస్ట్ ఆపరేటివ్ కేర్ వార్డులను సిద్ధం చేశారు. ఇందులో వెంటిలేటర్స్‌తో పాటు, మానిటర్స్ కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో ముగ్గురు కార్డియోథోరాసిక్ సర్జన్లు అందుబాటులో ఉన్నారు.


అత్యాధునిక గుండె సర్జరీలు నిర్వహించే ఆపరేషన్ థియేటర్

వారిలో ఒకరు అసోసియేట్ ప్రొఫెసర్ కాగా.. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరితోపాటు ఆపరేషన్ థియేటర్‌లో సహాయకులుగా అనుభవం కలిగిన వారిని నియమించారు. పోస్ట్ ఆపరేటివ్ వార్డులో సేవలందించేందుకు ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ సిబ్బందితో పాటు అవసరమైతే, గతంలో గుండె సర్జరీలు చేసిన చోట విధులు నిర్వహించిన సిబ్బంది సేవలను ఉపయోగించుకోనున్నారు.


సర్జరీ తర్వాత సేవలందించేందుకు పోస్టు ఆపరేటివ్ వార్డు

వారంలో ప్రారంభిస్తాం



ఫిబ్రవరి మొదటి వారం నుంచి రెగ్యులర్‌గా గుండె శస్త్ర చికిత్సలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌లతో పాటు, ముగ్గురు వైద్యులు అందుబాటులో ఉన్నారు. గుండె సర్జరీలకు అవసరమైన చిన్న పరికరాలు కూడా కొనుగోలు చేశాం. ఆపరేషన్ థియేటర్, పోస్ట్ ఆపరేటివ్ వార్డుల్లో విధులు నిర్వహించేందుకు నిపుణులైన సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఇక మీదట పూర్తిస్థాయి గుండె వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు రానున్నాం.

– డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్, జీజీహెచ్, విజయవాడ.

ఇప్పటికే అత్యుత్తమ గుండె వైద్యం

ప్రభుత్వాస్పత్రిలో ఇప్పటికే అత్యుత్తమ గుండె వైద్యం అందిస్తున్నారు. ప్రతిరోజూ 250 మంది వరకూ ఓపీ సేవలు పొందుతుండగా.. యాంజియోగ్రామ్స్, యాంజియోప్లాస్టీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ 1,500 వరకూ యాంజియోప్లాస్టీలు నిర్వహించగా.. 10 వేల వరకూ యాంజియోగ్రామ్‌లు వంద శాతం సక్సెస్ రేటుతో నిర్వహించారు. కాల్షియం బ్లాక్స్‌కు స్టెంట్ వేయడం, ఎమర్జెన్సీ యాంజియోప్లాస్టీలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వాస్పత్రిలో గుండె వైద్య సేవలకు మంచి ఆదరణ లభించింది. ఇప్పటివరకూ యాంజియోగ్రామ్ చేసిన తర్వాత స్టెంట్‌లు అవసరమైన వారికి ఇక్కడ వేస్తున్నారు. ఆపరేషన్ చేయాల్సి వస్తే ఇతర ఆస్పత్రులకు తరలి వెళ్తున్నారు. ఇక మీదట సర్జరీలు అవసరమైన వారికి కూడా ఇక్కడే చేసే అవకాశం అందుబాటులోకి రానుండటంతో రోగులకు పూర్తిస్థాయి గుండె వైద్య సేవలు ప్రభుత్వాస్పత్రిలో అందనున్నాయి.

మార్చిలోగా 4 వేల ఫిష్ అవుట్‌లెట్లు

▶ మొదటి పేజీ తరువాయి

వంటి అంశాల్లో కమిటీ తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే వాటిలో స్థానిక వినియోగం కనీసం 30 శాతం పెంచేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఒడిశాలో ఆక్వా ఉత్పత్తులు స్థానిక అవసరాలకు సరిపోతున్నాయని, అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి లేదని తెలిపారు. దీనివల్ల మార్కెట్ ఒడిదొడుకుల సమయంలో రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ మార్కెట్ అవకాశాలు మెరుగు పడతాయన్నారు. స్థానిక వినియోగం పెంచడంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఫిష్ అవుట్‌లెట్లకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద సబ్సిడీతో కూడిన రుణాలిచ్చేందుకు కేంద్రం అంగీకరించిందన్నారు. పొరుగు రాష్ట్రాల్లో కూడా ఆక్వా హబ్‌ల ద్వారా మన ఉత్పత్తులు విక్రయించాలని చెప్పారు. ప్రముఖ నగరాల్లో ఆక్వా ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించాలన్నారు.

నియంత్రణలో ఫీడ్, సీడ్ రేట్లు

సీడ్ తయారీదారులు, ప్రాసెసింగ్ యూనిట్లతో జరుపుతున్న చర్చల ఫలితంగా సీడ్, ఫీడ్ ధరలు నియంత్రణలోకి వచ్చాయని, ఆక్వా ఉత్పత్తుల ధరలు పతనం కాకుండా అడ్డుకట్ట వేయగలిగామని మంత్రులు పేర్కొన్నారు. రైతుల్లోనూ అంతర్జాతీయ మార్కెట్లు, ధరలపై అవగాహన కల్పించి, హేతుబద్ధమైన విస్తీర్ణంలోనే సాగు చేసేలా చూడాలన్నారు. డిమాండ్, సప్లైపై అవగాహన లేకపోతే అంతిమంగా రైతులే నష్టపోతారన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదునూ త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు.

వచ్చే నెలాఖరుకు జోనింగ్ సర్వే పూర్తి

ఆక్వా జోన్ పరిధిలో 10 ఎకరాల లోపు సాగు చేసే వారికి ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీని అందిస్తోందని మంత్రులు చెప్పారు. ఇప్పటికే 26 వేల కనెక్షన్లకు ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. ఆక్వాజోన్, నాన్ ఆక్వా జోన్ పరిధిలో సాగయ్యే విస్తీర్ణాన్ని గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వే వచ్చే నెలాఖరుకి పూర్తవుతుందన్నారు. సర్వేలో ఆధార్‌తో రైతుల వివరాలు అనుసంధానం చేస్తున్నారని, దీనివల్ల అర్హులైన రైతులు ఎంతమందో కచ్చితంగా తెలుతుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఆక్వా రైతుకు విద్యుత్ సబ్సిడీ అందించాలని సీఎం వైఎస్ జగన్ నిర్దేశించారని, ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రులు చెప్పారు. సమావేశంలో అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, మత్స్య శాఖ కమిషనర్ కన్నబాబు, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్ కుమార్, స్పెషల్ సీఎస్ (ఇంధనశాఖ) కె.విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు యాంత్రీకరణ దన్ను


కరప మండలం గురజానాపల్లిలో సబ్సిడీపై ట్రాక్టర్‌ను అందిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు.

- జిల్లాలో రైతులకు 118 ట్రాక్టర్లు పంపిణీ
- రైతుల ఖాతాలో రూ.3.38 కోట్ల సబ్సిడీ
- మరో 80 ట్రాక్టర్ల పంపిణీ చర్యలు
- ప్రతీ మండలానికి సబ్సిడీ యంత్రాలు
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న వ్యవసాయశాఖ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఆరుగాలం శ్రమించి పండించే రైతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. విత్తనాలు మొదలు వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల వరకూ చేదోడు వాదోడుగా ఉంటోంది. అవసరమైన అన్ని రకాల సేవలను రైతు భరోసా కేంద్రాలు ద్వారా సమకూర్చుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో రైతులు విత్తనాలు..ఎరువుల కోసం సమీపంలోని పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేంది. వ్యయప్రయాసలులోను కావల్సి వచ్చేంది. ఏదో బాధ పడి కొనుగోలు చేసిన నకిలీల బెడద వెంటాడి నష్టాల పాల్జేసేది. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చాక రైతులకు ఈ కష్టాలు తప్పాయి. జిల్లాలో అత్యధికంగా రైతులు వరి పండిస్తారు. సహజంగానే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే ఈ జిల్లాలో కూలీల కొరతతో ఏటా రైతాంగం సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు ఈ విషయంలో పెద్ద మేలు చేసింది.

ఆర్బీకేలో దరఖాస్తు చేస్తే చాలు

ఆర్‌బీకేల ద్వారా యంత్రపరికరాలను రైతులకు అందుబాటులో ఉంచుతోంది. గ్రూపులుగా ఏర్పడిన రైతులకు తొలిదశలో 40 శాతం సబ్సిడీతో ట్రాక్టర్లను అందజేసింది. తద్వారా సాగులో ఖర్చు తగ్గించి ప్రయోజనం చేకూర్చింది. వారి సేద్యానికి భరోసా కల్పించింది. టీడీపీ హయాంలో సిఫారసులు ఉన్న వారికే ఈ సబ్సిడీ యంత్రాలు అందించే వారు. నాయకులు సిఫారసు లేఖ ఉన్న వారికే జన్మభూమి కమిటీలు యంత్రాలు మంజూరు చేసేవి. బినామీల పేరుతో టీడీపీ నాయకులే ఈ సబ్సిడీ యంత్రాలు కొట్టేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా చేసుకుని సబ్సిడీ యంత్రాలను మంజూరు చేస్తున్నారు. సంబంధిత ఆర్‌బీకే పరిధిలో రైతులు యంత్రాలు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటే చాలు. మిగిలిన ప్రక్రియ సిబ్బంది చూసుకుంటున్నారు. ఎటువంటి సిఫారసులు లేకుండానే యంత్రాలు అందుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకూ 118 ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఒక్కొక్క ట్రాక్టర్ విలువ సుమారు రూ.6లక్షల నుంచి రూ.9 లక్షలు ఉంటుంది. రైతులకు ఇప్పటి వరకూ రూ 3. 38 కోట్లు సబ్సిడీ కింద రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సీజన్‌లో అర్హులైన వారు ఇప్పటికే ఆర్‌బీకేలో 80మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి త్వరలో ట్రాక్టర్లు పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రతీ మండలానికి డ్రోన్‌లు పంపిణీ

మందులు పిచికారి చేసేందుకు ప్రస్తుతం డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు వీటిని కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. డ్రోన్లను 40 శాతం సబ్సిడీపై రైతులకు అందించనుంది. పురుగుమందులు పిచికారి చేసే సమయంలో రైతులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. డ్రోన్ల ద్వారా పురుగుమందులు పిచికారి చేస్తే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావు.

అర్హత ఉంటే యంత్ర పరికరాలు



వ్యక్తిగత వ్యవసాయ యంత్ర పరికరాలతో పాటు గ్రూపులుగా ఏర్పాటైన వారికి వ్యవసాయకోత యంత్రాలు, ట్రాక్టర్లు అందిస్తాం. దరఖాస్తులు అన్ని పరిశీలించి అర్హత ఉంటే ఆయా గ్రూపు సభ్యులతో చర్చించి ట్రాక్టర్లు అందిస్తున్నాం.

– ఎన్ విజయ్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ

వజ్రాల భూముల్లో 'పసిడి' పంటలు

కర్నూలు జిల్లా పగిడిరాయి-జొన్నగిరి గ్రామాల మధ్య బంగారు గని

- 597.82 హెక్టార్లలో బంగారం వెలికితీత చేపట్టిన జియో మైసూర్ సంస్థ
- రూ.300 కోట్లతో ప్రాజెక్టు
- తొలి విడతలో ఏడాదికి 750 కిలోల ఉత్పత్తి లక్ష్యం
- పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభమైన బంగారం వెలికితీత
- వచ్చే ఏడాది తొలి త్రైమాసికానికి పూర్తిస్థాయి ఉత్పత్తి
- స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఖజానాకు భారీ ఆదాయం


బంగారం వెలికితీతకు పగిడిరాయి-జొన్నగిరి గ్రామాల మధ్య ఏర్పాటు చేస్తున్న బాల్‌మిల్

తొలకరి వర్షాలతో అక్కడి ప్రజల ఆశలు చిగురిస్తాయి.. లేలేత సూర్య కిరణాలు పడినచోట వజ్రాలు తళుక్కున మెరుస్తాయి.. నిరుపేదలను సైతం అదృష్టం అప్పటికప్పుడే లక్షాధికారుల్ని చేస్తుంది.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంత పొలాల్లో ఏటా వర్షాకాలం ఆరంభంలో వజ్రాల వేట సాగుతూనే ఉంటుంది. వేలాది మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తెల్లవారుజామునే పొలాలకు చేరుకుని సూర్యోదయం నుంచి రాళ్లు, రప్పలు శోధిస్తుంటారు. వారిలో కొద్దిమందికే వజ్రాల రాళ్లు దొరుకుతాయి. అదే ప్రాంతం ఇప్పుడు బంగారు నిక్షేపాల అన్వేషణకు నిలయమైంది.

బీవీ రాఘవరెడ్డి: బంగారు గనుల పేరు చెబితే గుర్తొచ్చేది కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్). అలాంటి గనులు ఏపీలోని కర్నూలు జిల్లాలోనూ ఉన్నాయి. తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో బంగారం నిక్షేపాలను వెలికి తీసేందుకు జియో మైసూర్ సంస్థ ఇప్పటికే శ్రీకారం చుట్టింది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో నెలకొల్పిన ఈ తొలి గని నుంచి మొదటి విడతలో ఏడాదికి 750 కిలోల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ ప్రాంతంలో వివిధ కంపెనీలు 40 ఏళ్లపాటు పరిశోధనలు సాగించగా.. భూగర్భంలో బంగారం నిక్షేపాలు ఉన్నట్టు వెల్లడైంది. అయితే, వెలికితీత, ప్రాసెసింగ్ వ్యయం అధికంగా ఉంటుందన్న కారణంతో చాలామంది ముందుకు రాలేదు. కొన్ని సంవత్సరాలుగా బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుండంతో ఎంత ఖర్చయినా వెలికితీయవచ్చన్న ధీమాతో జియో మైసూర్ సంస్థ ముందుకొచ్చి పనులను శరవేగంగా సాగిస్తోంది. పైలట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే ఇక్కడ బంగారు ఖనిజం ప్రాసెసింగ్‌ను ప్రారంభించగా.. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తిస్థాయి ఉత్పత్తి చేపట్టనున్నారు.

597.82 హెక్టార్లలో బంగారం నిక్షేపాలు

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి, పగిడిరాయి, బొల్లవానిపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో బంగారు నిక్షేపాల కోసం 40 ఏళ్లుగా పలు కంపెనీలు సర్వేలు చేశాయి. 1994లో జీఎస్ఐ (జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) సర్వే నిర్వహించి ఇక్కడ బంగారు గనులు ఉన్నట్టు నిర్ధారించింది. అప్పట్లో బంగారం మార్కెట్ ధరలతో పోలిస్తే.. వెలికితీత, శుద్ధి చేసేందుకు అయ్యే వ్యయం అధికంగా ఉంటుందన్న కారణంతో ఆయా సంస్థలు వెనుకంజ వేశాయి. భారత ప్రభుత్వం మైనింగ్‌లో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించిన తర్వాత 2005లో ఆస్ట్రేలియన్ ఇండియన్ రిసోర్సెస్ లిమిటెడ్ (ఏఐఆర్ఎల్) గ్రూపునకు చెందిన జియో మైసూర్ సర్వీసెస్ సంస్థ దరఖాస్తు చేసుకుంది. 597.82 హెక్టార్లలో బంగారం నిక్షేపాలు ఉన్నట్టు గుర్తించిన ఆ సంస్థ 2013లో నిక్షేపాల వెలికితీతకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందింది. ఇప్పటికే ఎకరా రూ.12 లక్షల చొప్పున 80 ఎకరాల వరకు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. మార్చి నెలాఖరులోపు మొత్తం 250 ఎకరాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కానుంది.

మూడేళ్లుగా పనులు వేగవంతం

బంగారం నిక్షేపాల వెలికితీతకు ప్రభుత్వం నుంచి 2013లోనే జియో మైసూర్ సంస్థ అనుమతులు పొందినా పనులు సాగేందుకు పలు ఆటంకాలు ఏర్పడ్డాయి. గత టీడీపీ ప్రభుత్వం నిక్షేపాల వెలికితీతకు ఏ మాత్రం చొరవ చూపలేదు. కంపెనీలో షేర్ కావాలని, గుడ్‌విల్ కావాలని ముఖ్య నేతలు డిమాండ్ చేసినట్టు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో వెలికితీత పనులు ప్రారంభం కాలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడేళ్ల నుంచి పనులు కొలిక్కి వచ్చాయి. కంపెనీ ప్రొడక్షన్ ప్రాసెస్ యూనిట్ ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేసింది. ఇప్పటికే దక్షిణాఫ్రికా, చైనా నుంచి మెషినరీని సైతం దిగుమతి చేసుకుంది. క్రషర్లు, గ్రౌండింగ్ యూనిట్లు దేశీయంగా కొనుగోలు చేశారు. 2024 మొదటి త్రైమాసికంలో పూర్తిస్థాయిలో బంగారం ఉత్పత్తి ప్రారంభం కానుంది. రూ.300 కోట్లతో ప్రాజెక్టు ఈ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. దీనిద్వారా ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సాధారణంగా ఓపెన్ కాస్ట్ మైనింగ్ 10 ఏళ్లపాటు ఉంటుంది. అంతా సవ్యంగా జరిగితే 25 ఏళ్ల వరకు కొనసాగవచ్చు.

మైనింగ్ కంపెనీ ఏర్పాటుతో అభివృద్ధి



40 ఏళ్ల నిరీక్షణ ఫలిస్తోంది. ఇక్కడ బంగారం ఉందని కొన్నేళ్లుగా చెప్పుకుంటున్నా పనులు మాత్రం చేయలేదు. ఇప్పుడిప్పుడే కంపెనీ మైనింగ్ పనులను ప్రారంభించడంతో ఈ ప్రాంత ప్రజల ఆశలు చిగురిస్తున్నాయి. ఉపాధితో పాటు ఈ గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నాం.

– ప్రభాకరరెడ్డి, పగిడిరాయి

వేగంగా ప్లాంటు నిర్మాణం



గోల్డ్‌మైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. పైలట్ ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభమైంది. ఏప్రిల్ నుంచి ప్రధాన ప్లాంట్ నిర్మాణం జరగనుంది. సౌతాఫ్రికా, చైనా నుంచి కొన్ని మెషిన్లు వచ్చాయి. ఆస్ట్రేలియా నుంచి కొన్ని రావాల్సి ఉంది. ఫిబ్రవరి 15 నుంచి పైలట్ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి ప్రారంభించి, వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభిస్తాం. తొలి విడతలో ఏడాదికి 750 కిలోల బంగారం ఉత్పత్తి చేసేలా పనులు జరుగుతున్నాయి.

– హనుమ ప్రసాద్, సీఈవో, జియో మైసూర్

తొలి విడతలో ఏడాదికి 750 కిలోలు

ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు కింద రోజుకు 20 టన్నుల మట్టి తవ్వి ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఇందులో 40నుంచి 50 గ్రాముల బంగారం ఉత్పత్తి అవుతోంది. ఫిబ్రవరి 15 నుంచి పైలట్ ప్రాజెక్టులో రెగ్యులర్‌గా ఉత్పత్తి జరగనుంది. ప్రధాన ప్లాంటు ప్రారంభించిన తర్వాత తొలిదశలో ఏడాదికి 750 కిలోల బంగారం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత సామర్థ్యాన్ని పెంచనున్నారు. ప్రస్తుతం 'డోరేబార్' (క్రషింగ్ తర్వాత లోహాన్ని 300 డిగ్రీల వద్ద వేడి చేసి కరిగించడం) చేస్తున్నారు. తద్వా వచ్చిన లోహాన్ని రిఫైనరీలకు ఇస్తారు. రిఫైనరీలో దానిని 99.99 శాతం మేలిమి బంగారంగా తీర్చిదిద్ది చేసి మార్కెట్‌లో విక్రయిస్తారు.


ప్లాంట్ ఏర్పాటుకు తీసుకొచ్చిన క్రషర్

రాష్ట్ర ప్రభుత్వానికి 4.6 శాతం పన్నులు

బంగారు ఉత్పత్తి చేసే కంపెనీ మొదట రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ, డీఎంఎఫ్(డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) కలిపి ఉత్పత్తిలో 4.6 శాతం చెల్లించాలి. అలాగే కేంద్ర ప్రభుత్వానికి ఎన్ఎంఈటీ (నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ ట్రస్ట్)కు 0.5 శాతం చెల్లించాలి. డోరేబార్ నుంచి బంగారం మేలిమిగా మారిన తర్వాత 25–30 శాతం కేంద్ర ప్రభుత్వానికి ట్యాక్స్‌లు చెల్లించాలి. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ అదనంగా చెల్లించాలి.

తొలి గోల్డ్ మైన్ కేజీఎఫ్

మన దేశంలో 1885లో కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్) మైన్‌ను ప్రారంభించారు. ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వ హయాంలోనే 1945లో రాయచూర్‌లోని 'హట్టిమైన్స్' మొదలైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటివరకూ దేశంలో ఎక్కడా గోల్డ్ మైనింగ్ చేపట్టలేదు. ఇప్పుడు జియో మైసూర్ సంస్థ చేసే ఉత్పత్తే తొలి మైనింగ్.

'కూతుర్ని ఎవరికో అమ్మేసింది.
ఏ తప్పుడు పనుల్లోనో పెట్టింది'...
భర్త చనిపోయిన సావిత్రి
తన కూతుర్ని పొరుగూరి స్కూల్లో చేర్చాక
ఊరి ఆడవాళ్ల నుంచి ఎదుర్కొన్న నింద అది.
'ఏమైనా సరే నా కూతురు క్రికెట్ ఆడాలి' అనుకుంది సావిత్రి.
అందుకే ఘోరమైన పేదరికంలో కూడా
కూతురి కలలకు అండగా నిలబడింది.
ఇవాళ ఆ కూతురు- అర్చనా దేవి ప్రపంచ విజేతగా నిలిచింది.
'అండర్- 19' క్రికెట్ జట్టులో బౌలర్‌గా, ఫీల్డర్‌గా రాణించి
ఫైనల్స్ గెలవడంలో కీలకంగా మారింది.
ఆడపిల్లల ఆకాంక్షలకు ఎన్ని అవరోధాలు ఉన్నా
తల్లి గట్టిగా నిలబడితే కొండంత బలం అని
తల్లులకు ఈ స్ఫూర్తిగాథ సందేశం ఇస్తోంది.


తల్లి సావిత్రీ దేవితో అర్చన

● తల్లికి వందనం

నిందలు పడి కూతుర్ని విజేతను చేసింది

సౌత్ ఆఫ్రికాలో అండర్ 19 టి 20 మహిళా ప్రపంచ కప్. 16 దేశాలు తలపడ్డాయి. మన అమ్మాయిలు కప్ సాధించారు. మొత్తం 16 మంది టీమ్. ఒక్కొక్కరు శివంగిలా మారి అన్ని జట్లతో తలపడ్డారు. ఫైనల్స్‌లో ఇంగ్లాండ్‌ను అతి తక్కువ స్కోర్ (68) వద్ద కట్టడి చేసి 14 ఓవర్లకే మూడు వికెట్ల నష్టానికి విజయం సాధించారు. ఇంగ్లాండ్ జట్టును బౌలర్లు హడలగొట్టారు. వారిలో టిటాస్ సాధు, పార్శవి కాకుండా మూడో బౌలర్ ఉంది. అర్చనా దేవి. కీలకమైన రెండు వికెట్లు పడగొట్టడమే కాకుండా ఒక అద్భుతమైన క్యాచ్ పట్టి మూడవ వికెట్ పడేందుకు కారణమైంది. వరల్డ్ కప్‌లో ప్రతి ఒక్కరిదీ ఒక విజయగాథే అయినా అర్చనా దేవిది భిన్నమైనది.


● ఇంగ్లాండ్‌తో ఫైనల్స్‌లో అర్చన క్యాచ్


● ప్రపంచ విజేత మన జట్టు

కష్టాలను తట్టుకుని

అర్చనా దేవి (18) సొంత ఊరు ఉత్తరప్రదేశ్ ఉన్నావ్ జిల్లాలోని రతై పూర్వ. గంగానది ఒడ్డునే వీరి పొలం. ఊరు. వరదలతో ఆ పొలం సంవత్సరంలో సగం రోజులు మునకలో ఉండేది. మిగిలిన సగం రోజుల్లో తండ్రి శివరామ్ వ్యవసాయం సాగించేవాడు. కాని ఆయనను 2008లో కేన్సర్ కబళించింది. దాంతో ఊళ్లో ఆడవాళ్లందరూ అర్చనా తల్లి సావిత్రిదేవిని నష్ట జాతకురాలిగా పరిగణించసాగారు. సావిత్రి వెరవలేదు. ఇద్దరు కొడుకులను, కూతురైన అర్చనను రెక్కల కింద పెట్టుకుని సాకసాగింది. దురదృష్టం... ఆఖరు కొడుకు బుద్ధిమాన్ కూడా మరణించాడు. దాంతో సావిత్రిని చూస్తే చాలు ఊరు దడుచుకునేది. 'ఇదో మంత్రగత్తె. మొదట భర్తను మింగింది. తర్వాత కొడుకును' అని... ఎదురుపడితే పక్కకు తప్పుకునేవారు. సావిత్రి దేవి ఇంకా రాటు దేలింది. పిల్లల కోసం ఎలాగైనా బతకాలనుకుంది.

కూతురి క్రికెట్

అర్చనకు క్రికెట్ పై ఆసక్తి, పట్టు కూడా సోదరుడు బుద్ధిమాన్ వల్ల వచ్చినవే. అతను అర్చనను వెంటబెట్టుకుని పొలాల్లో క్రికెట్ ఆడేవాడు. తోడుగా అర్చన బ్యాటు ఝళిపించేది. అర్చన టాలెంట్‌ను బుద్ధిమాన్ వెంటనే గమనించాడు. 'నువ్వు క్రికెటర్‌వి కావాలి' అనేవాడు. అర్చన ఆశలు పెట్టుకుంది కాని తల్లి పెద్దగా పట్టించుకోలేదు. ఒకరోజు బుద్ధిమాన్ బాల్‌ని కొడితే అది దూరంగా చెత్తలో పడింది. వెళ్లి చేతులతో చెత్తను కదిలిస్తూ ఉంటే పాము కరిచింది. తల్లి పరిగెత్తుకుంటూ వచ్చి ఆటోలో ఆస్పత్రికి తీసుకెళుతుంటే కొన ఊపిరితో ఉన్న బుద్ధిమాన్ 'అర్చనను క్రికెట్ మాన్పించవద్దు' అని చెప్పి మరణించాడు. ఆ రోజు సావిత్రి సంకల్పించుకుంది ఎలాగైనా అర్చనను క్రికెటర్ చేయాలని.

స్కూల్‌లో చేర్చి

అర్చన క్రికెట్ కొనసాగాలంటే చదువును, ఆటలను నేర్పించే స్కూల్లో చేర్పించాలని సావిత్రి నిశ్చయించుకుంది. తమ పల్లెకు 20 కిలోమీటర్ల దూరంలో ఉండే గంజ్ మొరాదాబాద్‌లోని గర్ల్స్ బోర్డింగ్ స్కూల్‌లో చేర్పించింది. వాళ్లుండే పల్లె నుంచి అలా మరో ఊరి బోర్డింగ్ స్కూల్‌లో ఏ ఆడపిల్లా చేరలేదు. అందుకని ఊరి ఆడవాళ్లు సావిత్రిని అనుమానించారు. కూతుర్ని ఎవరికో మంచి బేరానికి అమ్మేసి ఉంటుందని అనేవారు. చెడ్డ పనుల కోసం ఊరు దాటించింది అనేవారు. అవన్నీ సావిత్రీదేవి నిశ్శబ్దంగా భరించింది. కొడుకును ఢిల్లీలో బట్టల ఫ్యాక్టరీలో పనికి పెట్టి తమకున్న ఒక ఆవు, ఒక బర్రె పాల మీద ఆధారపడి కూతురి ఖర్చులను అతి కష్టం మీద చూసేది. 'నేను ఉన్నాను' అని అర్చనకు ధైర్యం చెప్పేది.

దశ తిరిగింది

బోర్డింగ్ స్కూల్లోని ఒక టీచరు అర్చన ప్రతిభను గమనించి కాన్పూరులో ఉండే కోచ్ కపిల్ పాండే దృష్టికి తీసుకెళ్లింది. ఆ టీచరు తీసిన అర్చన బౌలింగ్ వీడియోలు చూసిన కపిల్ పాండే వెంటనే కాన్పూరుకు పిలిపించి అక్కడి క్రికెట్ అసోసియేషన్‌లో జాయిన్ చేసి తన శిష్యురాలిగా తీసుకున్నాడు. కపిల్ పాండే క్రికెటర్ కుల్‌దీప్ యాదవ్‌కు కూడా కోచ్ కావడంతో కుల్‌దీప్ యాదవ్ అర్చనను ప్రోత్సహించాడు. ఆమె శిక్షణకు సాయం అందించాడు.

అతిథులయ్యారు

'ఒకప్పుడు మా ఇంట నీళ్లు కూడా ఎవరూ తాగలేదు. ఇవాళ అందరూ అతిథులుగా వచ్చి మీ దశ తిరిగింది అని భోజనం చేస్తున్నారు' అంది అర్చన తల్లి సావిత్రి. వాళ్ల ఊరిలో ఆ కుటుంబం ఇప్పుడు సగర్వంగా నిలబడింది. తల్లి తన కూతురి ద్వారా అలా నిలబెట్టుకుంది. ఆ తల్లీకూతుళ్లను చూసి ఊరు మురిసిపోతోందిగాని అది ఎన్నో ఎదురీతల ఫలితం. ఎవరో అన్నట్టు... అపజయాల ఆవల విజయ తీరం ఉంటుంది.

అర్చన విజయానికి తెడ్డు వేసిన నావ- ఆ తల్లి సావిత్రీ దేవి. అందుకే అర్చన విజయంలో సగం ఆ తల్లిదే ●

'లక్ష్యాన్ని గెలిచే మహత్తర శక్తి ఎక్కడో లేదు. నీ దగ్గరే ఉంది.
చీకటిని పారదోలే వెలుగురేఖలు ఎక్కడో లేవు. నీ దగ్గరే ఉన్నాయి.
ఆత్మగౌరవం ఉన్నవారి దగ్గర ఆత్మబలం ఉంటుంది.
ఆ బలమే వజ్రాయుధమై అనేక విజయాలు సాధించేలా చేస్తుంది'
అంటోంది'యాన్ ఇండియన్ గర్ల్' షార్ట్‌ఫిల్మ్.



ఆత్మబలమే అందమై ఆయుధమై..

'యాన్ ఇండియన్ గర్ల్' అనే షార్ట్ ఫిల్మ్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది ప్రియాంక ఖురానా గోయల్. సౌరభ్ లక్ష్యక్ రచన, దర్శకత్వం వహించిన పదకొండు నిమిషాల నిడివిగల 'యాన్ ఇండియన్ గర్ల్' జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 31 అవార్డ్‌లు గెలుచుకుంది. నలుగురు అమ్మాయిల జీవనపోరాటాన్ని కళ్లకు కట్టేలా ఉంటుంది ఈ లఘుచిత్రం. ఆ నలుగురు అమ్మాయిల పాత్రను ప్రియాంకే పోషించింది. ఎన్నో చిత్రోత్సవాలలో 'ఉత్తమ నటి' అవార్డ్ అందుకుంది ప్రియాంక.


ప్రియాంక ఖురానా గోయల్

'ఒక మహిళ విజయం సాధించాలంటే తనపై తనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. సవాళ్లు ఎదురైతే వెనకడుగు వేయని ధైర్యం ఉండాలి. ఎవరి ముందు తలవంచని ఆత్మగౌరవం ఉండాలి' అనే సందేశాన్ని ఇచ్చే చిత్రం ఇది.

'ఈ చిత్రంలో భాగం అయినందుకు సంతోషంగా ఉంది. గృహిణి నుంచి ఉద్యోగం చేస్తున్న మహిళ వరకు అందరికీ సంబంధించిన చిత్రం. తమను తాము చూసుకునే చిత్రం. మహిళలకు వివిధ రంగాలు లేదా అభిరుచికి సంబంధించిన విషయాల్లో ఎంపికలో స్వేచ్ఛ ఉండాలి' అంటుంది ప్రియాంక.

'వివాహం తరువాత కూడా మహిళలు విజయాలు సాధించగలరు' అనే వాస్తవాన్ని నొక్కి చెప్పే వీఆర్‌పి ఎంటర్‌టైన్‌మెంట్ ఈ లఘుచిత్రాన్ని నిర్మించింది. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుంది వీఆర్‌పి ఎంటర్‌టైన్‌మెంట్.

తాజా విషయానికి వస్తే...

'యాన్ ఇండియన్ గర్ల్' ఇప్పుడు ఓటీటీ వేదిక(డిస్నీ ప్లస్ హాట్‌స్టార్)కు వస్తోంది. మరింత మంది ప్రేక్షకులకు చేరువకానుంది. ●

హృదయానికి దగ్గరైన మాట... స్త్రీ సాధికారత

ఢిల్లీలో పుట్టిపెరిగిన ప్రియాంక ఖురానా గోయల్ ఐఐఎం. కోల్‌కత్తాలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఫ్యాషన్ అండ్ మోడలింగ్ రంగంలోకి రావడానికి ముందు ఒక సెక్యూరిటీ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసింది. 'మిసెస్ ఎర్త్' టైటిల్ 2015లో గెలుచుకుంది. 20 దేశాల నుంచి మహిళలు పాల్గొన్న ఈ పోటీలో తెలివితేటలు, అందం, సామాజికసేవ ఆధారంగా విజేతను ఎంపిక చేస్తారు. ఈ టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా గుర్తింపు పొందింది ప్రియాంక. ఆ తరువాత 'మిసెస్ ఇండియా క్వీన్' టైటిల్ గెలుచుకుంది. మోడలింగ్ రంగంలో రాణించిన ప్రియాంక 'యాన్ ఇండియన్ గర్ల్'తో నటనలో తొలి అడుగులు వేసింది.

తొలిచిత్రంతోనే అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తెచ్చుకుంది. మోడల్‌గా, ఒక బిడ్డకు తల్లిగా, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా, నటిగా తనను నిరూపించుకుంటున్న ప్రియాంకను 'మీ విజయ రహస్యం ఏమిటీ?' అని అడిగితే 'అన్ని పనులను సమన్వయం చేసుకోవడం. ప్రణాళిక ప్రకారం నడుచుకోవడం' అంటుంది.

ప్రియాంక జీవితంలో యోగ ధ్యానం, నృత్యం భాగమైపోయాయి. ఎప్పుడైనా ఒత్తిడిగా అనిపించినప్పుడు నృత్యాన్ని ఆశ్రయిస్తుంది.

'మహిళలకు సరియైన అవకాశాలు లభిస్తే అద్భుతాలు సృష్టించగలరు' అంటున్న ప్రియాంక ఖురానా గోయల్ హృదయానికి చేరువైన మాట... స్త్రీ సాధికారత. అందుకేనేమో, స్త్రీ సాధికారత కేంద్రంగా నిర్మించిన 'యాన్ ఇండియన్ గర్ల్'లో ఆమె అద్భుతంగా నటించి ప్రశంసలు అందుకుంది.

సాగుబడి
శ్రావణ కార్తె
ఫిబ్రవరి 5 వరకు
ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 6 వరకు

విరబూసిన ప్రకృతి సేద్య పద్మాలు



2023 పద్మశ్రీ పురస్కార గ్రహీతల్లో వ్యవసాయంతో సంబంధం ఉన్న వారంతా (ప్రసిద్ధ ఆక్వా శాస్త్రవేత్త డా. విజయ్‌గుప్తా మినహా) దేశీ వంగడాలతో ప్రకృతి, సేంద్రియ తరహా సేద్య పద్ధతులను ప్రాచుర్యంలోకి తెచ్చిన వారే. అంతేకాదు, నెక్రమ్ శర్మ (హిమాచల్ ప్రదేశ్) 9 పంటల మిశ్రమ ప్రకృతి సాగు చేస్తున్నారు. పతయత్ సాహు (ఒడిషా) ఔషధ మొక్కలను సాగు చేస్తూ అయుర్వేద వైద్యం చేస్తున్నారు. చెరువాయల్ రామన్ (కేరళ) దేశీ వరి వంగడాల పరిరక్షణ ఉద్యమకారుడు. తులారామ్ ఉపేతి (సిక్కిం) 80 ఏళ్లుగా వారసత్వ సేంద్రియ సేద్యం చేస్తున్న కురువృద్ధుడు కావటం విశేషం. పురాతన 'అటవీ కృషి' పద్ధతిని పునరుద్ధరించి సిరిధాన్యాలను ప్రాచుర్యంలోకి తెచ్చిన డా. ఖాదర్ వలి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రొద్దుటూరులో జన్మించినా మైసూరులో స్థిరపడినందున కర్ణాటక కోటాలో ఎంపికయ్యారు. వీరి కృషి గురించి రేఖామాత్రంగా...



తొమ్మిది పంటల మిశ్రమ సేద్యం

నెక్రమ్ శర్మ (59).. మంచు కొండల రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్‌లో మండి జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయదారుడు. ఈ ఏడాది ఆ రాష్ట్రం నుంచి పద్మశ్రీకి ఎంపికైంది ఆయనొక్కరే. ప్రభుత్వ ఉద్యోగం కోసం విఫలయత్నం చేసిన ఆయన తదనంతరం సేద్యాన్నే వృత్తిగా ఎంచుకున్నారు. నాలుగున్నర ఎకరాల వారసత్వ భూమిలో 38 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. రసాయనిక వ్యవసాయం వల్ల భూసారం దెబ్బతింటున్నదని గుర్తించి, 22 ఏళ్ల క్రితమే సుభాష్ పాలేకర్ బాటలో ప్రకృతి సేద్యంలోకి మళ్లారు. కనీసం 3 డజన్ల పంటలకు చెందిన దేశీ విత్తనాలను ఆయన పరిరక్షిస్తూ ఇతరులకు స్ఫూర్తినిస్తున్నారు. పది వేల మంది రైతులకు ఆయన ఉచితంగా దేశీయ విత్తనాలు పంచిన ఘనత ఆయనిది.


'నౌ అనజ్' (9 పంటలు) అనే పురాతన ప్రకృతి సేద్య పద్ధతిని శర్మ పునరుద్ధరించారు. పొలంలో కనీసం 9 రకాల పంటలు కలిపి మిశ్రమ సాగు చేస్తున్నారు. తిండి గింజలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, తీగజాతి పంటలను కలిపి ఒకే పొలంలో సాగు చేస్తారు. వానాకాలంలో 9 పంటలు, శీతాకాలంలో మరో 9.. ఏటా 18 పంటలను ఆయన సాగు చేస్తున్నారు. 20 ఏళ్లుగా దేశీ విత్తన పరిరక్షణపై కృషి చేస్తున్నారు. 8 రకాల చిరుధాన్యాలు కూడా ఇందులో ఉన్నాయి. ప్రకృతి సాగు వల్ల 50% నీటి అవసరం తగ్గుతుంది. భూసారం పెరుగుతుంది. దేన్నీ బయట నుంచి తెచ్చి వేసే అవసరం లేదంటారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ మంచి దిగుబడులు సాధిస్తున్నానని, మంచి ఆహారాన్ని ఇష్టపడే స్నేహితులే తనకు బలమని అన్నారు. 'రోజుకు 14 గంటలు పనిచేస్తున్నాను. పద్మశ్రీ అవార్డు బాధ్యతను పెంచింది. ఇక 18 గంటలు పనిచేస్తా'నంటున్నారు నెక్రమ్ శర్మ వినమ్రంగా.

పగలు సేద్యం.. రాత్రి వైద్యం



పతయత్ సాహు (67).. విశిష్ట వ్యవసాయ వైద్యుడు. ఒడిషాలోని కలహండి జిల్లా నందోల్ ఆయన స్వగ్రామం. 40 ఏళ్లుగా దాదాపు 3 వేల ఔషధ మొక్కలను తన ఎకరంన్నర భూమిలో పూర్తి సేంద్రియంగా పెంచుతూ.. ఆ మూలికలతోనే ప్రజలకు వైద్యం చేస్తున్నారు. ప్రతి మొక్క గుణగణాల గురించి తడుముకోకుండా అనర్గళంగా చెప్పగలరాయన. పగలు ఔషధ మొక్కల తోట పనులు స్వయంగా చేసుకుంటూ బిజీగా గడిపే సాహు.. రాత్రిపూట ప్రజలకు వైద్యం చేస్తారు. ఇంతని ఫీజు అడగరు. ఎంత ఇస్తే అంత తీసుకుంటారు. యుక్తవయసులోనే ఆసక్తితో ఔషధ మొక్కలు సేకరించి పెంచటం అలవాటు. తాత ఆయుర్వేద వైద్యుడు. చదువు అయ్యాక తాత దగ్గరే సంప్రదాయ ఆయుర్వే వైద్యం నేర్చుకున్నారు. ఇప్పుడున్న 3 వేల జాతుల ఔషధ మొక్కల్లో చాలా వరకు స్వరాష్ట్రంలో అరణ్యాల్లో నుంచి అటవీ అధికారులతో పాటు వెళ్లి ఎన్నో అరుదైన మొక్కలను సేకరించారు. 500 రకాలను ఒడిషా ఔషధ మొక్కల బోర్డు తోడ్పాటుతో ఇతర రాష్ట్రాల నుంచి సేకరించి సంరక్షిస్తున్నారు. ఔషధ మొక్కల జీవవైవిధ్యానికి ఆయన క్షేత్రం నిలయంగా మారింది. వ్యవసాయంతో వైద్యంతో అనుసంధానం చేయటం విశేషం. అరుదైన ఔషధులను పరిరక్షిస్తూ వాటి ప్రయోజనాలను అక్షరబద్ధం చేసి కొత్త తరానికి అందించటం గొప్ప సంగతి.

'సిరి'ధాన్యాలే నిజమైన ఆహార పంటలు!



డాక్టర్ ఖాదర్ వలి (65).. సంప్రదాయ ప్రకృతి సేద్య పద్ధతి 'అటవీ కృషి' (కడు కృషి) పునరుద్ధరించి సిరిధాన్యాలను ప్రాచుర్యంలోకి తెచ్చిన అరుదైన స్వతంత్ర శాస్త్రవేత్త. కమతం చిన్నదైనా అందులో 20% విస్తీర్ణంలో అడవిని పెంచుకుంటూ.. మిగతా స్థలంలో సీజనల్ పంటలు సాగు చేయటమన్నది 'అటవీ కృషి'లో ఒక అంశం. 'కడు చైతన్యం' పేరిట ద్రవరూప ఎరువును రూపొందించారు. రసాయనాల్లేకుండా వర్షాధారంగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల మిశ్రమ సాగే మనకు, ప్రకృతికి మేలు చేసే సేద్యమని ప్రచారోద్యమం నిర్వహిస్తున్నారు. కొర్రలు, అండుకొర్రలు, అరికలు, ఊదలు, సామలు వంటి 'సిరిధాన్యాలు' తింటూ హోమియో/ఆయుర్వేద మందులు వాడుతుంటే.. మధుమేహం నుంచి కేన్సర్ వరకు ఏ జబ్బయినా 6 నుంచి 2 ఏళ్లలోగా తగ్గిపోతాయంటారు డా. ఖాదర్. వరి, గోధుమలకు బదులు రోజువారీ ప్రధాన ఆహారంగా సిరిధాన్యాలను ఒక్కో రకాన్ని రెండు, మూడు రోజులు మార్చి మార్చి తినాలి. కొత్తగా అలవాటు చేసుకునే వారు 6 వారాల పాటు అన్నంగా కాకుండా అంబలి రూపంలో, కూరలు నంజుకుంటూ, తాగాలన్నది ఆయన సూచన. ఐదేళ్ల క్రితం డా. ఖాదర్‌ని 'సాక్షి సాగుబడి' తెలుగువారికి తొలిసారి పరిచయం చేసిన సంగతి తెలిసిందే.



సేంద్రియ సేద్య కురువృద్ధుడు

తులారామ్ ఉపేతి.. 98 ఏళ్ల ఉపేతి గత 80 ఎనభయ్యేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. 2023లో పద్మశ్రీ పురస్కారం పొందిన వ్యవసాయదారుల్లోకెల్లా ఈయనే పెద్ద. సిక్కిం తొలి సేంద్రియ వ్యవసాయ రాష్ట్రంగా అభివృద్ధి చెందింది. సేంద్రియ వ్యవసాయం ద్వారా పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో అక్కడి రైతులు ముఖ్యపాత్ర పోషించారు. ఐదో తరగతి చదివిన ఉపేతి చిన్నతనం నుంచి సేంద్రియ వ్యవసాయాన్ని వారసత్వంగా కొనసాగించారు. ఇతర రైతులకు మార్గనిర్దేశం చేశారు. సిక్కిం భారత్‌లో కలవక ముందు టిబెట్‌లోని యటుంగ్‌కు భుజాలపై మోసుకెళ్లి ధాన్యం, మొక్కజొన్నలను అమ్మేవారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న తులారామ్ ఐదారేళ్ల క్రితం వరకు స్వయంగా పొలానికి వెళ్లి పనులు చేయించేవారు.

దేశీ వరి వంగడాలే ప్రాణం!



చెరువాయల్ రామన్ (72).. కేరళకు చెందిన ఆదివాసీ సేంద్రియ రైతు. దేశీ వరి వంగడాల పరిరక్షణ ఉద్యమకారుడు కూడా. వయనాడ్ ప్రాంతంలో మనంతవాడి పంచాయతీలోని కమ్మన గ్రామంలో ఆయన నివశిస్తారు. రామన్ 150 ఏళ్ల నాటి వారసత్వ పూరింట్లోనే, విత్తనాల కుండల మధ్యనే, ఇప్పటికీ నివాసం ఉంటున్నారు. స్థానికంగా 'గార్డియన్ ఆఫ్ నేటివ్ పాడీ'గా ప్రసిద్ధి చెందారు. రామెట్టన్ అని కూడా ఆయన్ను పిలుస్తారు. ఔషధ గుణాలు, ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే గుణం వంటి ప్రత్యేకతలు కలిగిన స్వదేశీ వరి రకాలు శతాబ్దాలుగా మన దేశంలో వాడుకలో ఉన్నాయి. అయితే, హైబ్రిడ్, జన్యుమార్పిడి వరి రకాల రాకతో దేశీ రకాలు చాలా వరకు అంతరించిపోయే దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో చెరువాయల్ రామన్ తన 4 ఎకరాల పొలంలో 1.5 ఎకరాలను 22 ఏళ్ల క్రితం దేశీ వరి సాగుకు కేటాయించారు (మిగతా పొలంలో ఇతర పంటలు పండిస్తున్నారు). 54 దేశవాళీ రకాల వరిని ప్రతి ఏటా పండిస్తూ సంరక్షిస్తున్నారు. తన జీవితాన్ని దేశీ విత్తనాల పరిరక్షణకే అంకితం చేశారు. వయనాడ్ ప్రాంతంలో కురిచ్య గిరిజన జాతిలో పుట్టిన ఆయన ఆసుపత్రి వార్డెన్‌గా ఉద్యోగం చేసేవారు. అయితే, తమ గిరిజన కుటుంబాలు పురాతన దేశీ వరిసేద్యానికి క్రమంగా స్వస్తి చెబుతుండటాన్ని గుర్తించి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. 2004 నుంచి దేశీ వరి రకాలను ఉద్యమ స్ఫూర్తితో తాను సాగు చేయటమే కాదు. ఆ ప్రాంతంలో రైతులను కూడగట్టి సంఘంగా ఏర్పరిచి దేశీ వరి సాగును విస్తృతం చేశారు. అపురూపమైన దేశీ వరి విత్తనాలు డబ్బు కన్నా విలువైనవని ఆయన భావన. అందుకే విత్తనాలను అమ్మరు. ఉచితంగా ఇస్తారు. పండించిన తర్వాత అంతే పరిమాణంలో విత్తనాలను తనకు తిరిగి ఇవ్వాలి. అదొక్కటే షరతు. కొన్నేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం 'జీనోమ్ సేవియర్ పురస్కారం' ప్రదానం చేసి గౌరవించింది.

నీలి విప్లవ మార్గదర్శి



మోదడుగు విజయ్ గుప్తా (83).. ఆక్వాకల్చర్ రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన శాస్త్రవేత్త. సముద్రతీర ప్రాంత పట్టణం బాపట్లలో జన్మించారు. మత్స్యకారుల జీవితాల్లో మార్పు తేవాలన్న ఆసక్తితో కృషి చేసి అంతర్జాతీయ స్థాయి మత్స్యశాస్త్రవేత్తగా ఎదిగారు. ఆగ్నేయాసియాలో నీలి విప్లవానికి మార్గదర్శకుడిగా పేరుగాంచారు. 22 దేశాల్లోని చిన్న రైతులు, గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబనతో పాటు పౌష్టికాహారం అందించే విధంగా చేపల పెంపకం పద్ధతులను రూపొందించారు. మలేషియాలోని అంతర్జాతీయ సంస్థ వరల్డ్ ఫిష్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పదవీ విరమణ చేసి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మన దేశంలో ఉన్న వనరులను ఉపయోగించుకొని చేపల వినియోగాన్ని తలసరిన 5 కిలోల నుంచి 15 కిలోలకు పెంపొందించడం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అధిగమించవచ్చని విజయ్ గుప్తా సూచిస్తున్నారు. ఆక్వా శాస్త్రవేత్తగా ఆయన కృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మక ప్రపంచ ఆహార బహుమతి (2005)ని, మొదటి సన్‌హాక్ శాంతి బహుమతి(2015)ని గెలుచుకున్నారు.

అవకాడో పండ్ల సాగుపై అవగాహన నేడు

మెక్సికోకు చెందిన అవాకాడో (వెన్నపండు) పండ్ల సాగు తెలుగు రాష్ట్రాల్లో లాంఛనంగా ప్రారంభమవుతోంది. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం అవకాడో సాగుపై ఈ నెల 31 (మంగళవారం) ఉ. 10 గం. నుంచి మ. 2 గం. వరకు సంగారెడ్డిలోని ఫల పరిశోధనా స్థానం (సంగారెడ్డి కొత్త బస్టాండ్ దగ్గర)లో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించనుంది. ఎస్.కె.ఎల్.టి.ఎస్. ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. బి. నీరజా ప్రభాకర్, ఉద్యాన కమిషనర్ ఎం. హనుమంతరావు, ఐఐహెచ్‌ఆర్ (బెంగళూరు) ప్రధాన శాస్త్రవేత్త డా. జి. కరుణాకరన్, అభ్యుదయ రైతులు టి.వి.ఎస్.ఎన్. వీర అరసు, డా. ఎం. శ్రీనివాసరావు ప్రసంగిస్తారు. సదస్సు తర్వాత డెక్కన్ ఎగ్జోటిక్స్ క్షేత్ర పర్యటన ఉంటుంది. వివరాలకు.. 84552 76451.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్



ఆఖరి స్థానంలో అర్జున్

ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ నిరాశపరిచాడు. నెదర్లాండ్స్‌లోని విక్‌ఆన్‌జీ పట్టణంలో ముగిసిన ఈ టోర్నీలో అర్జున్ నాలుగు పాయింట్లు సాధించి చివరిదైన 14వ స్థానంలో నిలిచాడు. మొత్తం 13 గేముల్లో అర్జున్ ఎనిమిదింటిని 'డ్రా' చేసుకొని, ఐదు గేముల్లో ఓడిపోయాడు. 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనీశ్ గిరి (8.5 పాయింట్లు) విజేతగా నిలిచాడు.



సచిన్ టెండూల్కర్ చేతుల మీదుగా సన్మానం

దక్షిణాఫ్రికాలో ఆదివారం ముగిసిన తొలి అండర్-19 మహిళల ప్రపంచకప్ టి20 క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత జట్టుకు దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ సన్మానించనున్నాడు. బుధవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడో టి20 మ్యాచ్ ప్రారంభానికి ముందు షఫాలీ వర్మ జట్టుకు బీసీసీఐ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. సచిన్ ముఖ్యఅతిథిగా హాజరై భారత యువ జట్టును సత్కరిస్తాడని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపాడు.

ఆంధ్ర సెమీస్ చేరేనా!

నేటి నుంచి మధ్యప్రదేశ్‌తో క్వార్టర్ ఫైనల్



శశికాంత్

ఇండోర్: ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బోనస్ పాయింట్‌తో గెలిచి... ఇతర జట్ల మ్యాచ్‌ల ఫలితాలూ కలిసి రావడంతో... రంజీ ట్రోఫీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించిన ఆంధ్ర జట్టు... డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో నేటి నుంచి జరిగే క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. గతంలో ఏనాడూ రంజీ ట్రోఫీలో సెమీఫైనల్‌కు అర్హత పొందలేకపోయిన ఆంధ్ర జట్టుకు కొత్త చరిత్ర లిఖించాలని పట్టుదలతో ఉంది. అయితే పటిష్టంగా ఉన్న మధ్యప్రదేశ్‌పై ఆంధ్ర జట్టు గెలవాలంటే మాత్రం సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. ఈ సీజన్‌లో ఆంధ్ర తరఫున బ్యాటింగ్‌లో రికీ భుయ్ (461), కెప్టెన్ హనుమ విహారి (448), అభిషేక్ రెడ్డి (384), కరణ్ షిండే (439) నిలకడగా రాణించారు. ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి (23 వికెట్లు, 146 పరుగులు), షోయబ్ ఖాన్ (21 వికెట్లు, 300 పరుగులు)లతోపాటు బౌలర్లు శశికాంత్ (26 వికెట్లు), లలిత్ మోహన్ (25 వికెట్లు), మాధవ్ రాయుడు (11 వికెట్లు) కూడా మెరిస్తే ఆంధ్ర సంచలన ఫలితం సాధించే అవకాశముంది. బ్యాటింగ్‌లో రజత్ పాటిదార్, హిమాన్షు మంత్రి, శుభమ్ శర్మ... బౌలింగ్‌లో అవేశ్ ఖాన్, సారాంశ్ జైన్, కుమార్ కార్తికేయ, గౌరవ్ యాదవ్ నిలకడగా రాణిస్తూ మధ్యప్రదేశ్ విజయాల్లో కీలకపాత్ర పోషించారు. మంగళవారమే మొదలయ్యే ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో జార్ఖండ్‌తో బెంగాల్; ఉత్తరాఖండ్‌తో కర్ణాటక; పంజాబ్‌తో సౌరాష్ట్ర తలపడతాయి.

రన్నరప్ అనిరుధ్ జోడీ

సాక్షి, హైదరాబాద్: క్వింపెర్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ భారత్‌కే చెందిన అర్జున్ ఖడేతో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. ఫ్రాన్స్‌లో జరిగిన ఈ టోర్నీలో ఫైనల్లో అనిరుధ్–అర్జున్ ద్వయం 2–6, 4–6తో టాప్ సీడ్ సాదియో దుంబియా–ఫాబియన్ రెబూల్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడిపోయింది. క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్–అర్జున్ ద్వయం 6–3, 1–6, 10–7తో రెండో సీడ్ అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్)–హంటర్ రీస్ (అమెరికా)లపై సంచలన విజయం సాధించింది.



రన్నరప్ ట్రోఫీలతో అనిరుధ్, అర్జున్

మన హాకీ... మళ్లీ మొదటికి!

కొన్నేళ్ల క్రితం వరకు భారత హాకీ జట్టుకు కొత్త విదేశీ కోచ్ రావడం... కొన్నాళ్లు ఆ పదవిలో కొనసాగడం... అభిప్రాయభేదాలు రావడం... ఆ తర్వాత పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవడం తరచూ జరిగేది. కానీ నాలుగేళ్ల క్రితం ఆస్ట్రేలియాకు చెందిన గ్రాహమ్ రీడ్ మాత్రం సుదీర్ఘంగానే ఈ పదవిలో కొనసాగారు. ఆయన ఆధ్వర్యంలో భారత్ చెప్పుకోదగ్గ విజయాలే అందుకుంది. కానీ తాజాగా స్వదేశంలో జరిగిన ప్రపంచకప్‌లో భారత జట్టు వైఫల్యం నేపథ్యంలో ఆయన చీఫ్ కోచ్ పదవికి రాజీనామా చేశారు. ఫలితంగా హాకీ ఇండియా (హెచ్ఐ) కొత్త కోచ్‌ను వెదికే పనిలో పడింది. ఈ ఏడాది ఆసియా క్రీడలు... వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్ ఉండటంతో హాకీ ఇండియా మళ్లీ విదేశీ కోచ్ వైపు మొగ్గు చూపుతుందా లేక స్వదేశీ కోచ్‌కు ప్రాధాన్యత ఇస్తుందా వేచి చూడాలి.

- భారత హాకీ జట్టు చీఫ్ కోచ్ పదవికి గ్రాహమ్ రీడ్ రాజీనామా
- ఏడాదిన్నర ముందుగానే పదవి నుంచి వైదొలిగిన ఆస్ట్రేలియన్
- ప్రపంచకప్ టోర్నీలో టీమిండియా వైఫల్యం నేపథ్యంలో నిర్ణయం
- ఎనలిటికల్ కోచ్, సైంటిఫిక్ అడ్వైజర్ కూడా నిష్క్రమణ



టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్, చీఫ్ కోచ్ గ్రాహమ్ రీడ్ (ఫైల్)

న్యూఢిల్లీ: నాలుగేళ్లుగా నిలకడగా కొనసాగుతున్న భారత పురుషుల హాకీ జట్టు శిక్షణ బృందంలో సమూల మార్పులు చోటు చేసుకోనున్నాయి. స్వదేశంలో అట్టహాసంగా జరిగిన ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత హాకీ జట్టు కనీసం క్వార్టర్ ఫైనల్ చేరకపోవడం... చివరకు తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకోవడంతో హాకీ ఇండియా (హెచ్ఐ) దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాదే పారిస్ ఒలింపిక్స్ ఉండటం... ఈ సంవత్సరం ఆసియా క్రీడల టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు నేరుగా పారిస్ ఒలింపిక్ బెర్త్ దక్కనున్న నేపథ్యంలో హెచ్ఐ ప్రస్తుతం ఉన్న శిక్షణ బృందాన్ని మార్చాలని నిశ్చయించింది. హెచ్ఐ భవిష్యత్ ప్రణాళికల్లో తన పేరు ఉండే అవకాశం లేదని గ్రహించిన ప్రస్తుత చీఫ్ కోచ్ గ్రాహమ్ రీడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతోపాటు ఎనలిటికల్ కోచ్ గ్రెగ్ క్లార్క్, సైంటిఫిక్ అడ్వైజర్ మిచెల్ డేవిడ్ పెంబర్టన్ కూడా తమ రాజీనామా లేఖలను హెచ్ఐ అధ్యక్షుడు దిలీప్ టిర్కీకి సమర్పించారు. ఆస్ట్రేలియాకు చెందిన 58 ఏళ్ల రీడ్ 2019 ఏప్రిల్‌లో భారత జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఒప్పందం ప్రకారం ఆయన 2024 జూలై–ఆగస్టులో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల వరకు పదవిలో ఉండాలి. అయితే స్వదేశంలో జరిగిన ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు కనీసం క్వార్టర్ ఫైనల్ కూడా చేరకపోవడం... స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వకపోవడం... పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచడంలో వైఫల్యం...ఆటగాళ్ల మధ్య సమన్వయలేమి... వెరసి రీడ్ రాజీనామాకు దారి తీశాయి. భారత్ 1975 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన తర్వాత మరోసారి ఈ మెగా ఈవెంట్‌లో సెమీఫైనల్ దశకు చేరుకోలేకపోయింది.

ఒలింపిక్ పతకం వచ్చినా...

రీడ్ నాలుగేళ్ల శిక్షణ కాలంలో భారత హాకీ జట్టు చెప్పుకోదగ్గ విజయాలు సాధించింది. భారత జట్టు 41 ఏళ్ల ఒలింపిక్ పతక నిరీక్షణకు తెరదించడంలో రీడ్ సఫలమయ్యారు. ఆయన శిక్షణలోనే భారత్ 2021 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించింది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం గెలిచింది. 2021–2022 ప్రో లీగ్ సీజన్‌లో మూడో స్థానం సంపాదించింది. 2019లో చీఫ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడాదే భువనేశ్వర్‌లో జరిగిన ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత్ గెలిచి టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత పొందింది. 'చీఫ్ కోచ్ పదవి నుంచి తప్పుకొని ఆ బాధ్యతలు వేరేవారికి అప్పగించే సమయం వచ్చింది. భారత జట్టుతో, హాకీ ఇండియాతో కలిసి పనిచేసినందుకు గర్వంగా ఉంది. ఈ నాలుగేళ్ల కాలంలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను. భవిష్యత్‌లో భారత జట్టుకు మంచి విజయాలు లభించాలని కోరుకుంటున్నాను' అని రీడ్ వ్యాఖ్యానించారు. రీడ్, గ్రెగ్ క్లార్క్, మిచెల్ డేవిడ్ రాజీనామాలను ఆమోదించినట్లు హాకీ ఇండియా (హెచ్ఐ) అధ్యక్షుడు దిలీప్ టిర్కీ తెలిపారు.

భారత హాకీ జట్టుకు తొలి విదేశీ కోచ్‌గా వ్యవహరించిన ఘనత జర్మనీకి చెందిన గెరార్డ్ రాచ్‌కు దక్కుతుంది. ఆయన 2004 జూలైలో టీమిండియాకు తొలి విదేశీ కోచ్ అయ్యారు. 2007 ఫిబ్రవరిలో ఆయన రాజీనామా చేసి వెళ్లిపోయారు. 2009 మేలో స్పెయిన్‌కు చెందిన జోస్ బ్రాసా కోచ్‌గా వచ్చి 2010 నవంబర్ వరకు ఆ పదవిలో కొనసాగారు. 2011 జూన్‌లో ఆస్ట్రేలియాకు చెందిన మైకేల్ నాబ్స్ ఐదేళ్ల కాలానికి భారత జట్టుకు కోచ్‌గా వచ్చారు. కానీ ఆయన రెండేళ్లు మాత్రమే

గతంలోనూ...

ఆ పదవిలో కొనసాగి 2013 జూన్‌లో వెళ్లిపోయారు. అనంతరం ఆస్ట్రేలియాకే చెందిన టెర్రీ వాల్ష్ 2013 అక్టోబర్ నుంచి 2014 అక్టోబర్ వరకు... నెదర్లాండ్స్‌కు చెందిన పాల్ వాన్ యాస్ 2015 జనవరి నుంచి జూన్ వరకు... నెదర్లాండ్స్‌కు చెందిన రోలంట్ ఆల్ట్‌మన్స్ 2015 జూన్ నుంచి 2017 సెప్టెంబర్ వరకు... నెదర్లాండ్స్‌కే చెందిన జోయెర్డ్ మరీన్ 2017 సెప్టెంబర్ నుంచి 2018 మే వరకు భారత జట్టుకు కోచ్‌లుగా వ్యవహరించారు.



నాబ్స్ వాల్ష్ పాల్

క్రికెట్‌కు మురళీ విజయ్ గుడ్‌బై



చెన్నై: భారత సీనియర్ క్రికెటర్ మురళీ విజయ్ ఆటకు గుడ్‌బై చెప్పాడు. కుడిచేతి వాటం బ్యాటర్ చాన్నాళ్ల క్రితమే జాతీయ జట్టుకు దూరమయ్యాడు. అయితే ఆలస్యంగా ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2008–09 సీజన్‌లో ఓపెనర్ గౌతమ్ గంభీర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు నాగ్‌పూర్ టెస్టుకు ఎంపికైన విజయ్ తన నిలకడైన ప్రదర్శనతో ఏకంగా 61 టెస్టులు ఆడాడు. 17 వన్డేలు, తొమ్మిది టి20 మ్యాచ్‌లు కూడా ఆడాడు. 2018లో తన కెరీర్‌లో చివరి టెస్టును ఆస్ట్రేలియాతో పెర్త్‌లో ఆడాడు. టీమిండియాకు దూరమైన అనంతరం దేశవాళీ క్రికెట్, 2020 నుంచి ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌తో బిజీ అయ్యాడు. 'నేను అంతర్జాతీయ క్రికెట్‌లోని మూడు ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నాను. ప్రపంచ క్రికెట్–వ్యాపారంలో కొత్తగా వస్తున్న అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు సంతోషంగా ఆట నుంచి నిష్క్రమిస్తున్నా. ఇకపై బరిలోకి దిగకపోయినా... క్రికెట్‌తో అనుబంధం కొనసాగుతుంది. ఈ ఆటలో మరో పాత్ర పోషిస్తాను. కొత్త వాతావరణంలో కొత్త సవాళ్లను ప్రేమతో స్వీకరించేందుకు రెడీగా ఉన్నాను. క్రికెట్‌లో నాదిపుడు కొత్త ప్రయాణం... జీవితంలో మరో అధ్యాయమని భావిస్తున్నా' అని తమిళనాడుకు చెందిన 38 ఏళ్ల మురళీ విజయ్ తన రిటైర్మెంట్ సందేశంలో పేర్కొన్నాడు. తన సంతృప్తికర క్రికెట్ కెరీర్‌కు సహకరించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి, తమిళనాడు క్రికెట్ సంఘం, సీఎస్‌కే, సహచరులు, సహాయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు. 61 టెస్టుల్లో 38.28 సగటుతో 3982 పరుగులు చేసిన విజయ్ సంప్రదాయ కెరీర్‌లో 12 సెంచరీలు, 15 అర్ధసెంచరీలున్నాయి. 17 వన్డేలాడి 339 పరుగులు, తొమ్మిది టి20ల్లో 169 పరుగులు చేశాడు.

లీగ్ దశలో అజేయంగా...

భారత మహిళల జట్టుకు మూడో విజయం



దీప్తి శర్మ

ఈస్ట్ లండన్: దక్షిణాఫ్రికా గడ్డపై జరుగుతున్న ముక్కోణపు టి20 మహిళల క్రికెట్ టోర్నీలో ఇప్పటికే ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న భారత జట్టు సోమవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో వెస్టిండీస్‌పై గెలిచింది. మొదట విండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ (34; 5 ఫోర్లు), జైదా జేమ్స్ (21 నాటౌట్ 2 సిక్సర్లు) మెరుగ్గా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (3/11) రాణించింది. అనంతరం భారత్ 13.5 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసి గెలిచింది. స్మృతి మంధాన (5) విఫలమైనా... మరో ఓపెనర్ జెమీమా (39 బంతుల్లో 42 నాటౌట్; 5 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (23 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. అబేధ్యమైన మూడో వికెట్‌కు 54 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. ఈ టోర్నీలో ఓటమెరుగని భారత్ 7 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. రెండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా (5 పాయింట్లు)తో గురువారం జరిగే ఫైనల్లో భారత్ తలపడుతుంది.

ఖేలో ఇండియా స్పాన్సర్‌గా 'స్పోర్ట్స్ ఫర్ ఆల్'

సాక్షి, హైదరాబాద్: ప్రతిభ గల క్రీడాకారుల ప్రదర్శనకు పదును పెట్టే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (కేఐవైజీ)తో దేశీయ క్రీడల నిర్వాహక సంస్థ 'స్పోర్ట్స్ ఫర్ ఆల్' (ఎస్ఎఫ్ఏ) జతకట్టింది. యువతలోని క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరచడానికి విశేష కృషి చేస్తున్న ఎస్ఎఫ్ఏ ఐదేళ్ల పాటు ఖేలో ఇండియా గేమ్స్‌కు స్పాన్సర్‌గా వ్యవహరిస్తుంది. ఈ మేరకు రూ. 12.5 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఎస్ఎఫ్ఏ వ్యవస్థాపకులు రిషికేశ్ జోషి తెలిపారు. కుర్రాళ్ల ప్రతిభాన్వేషణలో భాగమైన ఎస్ఎఫ్ఏ స్పాన్సర్‌షిప్ లభించడంపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హర్షం వ్యక్తం చేసింది. గతంలో ఎస్ఎఫ్ఏ ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో భారత జట్టుకు స్పాన్సర్‌గా ఉంది.

SPORTS FOR ALL
Ab Jeetega India
KHELO INDIA

సినిమా

గ్యాప్ ఇవ్వలా.. వచ్చింది!



కృతీ సనన్ · దిశా పటానీ · కియారా అద్వానీ

**ఏడేళ్ల తర్వాత తెలుగుకి వచ్చారు కృతీ సనన్.. దిశా పటానీ.
మూడేళ్ల తర్వాత తెలుగు సినిమా చేస్తున్నారు కియారా అద్వానీ..
మూడేళ్ల తర్వాత తెలుగు తెరపై కనిపించనున్నారు అనుష్క.
ఇరవైరెండేళ్ల తర్వాత హిందీ సినిమా చేశారు జ్యోతిక..
ఎందుకీ గ్యాప్ అంటే.. వేరే భాషల్లో సినిమాలు చేయడంవల్ల, వేరే కారణాల వల్ల అన్నమాట.
అంతేకానీ కావాలని 'గ్యాప్ ఇవ్వలా... వచ్చింది'.
ఇక తెలుగు, హిందీలో గ్యాప్ తర్వాత ఈ స్టార్స్ చేస్తున్న సినిమాల గురించి తెలుసుకుందాం...**

'జియా జలే...' అంటూ వరుణ్ తేజ్‌తో కలిసి 'లోఫర్'లో చాలా హాట్ హాట్‌గా స్టెప్పులేసిన దిశా పటానీ గుర్తుందా? తెలుగులో తనకు ఇదే తొలి చిత్రం. ఆ మాటకొస్తే.. హీరోయిన్‌గానే మొదటి సినిమా. 2015లో ఈ సినిమా వచ్చింది. ఆ తర్వాత ఈ నార్త్ బ్యూటీ హిందీ పరిశ్రమకు వెళ్లి మళ్లీ తెలుగు వైపు చూడలేదు. ఈ ఏడేళ్లల్లో అక్కడ సినిమాలు చేస్తూ వచ్చిన దిశా చాలా గ్యాప్ తర్వాత తెలుగులో చేస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ కె'. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా సినిమా ద్వారా దిశా గ్రాండ్‌గా రీ–ఎంట్రీ ఇస్తున్నారు. దిశాలానే కృతీ సనన్ కూడా పాన్ ఇండియా సినిమా 'ఆదిపురుష్'తో తెలుగు తెరపై గ్రాండ్ రీ–ఎంట్రీ ఇవ్వనున్నారు. అలాగే దిశాలానే ప్రభాస్ సరసన కనిపించనున్నారు. ఆ బ్యూటీలానే కృతీ కూడా ఏడేళ్లకు తెలుగుకి వస్తున్నారు. మహేశ్‌బాబు సరసన '1 నేనొక్కడినే' ద్వారా తెలుగు తెరకు పరిచయమైన కృతి ఆ తర్వాత నాగచైతన్య సరసన 'దోచేయ్' (2015) చేశారు. మళ్లీ తెలుగు తెరపై కనిపించలేదు. ఇక 'ఆదిపురుష్' విషయానికొస్తే.. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. రాముడి పాత్రలో ప్రభాస్ నటించగా సీతగా కృతీ సనన్ చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. ఇక హిందీ చిత్రం 'ఫగ్లీ' (2014) ద్వారా హీరోయిన్‌గా పరిచయ మైన కియారా అద్వానీ ఆ తర్వాత నాలుగేళ్లకు తెలుగు తెరపై మెరిశారు. మహేశ్‌బాబు సరసన 'భరత్ అనే నేను' (2018) చిత్రంతో పరిచయ మైన ఈ బ్యూటీ ఆ తర్వాత రామ్‌చరణ్ సరసన 'వినయ విధేయ రామ' (2019)లో నటించారు. హిందీ చిత్రాలు చేస్తూ వస్తున్న కియారా కొంత గ్యాప్ తర్వాత తెలుగు తెరపై మళ్లీ రామ్‌చరణ్ సరసనే కనిపించనున్నారు. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న పాన్ ఇండియా మూవీలో కియారా కథానాయికగా నటిస్తున్నారు. దిశా, కృతీలానే ఈ బ్యూటీ కూడా గ్రాండ్‌గా పాన్ ఇండియా మూవీతో మళ్లీ తెలుగు తెరపై కనిపించనున్నారు. ఈ ముగ్గురూ పాన్ ఇండియా సినిమాల ద్వారా మళ్లీ తెలుగులో కనిపించనుండటం వారికే కాదు.. వారి ఫ్యాన్స్‌కి కూడా ఆనందంగా ఉంటుంది.



అనుష్క · జ్యోతిక

నిశ్శబ్దంగా...

అనుష్క రెండేళ్ల క్రితం నిశ్శబ్దంగా తెరపై కనిపించారు. 2020లో విడుదలైన 'నిశ్శబ్దం' చిత్రంలో బధిరురాలు (మూగ, చెవిటి) పాత్ర చేశారు అనుష్క. అయితే ఈ చిత్రం నేరుగా ఓటీటీలో రిలీజైంది. అంతకుముందు 2019లో చిరంజీవి నటించిన 'సైరా'లో వెండితెరపై కనిపించారు అనుష్క. సో.. సిల్వర్ స్క్రీన్‌పై ఈ బ్యూటీ కనిపించి మూడేళ్లవుతోంది. ప్రస్తుతం యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు అనుష్క. ఇందులో నవీన్ పొలిశెట్టి హీరో. మహేశ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది. పెద్ద అప్‌డేట్స్ ఏవీ ఇవ్వకుండా ఈ చిత్రం షూటింగ్‌ని నిశ్శబ్దంగా చేస్తున్నారు. ఈ చిత్రానికి 'మిస్ శెట్టి.. మిస్టర్ పొలిశెట్టి' అనే టైటిల్ అనుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఇరవైరెండేళ్లకు హిందీలో...

హిందీ చిత్రం 'డోలీ సజా కే రఖ్నా' (1998)తో తన కెరీర్‌ను ప్రారంభించారు జ్యోతిక. ఆ తర్వాత 'వాలీ' సినిమాతో తమిళ్‌కి పరిచయమై, వరుసగా తమిళ్, తెలుగు.. ఇలా దక్షిణాది భాషల్లో హీరోయిన్‌గా బిజీ అయ్యారు. హీరో సూర్యని పెళ్లి చేసుకుని, ఇద్దరు బిడ్డలకు తల్లయ్యాక కొన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉన్నారామె. 2009 నుంచి 2014 వరకూ సినిమాలు చేయలేదు. 2015లో '36 వయదినిలే'తో రీ–ఎంట్రీ ఇచ్చి, లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఇక జ్యోతిక చివరిగా హిందీ తెరపై కనిపించిన సినిమా 'లిటిల్ జాన్' (2001). ఇన్నేళ్ల తర్వాత ఆమె ఆ మధ్య హిందీ సినిమా 'శ్రీ' అంగీకరించారు. రాజ్‌కుమార్ రావ్ హీరోగా తుషార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ''శ్రీ'లో నా పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తయింది. భారమైన హృదయంతో ఈ యూనిట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నాను'' అని పేర్కొన్నారు జ్యోతిక.

ఆ రోజు దసరా గురించే మాట్లాడుకుంటారు - నాని



నాని

''దసరా' నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. మార్చి 30న విడుదలవుతోంది. ఆ రోజు అందరూ మా 'దసరా' గురించే మాట్లాడుకుంటారు. అది తప్పితే మరో చర్చ ఉండదు'' అని హీరో నాని అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తీ సురేష్ జంటగా నటించిన చిత్రం 'దసరా'. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మార్చి 30న విడుదలకానుంది. ఈ మూవీ టీజర్‌ని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాని మాట్లాడుతూ–''తెలుగు సినిమాకి నా కాంట్రిబ్యూషన్ ఏంటి? అని చాలాసార్లు ఆలోచించాను. ఇప్పుడు చాలా గర్వంగా ఒక మాట చెబుతున్నాను. తెలుగు, ఇండియన్ సినిమాకి ఈ ఏడాది నా తరఫున బిగ్గెస్ట్ కాంట్రిబ్యూషన్ శ్రీకాంత్ ఓదెల. అది ఎందుకో మార్చి 30న తెలుస్తుంది. గత ఏడాది తెలుగు నుంచి 'ఆర్ఆర్ఆర్', కన్నడ నుండి 'కేజీఎఫ్ 2' వచ్చాయి. 2023లో తెలుగు సినిమా నుంచి మా 'దసరా' వస్తోంది'' అన్నారు. ''మా సినిమా ఒక పెద్ద పండగలా ఉంటుంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు సుధాకర్ చెరుకూరి. ఈ వేడుకలో శ్రీకాంత్ ఓదెల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సత్యన్ సూర్యన్, సంగీతం: సంతోష్ నారాయణన్.

అదృశ్య శక్తితో పోరాటం

హీరోయిన్ హన్సిక ఒకే ఒక పాత్రలో నటించిన చిత్రం 'వన్ నాట్ ఫైవ్ మినిట్స్'. రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మక్ శివ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ–''హాలీవుడ్‌లో సింగిల్ షాట్ టెక్నిక్‌లో తెరకెక్కిన 'బర్డ్ మన్, 1917' చిత్రాల తరహాలో 'వన్ నాట్ ఫైవ్ మినిట్స్' తీశాం. సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. రీల్ టైమ్, రియల్ టైమ్ ఒకేలా ఉండి ప్రేక్షకులు కూడా ఆ సీన్‌లో ప్రత్యక్షంగా ఉన్నట్లు అనుభూతి చెందుతారు. ఈ చిత్రానికి గ్రీన్ మ్యాట్ వాడకుండా లైవ్‌గా చిత్రీకరించి గ్రాఫిక్స్ యాడ్ చేశాం. ఒక అదృశ్య శక్తి నుండి తనను తాను కాపాడుకునే అమ్మాయిగా ప్రతి షాట్‌లో అద్భుతమైన హావభావాలు పలికించారు హన్సిక'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: కిషోర్ బోయిదాపు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్–స్క్రిప్ట్ చీఫ్ అసోసియేట్: రూపకిరణ్ గంజి, సహ నిర్మాత: బొమ్మక్ యషిత.



హన్సిక

పైరసీ నేపథ్యంలో...



నవీన్‌చంద్ర, గాయత్రీ సురేష్

నవీన్ చంద్ర హీరోగా, గాయత్రీ సురేష్, పూజా జవేరి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మాయగాడు'. జీఎస్ కార్తీక్ రెడ్డి దర్శకత్వంలో భార్గవ్ మన్నె నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేసింది చిత్ర బృందం. ''పైరసీ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. కొత్త సినిమాలను పైరసీ చేసే పాత్రలో నవీన్ చంద్ర నటించారు. పైరసీ వల్ల సినీ పరిశ్రమకు ఏర్పడే నష్టాలను ఈ సినిమాలో చూపించాం. ఇందులో ప్రేమకథ కూడా ఉంటుంది. ఈ సినిమాను త్వరలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: వెంకట్ గంగాధరీ.

కొత్తగా ప్రయత్నించాం - మణిశర్మ



జైదీప్ విష్ణు, మణిశర్మ

''రెబెల్స్ ఆఫ్ తుపాకులగూడెం' సినిమా పూర్తయిన తర్వాత నాకు ఓ విషయం అర్థమైంది.. దర్శకుడు విష్ణు కనిపించినంత సాఫ్ట్ కాదని (నవ్వుతూ). మేమంతా కలిసి కొత్తగా ప్రయత్నించాం.. ప్రేక్షకులు మా సినిమాను చూసి, మమ్మల్ని ఆశీర్వదించాలి'' అని సంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. ప్రవీణ్ కండేలా, శ్రీకాంత్ రాథోడ్, జయెత్రి మకానా, శివరామ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో జైదీప్ విష్ణు దర్శకత్వం వహించిన చిత్రం 'రెబెల్స్ ఆఫ్ తుపాకులగూడెం'. వారధి క్రియేషన్స్‌పై రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో జైదీప్ విష్ణు మాట్లాడుతూ– ''మా సినిమాలో 40 మంది నూతన నటీనటులున్నారు. కాసర్ల శ్యామ్‌గారి వల్లే మా చిత్రానికి మణిశర్మగారితో సంగీతం చేయించుకునే చాన్స్ దక్కింది'' అన్నారు. ప్రవీణ్ కండేలా, శ్రీకాంత్ రాథోడ్, గౌతమ్, జయెత్రి, కెమెరామెన్ శ్రీకాంత్ అరుపుల, రైటర్ సంతోష్, పాటల రచయిత కాసర్ల శ్యామ్ తదితరులు మాట్లాడారు.

తమాషా గ్యాంగ్



గాయత్రీ పటేల్

వెంకట్ కల్యాణ్, గాయత్రీ పటేల్ జంటగా వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహించిన చిత్రం 'చెడ్డి గ్యాంగ్ తమాషా'. సీహెచ్ క్రాంతి కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి రెండో వారంలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ – ''వినోదాత్మకంగా రూపొందిన చిత్రం 'చెడ్డి గ్యాంగ్ తమాషా'. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌తో సినిమా మీద మంచి అంచనాలు ఏర్పడ్డాయి. బిజినెస్ పరంగా కూడా చాలా సంతోషంగా ఉన్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జీకే యాదవ్ బంక, సంగీతం: అర్జున్.

నేను బాగానే ఉన్నాను - ఇలియానా



ఇలియానా అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ''నేను ఆహారం తీసుకోలేని స్థితిలో ఉన్నాను. డాక్టర్లు మూడు బాటిల్ల ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించారు.. నాకు మంచి వైద్యం అందిస్తున్నారు. నా ఫ్యాన్స్‌తో పాటు అందరూ నా ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్నారు. ఇంతగా నాపై ప్రేమ చూపిస్తున్నవారికి థ్యాంక్స్. ఇప్పుడు నేను బాగానే ఉన్నాను'' అని పేర్కొంటూ ఆస్పత్రిలో సెలైన్ ఎక్కించుకుంటున్న ఫొటోలను షేర్ చేశారు ఇలియానా. తాను ఎందుకు ఆస్పత్రిలో చేరాననే విషయాన్ని మాత్రం బయటపెట్టలేదు.

సాక్షి బిజినెస్
మంగళవారం
31-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	170	59,500
నిఫ్టీ ▲	45	17,649

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,469	▽	153
డోజోన్స్	33,894	▽	84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,785	▲	20
డాక్స్	15,126	▽	24
షాంఘై	3,269	▲	4
నికాయ్	27,433	▲	51

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	57,079
బంగారం (99.5 స్వచ్ఛత)	56,850
వెండి (కేజీ)	68,149


ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	80.90	82.57
£	బ్రిటన్ పౌండ్	87.28	90.38
€	యూరో	99.62	102.98
¥	జపాన్ ఎన్ (100)	61.82	63.84
AUS	ఆస్ట్రేలియా డాలర్	56.87	59.25
S$	సింగపూర్ డాలర్	61.21	63.23
SAR	సౌదీ రియాల్	20.74	22.41
UAE D	యూఏఈ దిర్హామ్	21.29	23.09
¥	చైనా యువాన్	10.95	13.03

ఎల్అండ్‌టీ ఫలితాలు భేష్

క్యూ3లో రూ. 2,553 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మౌలిక దిగ్గజం ఎల్అండ్‌టీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం 24 శాతం ఎగసి రూ. 2,553 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 2,055 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం వృద్ధితో రూ. 46,390 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 39,563 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల విభాగంలో మెరుగైన ఎగ్జిక్యూషన్ ఇందుకు సహకరించినట్లు కంపెనీ సీఎఫ్‌వో ఆర్. శంకర రామన్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఐటీ, టెక్నాలజీ సర్వీసుల పోర్ట్‌ఫోలియో బలపడటం ఇందుకు జత కలసినట్లు తెలియజేశారు. ఎల్‌టీఐ, మైండ్‌ట్రీ విలీనాన్ని విజయవంతంగా పూర్తిచేసినట్లు సీఈవో, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. కాగా.. తాజా సమీక్షా కాలంలో 21 శాతం అధికంగా రూ. 60,710 కోట్ల విలువైన కాంట్రాక్టులు లభించినట్లు కంపెనీ వెల్లడించింది. ఆయిల్ అండ్ గ్యాస్, హైడల్, టన్నెల్స్, ఇరిగేషన్ సిస్టమ్స్, ఫెర్రస్ మెటల్స్, విద్యుత్ ప్రసారం, పంపిణీ విభాగాల నుంచి ఆర్డర్లు పొందినట్లు పేర్కొంది.



ఫలితాల నేపథ్యంలో ఎల్అండ్‌టీ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం నీరసించి రూ. 2,122 వద్ద ముగిసింది.

టెక్ మహీంద్రా లాభం వీక్

క్యూ3లో రూ. 1,297 కోట్లు

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 5 శాతం క్షీణించి రూ. 1,297 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2021–22) ఇదే కాలంలో రూ. 1,378 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 20 శాతం వృద్ధితో రూ. 13,735 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 11,451 కోట్ల టర్నోవర్ నమోదైంది. స్థూల ఆర్థిక వాతావారణం ప్రతికూలంగా ఉన్న నేపథ్యంలో వృద్ధి మందగించినట్లు కంపెనీ ఎండీ, సీఈవో సీపీ గుర్నానీ పేర్కొన్నారు. క్లయింట్ల సాంకేతిక అవసరాలకు అనుగుణంగా పనిచేయడంతో పాటు.. కొత్తగా డిమాండు పుడుతున్న డిజిటల్ సర్వీసులు తదితరాలపై దృష్టి పెట్టినట్లు తెలియజేశారు. 79.5 కోట్ల డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత సమీక్షా కాలంలో బీపీవో సిబ్బందిలో కోత కారణంగా నికరంగా 1,800 మంది ఉద్యోగులు తగ్గినట్లు కంపెనీ తెలియజేసింది. దీంతో మొత్తం సిబ్బంది 1.57 లక్షలకు చేరినట్లు వెల్లడించింది. ఉద్యోగ వలసల (అట్రిషన్) రేటు 17 శాతంగా నమోదైంది.



ఫలితాల నేపథ్యంలో టెక్ మహీంద్రా షేరు 1 శాతం బలపడి రూ. 1,039 వద్ద ముగిసింది.

ఏవియేషన్ గ్యాస్ ఎగుమతులు షురూ..

పపువా న్యూ గినియాకు పంపిన ఐవోసీ

ముంబై: ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) దేశ ఇంధన చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించింది. తాజాగా ఏవియేషన్ గ్యాస్ (ఏవీ గ్యాస్) ఎగుమతులు ప్రారంభించింది. 80 బ్యారెళ్ల తొలి కన్సైన్‌మెంట్‌ను (ఒక్కో బ్యారెల్ 16 కిలోలీటర్లు) జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ నుంచి పపువా న్యూ గినియాకు పంపినట్లు సంస్థ తెలిపింది. నికరంగా ఇంధనాలను దిగుమతి చేసుకునే భారత్ .. ఇలా ఏవీ గ్యాస్‌ను ఎగుమతి చేయడం ఇదే ప్రథమం. దీనితో అంతర్జాతీయంగా 2.7 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్న ఏవీ గ్యాస్ మార్కెట్లోకి ప్రవేశించినట్లు సంస్థ తెలిపింది. మానవరహిత ఏరియల్ వాహనాలు (యూఏవీ), ఫ్లయింగ్ స్కూల్స్ నడిపే చిన్న విమానాలు మొదలైన వాటిల్లో ఏవీ గ్యాస్‌ను ఉపయోగిస్తారు. పెద్ద వాణిజ్య విమానాల్లో ఉపయోగించే ఇంధనాన్ని ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)గా వ్యవహరిస్తారు. ఏవీ గ్యాస్‌ను దేశీయంగా ఉత్పత్తి చేయడం వల్ల విదేశీ మారకం ఆదా కావడంతో పాటు ఔత్సాహిక పైలట్లకు ఫ్లయింగ్ స్కూల్స్‌లో శిక్షణ వ్యయభారం కూడా తగ్గుతుందని ఐవోసీ చైర్మన్ ఎస్ఎం వైద్య చెప్పారు. అలాగే రక్షణ బలగాలు ఉపయోగించే యూఏవీల నిర్వహణ వ్యయాలు కూడా భారీగా తగ్గగలవని పేర్కొన్నారు. దీన్ని దేశీయంగా ఐవోసీ మాత్రమే తయారు చేస్తోంది. గుజరాత్‌లోని వడోదరలో గత సెప్టెంబర్‌లో ఉత్పత్తి ప్రారంభించింది. ఈ ప్లాంటు సామర్థ్యం 5,000 టన్నులుగా ఉంది.



గెయిల్ లాభంలో భారీ క్షీణత

క్యూ3లో రూ. 398 కోట్లు మాత్రమే



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ యుటిలిటీ దిగ్గజం గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 90 శాతం క్షీణించి రూ. 398 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 3,800 కోట్లు ఆర్జించింది. పెట్రోకెమికల్, సహజవాయు మార్కెటింగ్ బిజినెస్‌లో ఏర్పడ్డ నష్టాలు ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-1-2023	
విశాఖ	480–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్ ధర (డజను)	72.00
30-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00
రిటైల్ ధర	4.75

కనిష్టాల నుంచి కోలుకున్నాయ్

- ఇంట్రాడేలో తీవ్ర ఒడిదుడుకులు
- స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు
- ఐటీ, ఫైనాన్స్, బ్యాంక్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు

ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు సోమవారం నష్టాల్లోంచి గట్టెక్కి స్వల్ప లాభాల్లో ముగిశాయి. దేశీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల మధ్య ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. మిడ్ సెషన్ వరకు నష్టాల్లో కదలాడాయి. తదుపరి ఐటీ, ఫైనాన్స్, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాల్ని పూడ్చుకొని స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఉదయం సెన్సెక్స్ 229 పాయింట్లు కోల్పోయి 59,102 వద్ద, నిఫ్టీ 62 పాయింట్ల పతనంతో 17,542 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఇంట్రాడేలో 632 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ కోలుకుని 170 పాయింట్ల లాభంతో 59,500 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ట్రేడింగ్‌లో 199 పాయింట్లు పతనమై 17,405 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆఖరికి 45 పాయింట్లు పెరిగి 17,649 వద్ద నిలిచింది. ఆటో, మీడియా, మెటల్, ఫార్మా, రియల్టీ ఇంధన–గ్యాస్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ నష్టాలను చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.6792 కోట్ల షేర్లను విక్రయించగా, దేశీ ఇన్వెస్టర్లు రూ.5513 కోట్ల షేర్లను కొన్నారు.



ప్రపంచ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. 'హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌పై అదానీ స్పందనకు మార్కెట్ మిశ్రమంగా స్పందించింది. ప్రభుత్వం లేదా పేరున్న స్వతంత్ర సంస్థలు శాస్త్రీయ అధ్యయనం చేసి నిష్పక్షపాతమైన నివేదిక వెల్లడిస్తేనే వివాదం ఓ కొలిక్కి వస్తుంది. ప్రస్తుతానికి ఇన్వెస్టర్లు బడ్జెట్, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య పాలసీలపై దృష్టి సారించారు' అని జియోజిత్ ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- వివాదాస్పద హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌పై అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు మిశ్రమంగా స్పందించాయి. పలు కంపెనీల షేర్ల నష్టపోగా.., మరి కొన్ని కంపెనీ షేర్లకు కొనుగోలు మద్దతు లభించింది.
- క్యూ3లో బజాజ్ ఫైనాన్స్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించడంతో ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ షేరు రాణించింది. బీఎస్ఈలో నాలుగుశాతం లాభపడి రూ.6,022 వద్ద స్థిరపడింది.
- ఇండియన్ బ్యాంక్ షేరు ఐదుశాతం పెరిగి రూ.296 వద్ద నిలిచింది. డిసెంబర్ క్వార్టర్‌లో నికర లాభం రెండు రెట్లు పెరగడం షేరు ర్యాలీకి కారణమైంది. ట్రేడింగ్‌లో ఐదుశాతం ఎగసి రూ.300 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

అదానీ ఎఫ్‌పీవోలో ఐహెచ్‌సీ పెట్టుబడులు

అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ ఆఫర్ (ఎఫ్‌పీవో)లో 400 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసినట్లు అబు ధాబికి చెందిన ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ (ఐహెచ్‌సీ) వెల్లడించింది. తమ అనుబంధ సంస్థ గ్రీన్ ట్రాన్స్‌మిషన్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ ఆర్ఎస్‌సీ ద్వారా పెట్టుబడి పెట్టినట్లు తెలిపింది. ఐహెచ్‌సీ ఇప్పటికే ఈ ఎఫ్‌పీవోలో యాంకర్ ఇన్వెస్టరుగా కూడా పాల్గొంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫండమెంటల్స్‌పైనా, దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపైనా తమకు నమ్మకం ఉండటం వల్లే ఈ మేరకు పెట్టుబడులు పెట్టినట్లు ఐహెచ్‌సీ సీఈవో సయ్యద్ బసర్ షుయెబ్ తెలిపారు. రూ. 20,000 కోట్ల అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పీవో మంగళవారంతో (జనవరి 31) ముగియనుంది.

పీఎన్‌బీ లాభం డౌన్

క్యూ3లో రూ. 629 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్– డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం 44 శాతం క్షీణించి రూ. 629 కోట్లకు పరిమితమైంది. మొండి రుణాలకు కేటాయింపులు పెరగడం ప్రభావం చూపింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,127 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 22,026 కోట్ల నుంచి రూ. 25,722 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం సైతం 18 శాతం ఎగసి రూ. 9,179 కోట్లను తాకింది. మొండి రుణాలకు ప్రొవిజన్లు రూ. 3,654 కోట్ల నుంచి రూ. 3,908 కోట్లకు పెరిగాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 12.88 శాతం నుంచి 9.76 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు సైతం 4.9 శాతం నుంచి 3.3 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి స్వల్పంగా బలపడి 15.15 శాతానికి చేరింది.



ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు ఎన్ఎస్ఈలో దాదాపు యథాతథంగా రూ. 51 వద్ద ముగిసింది.

మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ లాభం 452% జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, డిజైనింగ్ కంపెనీ మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ నికరలాభం అంత క్రితంతో పోలిస్తే 452.5% ఎగసి రూ.9.2 కోట్లు సాధించింది. ఎబిటా 300 శాతం పెరిగి రూ.13.6 కోట్లకు చేరింది. టర్నోవర్ 71% అధికమై రూ.40.7 కోట్లుగా ఉంది. ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన కంపెనీల మోడళ్లకు 3డీ, 2డీ, రోబోటిక్స్ సేవలను అందిస్తున్నామని మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ సీఎండీ జె.లక్ష్మణ రావు తెలిపారు. 'ఇటువంటి సర్వీసులను ఆఫర్ చేస్తున్న అతికొద్ది భారతీయ కంపెనీల్లో మోల్డ్‌టెక్ ఒకటి. యూరప్, మెక్సికో నుంచి ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. కనెక్షన్ డిజైన్, స్ట్రక్చరల్ డిజైనింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ కంపెనీలను కొనుగోలు చేస్తాం. ఆర్డర్ బుక్ ఎన్నో రెట్లు పెరిగింది. ఈ వృద్ధి కొనసాగుతుంది' అని ధీమా వ్యక్తం చేశారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 225 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

పుణె ప్రధాన కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 225
- **పోస్టుల వివరాలు:** ఎకనామిస్ట్, సెక్యూరిటీ ఆఫీసర్, సివిల్ ఇంజనీర్, లా ఆఫీసర్, ఏపీఐ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేటర్,ఎలక్ట్రికల్ ఇంజనీర్, రాజభాష ఆఫీసర్, డేటా అనలిటిక్స్, ఐటీ సెక్యూరిటీ ఆఫీసర్, మొబైల్ యాప్ డెవలపర్, డాటానెట్ డెవలపర్,విండోస్ అడ్మినిస్ట్రేటర్, డిజిటల్ బ్యాంకింగ్, సీనియర్ మేనేజర్ తదితరాలు.
- **అర్హత:** సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టును అనుసరించి కనిష్టంగా 25, గరిష్టంగా 35, 38 ఏళ్ల మించకూడదు.
- **వేతనం:** నెలకు స్కేల్ 3 పోస్టులకు రూ.63,840 నుంచి రూ.78,230, స్కేల్ 2 పోస్టులకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.02.2023
- **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

సీఐఎస్‌ఎఫ్‌లో 451 కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ పరిశ్రమల భద్రత నిమిత్తం కానిస్టేబుల్(డ్రైవర్), కానిస్టేబుల్ (డ్రైవర్ -కమ్-పంప్-ఆపరేటర్-ఫైర్ సర్వీస్) పోస్టుల భర్తీకి పురుషుల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 451
- **పోస్టుల వివరాలు:** కానిస్టేబుల్/డ్రైవర్-183, కానిస్టేబుల్/డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్-268.
- **అర్హత:** మెట్రిక్యులేషన్ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్(హెవీ మోటార్ వెహికల్ లేదా ట్రాన్స్‌పోర్ట్ వెహికల్, లైట్ మోటార్ వెహికల్, మోటార్ సైకిల్ విత్ గేర్)తో పాటు మూడేళ్ల డ్రైవింగ్ అనుభవం ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:** ఎత్తు 167 సెం.మీ, ఛాతీ కొలత 80–85 సెం.మీ. ఉండాలి.
  వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫీషియెన్సీ టెస్ట్, డాక్యుమెంటేషన్, ట్రేడ్ టెస్ట్, రాత పరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.02.2023
- **వెబ్‌సైట్:** www.cisfrectt.in

ఈపీఐఎల్‌లో 30 ఉద్యోగాలు

ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్(ఇండియా) లిమిటెడ్(ఈపీఐఎల్).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
- **పోస్టుల వివరాలు:** మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ మేనేజర్లు.
- **విభాగాలు:** సివిల్ డిజైన్, ఆర్కిటెక్చర్, హెచ్ఆర్, ఐటీ, ఫైనాన్స్, మెకానిక్ తదితరాలు.

అర్హత:

- **అసిస్టెంట్ మేనేజర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎంఎంఈఐ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 32 ఏళ్లు ఉండాలి. కనీసం 2 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
- **మేనేజర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎంఎంఈఐ/సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఎంబీఏ/ఎంసీఏ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 35 ఏళ్లు ఉండాలి. కనీసం నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి.
- **సీనియర్ మేనేజర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎంఎంఈఐ/బీఆర్క్/పీజీ డిప్లొమా/ఎంబీఏ/ఏసీఏస్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 42 ఏళ్లు ఉండాలి. కనీసం 9 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**13.02.2023
- **వెబ్‌సైట్:** www.epi.gov.in


ఇఎన్ఈఎస్ఏసీ, మేఘాలయలో 27 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

మేఘాలయలోని నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(ఎన్ఈఎస్ఏసీ)ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 27
- **అర్హత:** బీఈ/బీటెక్/ఎంఎస్సీ(రిమోట్ సెన్సింగ్/జియోఇన్ఫర్మేటిక్స్/స్పేషియల్ ఇన్ఫర్మేషన్ సైన్స్/కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.31,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** సంబంధిత ధ్రువపత్రాలతో అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ వేదిక:** ఎన్ఈఎస్ఏసీ, ఉమియమ్.
- **ఇంటర్వ్యూ తేది:** 06.02.2023 నుంచి 08.02.2023 వరకు జరుగుతాయి.
- **వెబ్‌సైట్:** nesac.gov.in

పదో తరగతితోనే.. కేంద్ర ప్రభుత్వ కొలువు!

» కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ నియామకాలు
» 12,523 పోస్టులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నోటిఫికేషన్
» రాత పరీక్ష, పీఈటీ, పీఎస్‌టీల ద్వారా ఎంపిక ప్రక్రియ
» తెలుగు సహా 13 ప్రాంతీయ భాషల్లోనూ రాత పరీక్ష
» కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ



కేంద్ర ప్రభుత్వ కొలువు అందుకునే మరో అవకాశం! పదో తరగతి అర్హతతోనే.. సుస్థిర భవిష్యత్తును సొంతం చేసుకునేందుకు మార్గం! ప్రారంభంలోనే నెలకు రూ.18,000 -రూ.56,900 పే స్కేల్‌తో వేతనం! వీటన్నింటికీ మార్గం స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) తాజాగా విడుదల చేసిన మల్టీ టాస్కింగ్ స్టాఫ్ నియామక ప్రకటన! కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖలు, విభాగాల్లో గ్రూప్-సి(నాన్-గెజిటెడ్) స్థాయిలో మొత్తం 12,523 మల్టీ టాస్కింగ్(నాన్-టెక్నికల్) సిబ్బంది నియామకాలకు ప్రక్రియ ప్రారంభించింది. పదోతరగతి అర్హతతోనే ఈ పోస్టులకు పోటీ పడొచ్చు! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ విడుదల చేసిన మల్టీ టాస్కింగ్ (నాన్-టెక్నికల్) స్టాఫ్ నోటిఫికేషన్ వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పదో తరగతి అర్హతతోనే 12 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాంక్ ఎగ్జామ్స్, ఇతర రిక్రూట్‌మెంట్ పరీక్షలకు పోటీ పడుతున్న వారు అదే ప్రిపరేషన్‌తో ఎస్ఎస్‌సీ ఎంటీఎస్ పోస్టులకు కూడా సన్నద్ధం కావొచ్చు.

పలు శాఖలు.. 12,523 పోస్టులు

మల్టీ టాస్కింగ్(నాన్-టెక్నికల్) స్టాఫ్ నియామక ప్రక్రియ ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలలో మొత్తం 12,523 పోస్టులను భర్తీ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-సి(నాన్-గెజిటెడ్) హోదాలో 11,994, అదే విధంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో నాన్-మినిస్టీరియల్ విభాగంలో 529 హవాల్దార్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- ఫిబ్రవరి 17, 2023 నాటికి పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** సీబీఎన్‌లో ఎంటీఎస్, హవాల్దార్ పోస్టులకు జనవరి 1, 2023 నాటికి 18–25 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- సీబీఐసీలో హవాల్దార్, కొన్ని నిర్దేశిత శాఖలో ఎంటీఎస్ పోస్టులకు 18–27ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు వయో సడలింపు ఉంటుంది.
- **వేతన శ్రేణి:** రూ.18,000– 56,900 (స్థూల వేతనం – రూ. 31,329)

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్‌సీ ఎంటీఎస్ నియామక ప్రక్రియను మొత్తం మూడు దశలుగా చేపట్టనున్నారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఫిజికల్ స్టాండర్ టెస్ట్‌ను హవాల్దార్ పోస్టులకు మాత్రమే నిర్వహిస్తారు.

ప్రాంతీయ భాషల్లో రాత పరీక్ష

ఎస్ఎస్‌సీ తాజా నోటిఫికేషన్‌లో మరో ముఖ్యమైన అంశం.. ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్షను తెలుగుతోపాటు 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు.

రాత పరీక్షకు 270 మార్కులు

- ఎంపిక ప్రక్రియలో తొలి దశగా పేర్కొన్న రాత పరీక్షను రెండు సెషన్లలో మొత్తం 270 మార్కులకు నిర్వహిస్తారు.
- **సెషన్–1:** ఇందులో న్యూమరికల్ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ(20 ప్రశ్నలు–60 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్(20 ప్రశ్నలు– 60 మార్కులు) విభాగాలుంటాయి.
- **సెషన్–2:** ఈ సెషన్‌లో జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు–75 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు–75 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- సెషన్–1లోని రెండు విభాగాల్లో ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున, సెషన్–2లోని సబ్జెక్టులలో ప్రతి సబ్జెక్ట్‌లో ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున కేటాయించారు.
- ప్రతి సెషన్ వ్యవధి 45 నిమిషాలు.
- పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది.
- సెషన్–2లో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును నెగెటివ్ మార్క్‌గా నిర్దేశించారు. సెషన్–1లో నెగెటివ్ మార్కింగ్ లేదు.

పీఈటీ/ పీఎస్‌టీ

ఎస్ఎస్‌సీ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ నియామకాలకు సంబంధించి అన్ని శాఖలకు రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగానే నియామకాలు ఖరారు చేస్తారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ విభాగాల్లోని హవాల్దార్ పోస్టులకు మాత్రం రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, తర్వాత ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. వివరాలు..

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్

- రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఆయా కేటగిరీల వారీగా కటాఫ్ నిర్దేశించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి.. రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులకు వాకింగ్ టెస్ట్ ఉంటుంది.
- పురుష అభ్యర్థులు 1,600 మీటర్ల దూరాన్ని 15 నిమిషాల్లో నడవాలి.
- మహిళా అభ్యర్థులు ఒక కిలో మీటర్ దూరాన్ని 20 నిమిషాల్లో నడవాల్సి ఉంటుంది.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

- ఈ టెస్ట్‌ను పలు పోస్టులకు మాత్రమే నిర్వహిస్తారు. అభ్యర్థులు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుషులు 157.5 సెం.మీ ఎత్తు ఉండాలి. ఛాతి విస్తీర్ణం 81 సెం.మీ ఉండాలి. (శ్వాస పీల్చినప్పుడు అయిదు సెం.మీ. విస్తరించాలి).
- మహిళా అభ్యర్థులు 152 సెం.మీ ఎత్తు ఉండాలి. 48 కిలోల బరువుండాలి.

సెషన్-2నే కీలకం

తుది విజేతలను ఖరారు చేసే క్రమంలో సెషన్–2లో పొందిన మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థులు కచ్చితంగా సెషన్–1లో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే.. సెషన్–2 జవాబులను మూల్యాంకన చేస్తారు. హవాల్దార్ పోస్టులకు సంబంధించి రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా 1:5 నిష్పత్తిలో తదుపరి దశలు పీఈటీ, పీఎస్‌టీలకు ఎంపిక చేస్తారు.

రాత పరీక్షలో విజయానికి ఇలా

మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్–టెక్నికల్) పోస్టులకు నిర్వహించనున్న రాత పరీక్షలో ఆయా సిలబస్ టాపిక్స్‌ను అనుసరించి ప్రణాళికాబద్ధంగా ప్రిపరేషన్ సాగించాలి.

న్యూమరికల్ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ

సెషన్–1లో మొదటి విభాగంగా ఉండే ఈ సబ్జెక్ట్‌లో రాణించాలంటే.. ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థగణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

రీజనింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్

సెషన్–1లో రెండో విభాగంగా ఉండే ఈ సబ్జెక్ట్‌లో.. మంచి మార్కుల కోసం. వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్,విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్,వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా సమస్యకు పరిష్కారం కనుగొనే రియల్ టైమ్ నైపుణ్యం పొందాలి.

జనరల్ అవేర్‌నెస్

సెషన్–2లో మొదటి సబ్జెక్ట్‌గా ఉండే జనరల్ అవేర్‌నెస్‌లో రాణించేందుకు.. భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

సెషన్–2లో రెండో విభాగంలో అడిగే ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌లో రాణించేందుకు.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్–స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై పట్టు సాధించాలి. ఇందుకోసం పదో తరగతి స్థాయి ఇంగ్లిష్ పుస్తకాలతోపాటు.. కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు అందుబాటులో ఉండే ప్రామాణిక ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలను అభ్యసనం చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 18 – ఫిబ్రవరి 17, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** ఫిబ్రవరి 23, 24 తేదీలు
- **రాత పరీక్ష తేదీ:**ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in


పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు


కర్నూలు జిల్లా మాంత్రికిలో సంక్షేమ పథకాలపై అవ్వను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


కృష్ణాజిల్లా చిరువోలులో దివ్యాంగురాలికి అందుతున్న పింఛన్ గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


విజయనగరం జిల్లా నాయరాలవలసలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

మన ప్రభుత్వం

క్లుప్తంగా...

పెండింగ్ అంశాలు పరిష్కరించాలి

ప్రత్యేక హోదా ప్రకటించాలి
అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి


అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్న ఎంపీ విజయసాయిరెడ్డి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో అఖిలపక్ష సమావేశం వేదికగా వైఎస్సార్‌సీపీ మరోసారి విభజన చట్టంలోని పెండింగ్ అంశాలు, ప్రత్యేక హోదాపై గళమెత్తింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన సోమవారం ఢిల్లీలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ఈ అంశాలను లేవనెత్తారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ వేదికగా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామంటూ చేసిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అశాస్త్రీయమైన విభజనతో రాష్ట్రం ఎదుర్కొన్న నష్టాలు దృష్టిలో పెట్టుకొని ఆ హామీని గౌరవించాలని కోరారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల ఆవశ్యకత గురించి వివరించి.. జిల్లాకో కళాశాల ఉండేలా ఆర్థిక సహాయం చేయాలని కోరారు. పోలవరం, తాగునీటి కాంపొనెంట్, ఇతరత్రా నిధులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వెనకబడిన తరగతుల కులాల వారీగా గణన చేపట్టే అంశానికి ప్రాధాన్యమివ్వాలని విజయసాయిరెడ్డి కోరారు.

కాంట్రాక్టు లెక్చరర్లకు 12 నెలల వేతనం

- గత టీడీపీ ప్రభుత్వంలో 10 నెలలే వేతనం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత టీడీపీ ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్లకు పదినెలలు మాత్రమే వేతనం ఇచ్చేది. అయితే ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు వేతనాలను 12 నెలలకు పెంచింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గత విద్యాసంవత్సరంలో కూడా వీరికి 12 నెలలు వేతనాలివ్వగా ఇప్పుడు 2022–23 విద్యాసంవత్సరంలో కూడా 12 నెలలు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మాంసం ఇక పండుతుంది!

సాక్షి, అమరావతి: చికెన్ కోసం కోడిని చంపనవసరం లేదు. చూడటానికి మృదువుగా.. తినడానికి రుచికరంగా ఉంటుంది. అదే సెల్ కల్చర్డ్ చికెన్. కృత్రిమంగా పండిస్తున్న ఈ కోడి మాంసం తినడానికి ఎంతో సురక్షితమంటూ అమెరికన్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) ఇటీవల ధ్రువీకరించింది. కోడి స్టెమ్ సెల్స్ నుంచి ఉత్పత్తి అయ్యే సెల్ కల్చర్డ్ చికెన్ త్వరలో అమెరికన్ మార్కెట్‌లోకి అందుబాటులోకి రానుంది. భవిష్యత్‌లో మేక, గొర్రె స్టెమ్ సెల్స్ నుంచి మటన్, పీత, బాతు వంటి స్టెమ్ సెల్స్ నుంచి ఆయా మాంసాలను కూడా ఉత్పత్తి చేసే ప్రక్రియ కూడా అందుబాటులోకి రానుంది.

విశ్వవ్యాప్తంగా 27.60 కోట్ల కిలోల వినియోగం

ప్రపంచ వ్యాప్తంగా రోజుకు 27.60 కోట్ల కిలోల చికెన్ వినియోగిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచంలోని ప్రజల్లో నూటికి 95 శాతం మంది బ్రాయిలర్ కోళ్లనే ఇందుకు వినియోగిస్తున్నారు. కోళ్లకు బదులుగా ప్రత్యామ్నాయ పద్ధతిలో మాంసాన్ని పండించే సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. ఇకపై మాంసం కోసం ఏ జీవిని వధించనవసరం లేకుండా.. సంబంధిత జంతువు కణాల (స్టెమ్ సెల్స్) ద్వారా ఆయా రకాల మాంసాలను ఉత్పత్తి చేస్తారు. ఈ విధానాన్ని సెల్ కల్చర్డ్ చికెన్/సెల్ కల్చర్డ్ మీట్ అంటారు. ఈ విధానంలో కోడి స్టెమ్ సెల్‌ను వినియోగించి చికెన్‌ను ఉత్పత్తి చేస్తారు. తొలివిడత చికెన్ ఉత్పత్తికి 14 రోజుల సమయం పడితే.. ఆ తరువాత దాని నుంచి ప్రతి 18, 24 గంటలకు రెట్టింపయ్యే కణాల ద్వారా మాంసం ఉత్పత్తి అవుతుంది.



మాయా లేదు.. మర్మం లేదు.. అబ్రకదబ్ర అనక్కర్లేదు. కోడి లేకుండానే కోడి మాంసం.. అది కూడా బోన్‌లెస్‌గా మీ ముందుకు వచ్చేస్తుంది. ఇట్టే ఆకలి తీర్చేస్తుంది. ఇదేదో విఠలాచార్య సినిమాలో సరదా సీన్ అనుకోకండి. ఈ ఏడాది నుంచే అమెరికన్ రెస్టారెంట్స్‌లో ఈ తరహా చికెన్ అందుబాటులోకి రానుంది. భారతీయులు దీనిని రుచి చూడాలంటే కనీసం ఐదారేళ్లు ఆగాల్సిందే. 2028 నాటికి భారతీయ కిరాణా దుకాణాల్లోనూ (గ్రోసరీ స్టోర్స్) ఇలాంటి చికెన్ అందుబాటులోకి వస్తుందని అంచనా.


కల్టివేషన్ రూమ్

విప్లవాత్మక మార్పు

ఇది నిజంగా ఆహార చరిత్రలో విప్లవాత్మక పరిణామమని, ఎలాంటి దుష్పరిణామాలు ఉండవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తగినంత కొవ్వుతో పాటు కావాల్సిన స్థాయిలో ప్రొటీన్స్, విటమిన్స్ ఈ కృత్రిమ మాంసంలో ఉంటాయని ఎఫ్‌డీఏ గుర్తించింది. పూర్తిగా బోన్‌లెస్ చికెన్ మాదిరిగా ఉండే ఈ చికెన్ శాఖాహారులకు, వివిధ కారణాలతో మాంసం తినడం మానేసిన, మానాలనుకునే వారికి ప్రత్యామ్నాయంగా ఉంటుందని చెబుతున్నారు. ఎఫ్‌డీఏ అనుమతితో అమెరికాలో 'అప్‌సైడ్ ఫుడ్స్' అనే సంస్థ 'సెల్ కల్చర్డ్ చికెన్'ను ఉత్పత్తి చేస్తోంది. పలు స్టార్టప్ ఫుడ్ కంపెనీలు ఈ తరహా మాంసం ఉత్పత్తికి సన్నాహాలు చేస్తున్నాయి. భవిష్యత్‌లో కల్చర్డ్ మాంసం ఉత్పత్తులు సింహభాగం మార్కెట్‌ను ఆక్రమిస్తాయని, ఈ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

జీవహింస చేయక్కర్లేదు

ఈ విధానం అందుబాటులోకి వస్తే మాంసాహారం కోసం జీవాలను వధించే ముప్పు తప్పుతుందని, భవిష్యత్‌లో మిగిలిన మాంసాహార ఉత్పత్తుల్ని కూడా ఇదే తరహాలో తయారు చేసే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు. కణం నుంచి ఉత్పత్తి అయ్యే కల్చర్డ్ చికెన్‌లో ఎలాంటి యాంటీబయాటిక్స్ మందుల్ని ఉపయోగించరు. ఈ విధానాన్ని సెల్యులర్ వ్యవసాయం అని పిలుస్తున్నారు. సెల్ కల్చర్డ్ మాంసాన్ని సృష్టించే ప్రక్రియ ఒక కణంతో మొదలవుతుంది. ఒక కోడి నుండి బయాప్సీ ద్వారా కణాలను వేరు చేసి సెల్ బ్యాంక్ రూపొందిస్తారు. వాటిని ఉక్కు పాత్రలో పరిపక్వం చేస్తారు. పూర్తి స్థాయిలో చికెన్ తయారవడానికి కనీసం 14 రోజుల సమయం పడుతుంది. ఆ తరువాత ప్రతి 18 నుంచి 24 గంటలకు ఆ మాంసం రెట్టింపవుతుంది.

ఎఫ్‌డీఏ అనుమతి పొందిన తొలి సంస్థ మాదే

పండించిన మాంసం కోసం ఎఫ్‌డీఏ నుంచి అనుమతి పొందిన మొదటి కంపెనీగా మా సంస్థ నిలవడం ఆనందంగా ఉంది. ఈ మాంసం తినడం వల్ల ఎలాంటి దుష్పరిణామాలు సంభవించలేదని పరిశోధనల్లో వెల్లడైంది. భవిష్యత్‌లో ఇదే తరహాలో పశు మాంసం, ఎండ్రకాయలు, బాతు మాంసంతో పాటు ఇతర ఆహారాలను కూడా తయారు చేసే ఆలోచనలో ఉన్నాం. పేటెంట్ హక్కు కోసం కూడా దరఖాస్తు చేశాం.

– ఉమా వాలేటి, సీఈవో, అప్‌సైడ్ ఫుడ్స్, యూఎస్‌ఏ

అమెరికన్లలో 10 శాతం మంది ఆసక్తి

ప్రస్తుతం అమెరికన్లలో నూటికి 10 శాతం మంది కణాల ద్వారా ఉత్పత్తి అయ్యే ఆహారం తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారని మార్కెట్ పరిశోధన సంస్థ మింటెల్ అసోసియేట్ పేర్కొంది. కోళ్లను వధించగా వెలువడే 10–12 శాతం గ్రీన్‌హౌస్, వాయు ఉద్గారాలకు ఈ సెల్ కల్చర్డ్ చికెన్ ద్వారా చెక్ పెట్టవచ్చంటున్నారు. కల్చర్డ్ లేదా మొక్కల ఆధారిత మాంసం ఉత్పత్తులకు భవిష్యత్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, మాంసం మార్కెట్‌లో కనీసం 10 శాతం వాటా ఆక్రమిస్తుందని చెబుతున్నారు. అమెరికాలో ఈ ఏడాదే పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి అందుబాటులోకి రానుండగా.. 2028 నాటికి మన దేశంలోనూ దర్శనమివ్వనుంది.

గవర్నర్ వ్యవస్థతో రాజకీయం వద్దు

- రాజ్యాంగబద్ధమైన పదవిపై ప్రభుత్వాలు, పార్టీలు అవగాహన కల్పించుకోవాలి
- ఉద్యోగుల జీతాల విషయంలో గవర్నర్‌కు జోక్యం చేసుకునే అధికారం లేదు
- హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ

సాక్షి, విశాఖపట్నం/సింహాచలం: రాజ్యాంగంలోని అత్యంత కీలకమైన గవర్నర్ వ్యవస్థతో రాజకీయాలు చేయడం సరికాదని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. సోమవారం విశాఖపట్నంలోని సీతమ్మధారలో ఉన్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ మాజీ చైర్మన్ చెరువు రామకోటయ్య నివాసంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిపై ప్రభుత్వాలు, పార్టీలు అవగాహన కల్పించుకొని.. గవర్నర్ వ్యవస్థకు గౌరవం ఇవ్వాలని హితవు పలికారు. ఆ వ్యవస్థ నచ్చకపోతే రాజకీయం చేయడం మాని పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. ఇటీవల ఏపీలోని కొందరు ఉద్యోగులు జీతాల చెల్లింపులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన విషయంపై దత్తాత్రేయ స్పందిస్తూ.. ఈ విషయంలో గవర్నర్‌కు జోక్యం చేసుకునే అధికారం లేదని స్పష్టం చేశారు. గవర్నర్ దృష్టికి వచ్చిన ప్రతి విషయం తిరిగి ప్రభుత్వానికే పంపించాలని, కేవలం పరిశీలించమని చెప్పే అధికారం మాత్రమే గవర్నర్‌కు ఉందని వ్యాఖ్యానించారు. కొత్త ఎడ్యుకేషన్ పాలసీని అమలు చేయాలని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడతానన్నారు.


రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ

శారదాపీఠంలో వేద పోషణ అభినందనీయం

వేద పోషణ కోసం విశాఖ శ్రీశారదా పీఠం శ్రమిస్తున్న తీరు అభినందనీయమని బండారు దత్తాత్రేయ తెలిపారు. శారదాపీఠం వార్షికోత్సవాలు నాల్గవరోజైన సోమవారం వైభవంగా జరిగాయి. ఈవేడుకల్లో దత్తాత్రేయ పాల్గొన్నారు. రాజశ్యామల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజశ్యామల యాగంలోను, శ్రీనివాస చతుర్వేద హవనంలోను పాల్గొన్నారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీల ఆశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా శారదాపీఠం ముద్రించిన మాండుక్యోపనిషత్ గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పీఠం చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రసంశనీయమన్నారు. దత్తాత్రేయ వెంట ఎమ్మెల్సీ మాధవ్ ఉన్నారు. కాగా, వార్షికోత్సవాల్లో భాగంగా శారదాపీఠంలో సాయంత్రం జరిగిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది.

ప్రభుత్వ షోకాజ్ నోటీసులను చట్టవిరుద్ధంగా ప్రకటించండి

హైకోర్టులో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి పిటిషన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల జీతాల విషయంలో గవర్నర్‌ను కలిసినందుకు తమకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన షోకాజ్ నోటీసులను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ముందు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వై.వి.రవిప్రసాద్, న్యాయవాది పి.వి.జి.ఉమేశ్‌చంద్ర స్పందిస్తూ.. ఈ వ్యాజ్యం సర్వీసు అంశానికి సంబంధించినది కాదని, రిజిస్ట్రీ పొరపాటుగా ఈ వ్యాజ్యాన్ని ఈ కోర్టు ముందుంచిందని చెప్పారు. రోస్టర్ ప్రకారం ఈ వ్యాజ్యం మరో న్యాయమూర్తి ముందుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యాజ్యంపై అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం ఉన్న దృష్ట్యా దీన్ని తగిన బెంచ్ ముందు ఉంచేలా రిజిస్ట్రీని ఆదేశించాలని కోరారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఆదేశించారు. దీంతో రిజిస్ట్రీ అధికారులు ఈ వ్యాజ్యం ఫైల్‌ను ప్రధాన న్యాయమూర్తి (సీజే) ముందుంచారు. ఫైల్‌ను పరిశీలించిన సీజే ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ రవినాథ్ తిల్హరీ వద్దకు పంపారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ తిల్హరీ విచారించనున్నారు.

ఢిల్లీ వేదికగా..నేడు పెట్టుబడులపై భేటీ

- ఉదయం విదేశీ రాయబారులతో సీఎం జగన్ సమావేశం
- హాజరుకానున్న 40కి పైగా విదేశీ రాయబార ప్రతినిధులు
- మధ్యాహ్నం పారిశ్రామిక సంఘాలతో విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ మీట్ సన్నాహక సమావేశం
- ఇందులో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై ప్రజంటేషన్
- విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ఉద్దేశాన్ని వివరిస్తూ సీఎం ప్రసంగం

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంలో భాగంగా మంగళవారం ఢిల్లీ వేదికగా ఇంటర్నేషనల్ డిప్లొమాట్ అలయన్స్ మీట్ పేరిట విదేశీ రాయబారుల సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 40మందికి పైగా విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి విజయవంతంగా నడుస్తున్న పలు విదేశీ కంపెనీల ప్రతినిధులు రాష్ట్రంలోని పెట్టుబడుల అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విదేశీ ప్రతినిధులకు వివరిస్తారు. కొరియాకు చెందిన కియా మోటార్స్ ఎండీ తే జిన్ పార్క్, జపాన్ టోరే ఇండస్ట్రీస్ ఎండీ యమాగుచి, అమెరికా క్యాడ్‌బరీ ఇండియా ప్రెసిడెంట్ దీపక్ ధనరాజన్ అయ్యర్, ఇటలీకి చెందిన ఎవర్టన్ టీ ఇండియా డైరెక్టర్ రోషన్ గుణవర్ధన, తైవాన్‌కు చెందిన అపాచీ–హిల్‌టాప్ గ్రూపు డైరెక్టర్ సెరిగో లీ, ఫ్రాన్స్‌కు చెందిన సెయింట్ గోబియాన్ సీఎండీ



ఫణికుమార్ తదితరులు రాష్ట్రంలో వారి అనుభవాలను పంచుకుంటారు. ఈ సందర్భంగా పారిశ్రామిక ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరిస్తారు. ఢిల్లీ లీలా ప్యాలెస్‌లో ఉ.11 గంటలకు మొదలయ్యే ఈ సమావేశం ఒకటిన్నరకు ముగుస్తుంది. అనంతరం.. మార్చి 3–4 తేదీల్లో విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌కు సంబంధించిన సన్నాహక సదస్సులో సీఎం మ.3.30 గంటలకు పాల్గొంటారు. ఫిక్కి, నాస్కాం, సీఐఐ వంటి పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు పాల్గొనే ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరిస్తారు.

రాష్ట్ర ముఖచిత్రం మారనుంది : మంత్రి

ఇక మార్చిలో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుతో రాష్ట్ర ముఖచిత్రం మారనుందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలను, పెట్టుబడిదారులను ఆహ్వానించేందుకు ఉపకరించే రోడ్‌షోలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. తొలి రోడ్డుషో ఢిల్లీలో జరగనుందని సోమవారం విశాఖలో ఆయన మీడియాకు చెప్పారు. మన రాష్ట్రంలో అమలుచేస్తున్న అత్యంత సరళమైన పారిశ్రామిక విధానాన్ని వారికి వివరిస్తామన్నారు. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా ఇటువంటి సదస్సులు నిర్వహించలేకపోయామని మంత్రి చెప్పారు. ఈ సదస్సుకు 13 రంగాలకు సంబంధించిన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని మంత్రి చెప్పారు.

'స్త్రీనిధి' అధ్యక్షురాలిగా జయలక్ష్మి

ఉపాధ్యక్షురాలిగా కవిత, కోశాధికారిగా మాధవి


కొత్త అధ్యక్షురాలిగా ఎన్నికైన జయలక్ష్మికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

సాక్షి, అమరావతి: బ్యాంకులకు సమాంతరంగా ప్రత్యేకించి పొదుపు సంఘాల మహిళలకు అదనపు రుణ సహాయం అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఏర్పాటైన 'స్త్రీనిధి' పరపతి సహకార సమాఖ్య కొత్త అధ్యక్షురాలిగా అనకాపల్లి జిల్లా కే కోటపాడు మండల సమాఖ్యకు చెందిన బి.జయలక్ష్మి ఎన్నికయ్యారు. పాలక వర్గ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి ఆఫీస్ బేరర్ల పదవులకు సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో.. బాపట్ల జిల్లాకు చెందిన చెరుకూరి కవిత ఉపాధ్యక్ష పదవికి, చిత్తూరు జిల్లాకు చెందిన చొక్కా మాధవి కోశాధికారిగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలోని పొదుపు సంఘాల నుంచి ప్రతి జిల్లాలోని మండల సమాఖ్యల నుంచి ఒక్కొక్కరి చొప్పున 26 మంది.. పట్టణ ప్రాంతాల్లో ఒక్కొక్క ప్రాంతం నుంచి ఒకరు చొప్పున నలుగురుతో కలిపి మొత్తం 30 మంది 'స్త్రీనిధి' పరపతి సహకార సమాఖ్య పాలక వర్గ సభ్యులుగా కొనసాగుతారు. 21,22 తేదీల్లో జరిగిన ఎన్నికల్లో ఒక్కొక్క ప్రాంతం నుంచి ఒక్కొక్కరి చొప్పున కేవలం 29 మంది మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణ ప్రాంతాల్లో నాలుగు పదవులకు గానూ ముగ్గురు ప్రతినిధుల ఎన్నికే పూర్తయింది. పాలకవర్గ సభ్యులుగా ఎన్నికైన 29 మంది ప్రతినిధుల నుంచి సోమవారం విజయవాడ – గొల్లపూడిలోని డీఆర్‌డీఏ –టీటీడీసీ సెంటర్‌లో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి గాను ఐదుగురు, ఉపాధ్యక్ష పదవికి ఆరుగురు, కోశాధికారి పదవికి నలుగురు చొప్పున పోటీ పడ్డారు. సాయంత్రం ఎన్నిక నిర్వహించారు. 'స్త్రీనిధి' పరపతి సహకార సమాఖ్య కొత్త పాలకవర్గ ఎన్నికల ప్రక్రియ ఈ నెల తొమ్మిదవ తేదీ నుంచి ప్రారంభం కాగా.. మొత్తం ఎన్నికల ప్రక్రియకు రాష్ట్ర సహకార శాఖకు చెందిన డిప్యూటీ రిజిస్ట్రార్ పెద్దింటి కిరణ్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

గర్జించిన ప్రజలు, కార్మికులు

- విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు 'ప్రజా గర్జన'
- ఉద్యమానికి ప్రభుత్వం మద్దతు : వైవీ సుబ్బారెడ్డి
- ముందుండి నడిపిస్తాం : మంత్రి అమర్‌నాథ్
- ప్రజా ఉద్యమంగా ఉక్కు పోరాటం : కొణతాల

గాజువాక: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకొంటామని, పరిశ్రమను పరిరక్షించుకొంటామని విశాఖ ప్రజ గర్జించింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను వెంటనే విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. లేదంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున 'ప్రజాగర్జన' కార్యక్రమం జరిగింది. ప్రజలు, స్టీల్‌ప్లాంట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాలతోపాటు వైఎస్సార్‌సీపీ, సీపీఐ, సీపీఎం తదితర పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజలు పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటు పరమవకుండా కాపాడుకుంటామని వారు ప్రజా గర్జన సభలో ముక్త కంఠంతో నినదించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు పూర్తిస్థాయిలో ఉందని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి ఉద్ఘాటించారు. ఈ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, చివరి వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఈ పరిశ్రమను కాపాడుకోవడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని ప్రధాన మంత్రికి, కేంద్ర మంత్రులకు ఎన్నోసార్లు చెప్పారని, ప్రత్యామ్నాయాలను కూడా సూచించారని చెప్పారు. రుణాలను ఈక్విటీగా మార్చాలని కోరారన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉక్కు పరిరక్షణకు చేసే పోరాటాలను రాష్ట్ర ప్రభుత్వం ముందుండి నడిపిస్తుందని, ఇది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాటగా చెబుతున్నానని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ప్రధాని మోదీ ఇటీవల విశాఖపట్నం వచ్చినప్పుడు జరిగిన సభలో తమకు ప్రజా ప్రయోజనాలు తప్ప మరే ప్రయోజనాలు లేవని సీఎం జగన్ స్పష్టం చేశారని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని ప్రధానికి లేఖలు కూడా రాశారని పేర్కొన్నారు. ఉక్కు కార్మికుల పోరాటం జాతి ఆత్మగౌరవానికి సంబంధించినదని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు గతంలోనూ ప్రయత్నాలు సాగాయని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో అప్పులను పునర్వ్యవస్థీకరించడంతో పాటు విస్తరణకు కూడా ఆమోదాన్ని తెచ్చారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి మాదిరిగా ఈ బాధ్యతను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు, కన్వీనర్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న అన్ని పార్టీల నాయకులు

అమరరాజా ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం


అమరరాజా ఫ్యాక్టరీలో ఎగసి పడుతున్న మంటలు

- పొగ తాకిడికి సొమ్మసిల్లిన ఉద్యోగులు

చిత్తూరు (కలెక్టరేట్), యాదమరి, చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా యాదమరి మండల పరిధిలోని మోర్ధానపల్లిలోని అమరరాజా ఫ్యాక్టరీలో సోమవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం తలెత్తింది. ఫ్యాక్టరీలోని ట్యూబులర్ డివిజన్‌లో మంటలు చెలరేగాయని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. విషయం తెలియగానే హుటాహుటిన ఫ్యాక్టరీకి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు మూడు ఫైరింజన్లు రంగంలోకి దిగాయి. ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి పెద్దిరెడ్డి వెల్లడించారు.

భారీగా ఆస్తి నష్టం

ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. భారీస్థాయిలో మంటలు చెలరేగడంతో అదుపులోకి తీసుకురావడం కష్టతరంగా మారిందని అధికారులు చెబుతున్నారు. రాత్రి 11 గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదు. ఫ్యాక్టరీ మొత్తం దట్టమైన పొగ పెద్దఎత్తున కమ్ముకుంది. పలువురు ఉద్యోగులు పొగ తాకిడికి సొమ్మసిల్లి పడిపోయారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది గంటల తరబడి రెస్క్యూలో పాల్గొన్నారు. పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను పర్యవేక్షించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943